www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 24-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 138 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య రా.12:41 తదుపరి పాడ్యమి, నక్షత్రం: పునర్వసు సా.4:44 తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.12:29-2:02, దుర్ముహూర్తం: ఉ.10:13-11:04, మ.3:21-4:13, అమృతఘడియలు: మ.2:27-3:58, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:55, సూర్యాస్తమయం: 6:47 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నా పేరే పవనం.. అంతటా ఉంటా



13

ఇది తెలియకుండా మాట్లాడేవారంతా కూపస్థ మండూకాలు

నియంత ప్రభుత్వాన్ని ఎదిరించే శక్తిని సినిమాలు, అభిమానులే నాకిచ్చారు

హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

ఇక ఈడీ వేడి!

రంగంలోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

మద్యం ముడుపుల కేసులో కీలక పరిణామం



'శర్వాణీ' డిస్టిలరీ డైరెక్టర్ చంద్రారెడ్డికి నోటీసులు.. 28న విచారణకు హాజరుకావాలని ఆదేశం

జగన్ హయాంలో 'ఆంధ్రా గోల్డ్' పేరుతో శర్వాణీ హవా.. పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీ దర్యాప్తు

ఇదివరకే 'సిట్' నుంచి సమాచార సేకరణ.. ముడుపుల్లో విదేశీ లింకులు లాగడంపై దృష్టి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మద్యం కుంభకోణం కేసు మరో కీలక మలుపు తిరిగింది! వేలకోట్ల ముడుపులు, విదేశీ లింకులు, హవాలా లావాదేవీలతో దేశంలోనే అతిపెద్ద దోపిడీగా భావిస్తున్న ఈ స్కామ్‌లో తీగలాగేందుకు ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. శర్వాణీ ఆల్కోబ్రూ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ ఎనకొండ చంద్రారెడ్డికి ఈడీ సమన్లు జారీ చేసింది. మనీ లాండరింగ్ కేసులో ఈనెల 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ హైదరాబాద్ బ్రాంచ్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతీక్ సింగ్ సమన్లు జారీ చేశారు. తాము గుర్తించిన/దర్యాప్తు జరుపుతున్న 'మనీ లాండరింగ్'కు సంబంధించి వివరాలు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. జగన్ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల లిక్కర్ స్కామ్‌పై విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు నేతృత్వంలో 'సిట్' ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఏ1 రాజ్‌కసిరెడ్డితో మొదలుకుని... వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి వరకు ఈ కేసులో 12 మందిని అరెస్టు చేశారు. ప్రాథమిక చార్జిషీటు కూడా దాఖలు చేశారు. మద్యం ముడుపుల వసూలు నుంచి అవి అంతిమంగా చేరిన చోటు వరకు... అనేక కోణాల్లో 'సిట్' దర్యాప్తు చేసింది. సాంకేతిక ఆధారాలూ సేకరించింది. ఈ కుంభకోణం తీవ్రత నేపథ్యంలో

మిగతా 14వ పేజీలో...

లిక్కర్ నిందితులపై.. రెడ్ కార్నర్ నోటీసులు!

దుబాయ్‌లో ఆరుగురు.. థాయ్‌లో ముగ్గురు

9 మంది వివరాలు కోర్టుకు అందజేసిన సిట్

ఇంటర్‌పోల్ సాయం కోసం సీబీఐతో సంప్రదింపులు.. ఈడీ సహకారం కూడా..

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వేల కోట్ల మద్యం దోపిడీ సొమ్మును దేశం దాటించిన పాత్రధారులు యూఏఈ (దుబాయ్), థాయ్‌లాండ్ దేశాల్లో విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్నారు.. లిక్కర్ కేసు నమోదు కాగానే విమానాల్లో విదేశాలకు చెక్కేసిన తొమ్మిది మంది మద్యం ముఠా సభ్యులను దేశానికి రప్పించే దిశగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందడుగు వేసింది. ఇంటర్‌పోల్ సాయంతో వారిని తీసుకొచ్చే ప్రయత్నాలు

మిగతా 14వ పేజీలో...

తాగుడు పెంచింది జగనే



కమీషన్లు నొక్కేయడానికే పన్నుల వ్యూహం

షాక్ కొట్టేలా రేట్లు పెడతానంటూ అధికారంలోకి

కానీ, మడమతిప్పి చివరికి మహిళలకే షాక్

మద్య నిషేధం పేరిట తొలుత పన్నుల పెంపు

ఫలితంగా ఆకాశాన్ని తాకిన మందు రేట్లు

2020-21లో భారీగా పడిపోయిన అమ్మకాలు

అమ్మకాలతోపాటు కమీషన్లూ తగ్గిన వైనం

ఉలిక్కిపడి వెంటనే మద్యంపై పన్నులు తగ్గింపు

తిరిగి జోరందుకున్న అమ్మకాలూ.. కమీషన్లూ

లిక్కర్ స్కాంపై సిట్ చార్జిషీట్‌లో బయటపడ్డ కుట్ర



విజయవాడలో జరిగిన ఇన్వెస్టోపియా గ్లోబల్-ఆంధ్రప్రదేశ్ సదస్సులో పెట్టుబడులపై అవగాహనా ఒప్పంద ప్రతులతో సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రి, లులూ చైర్మన్ యూసుఫ్ అలీ, సీఐఐ అధ్యక్షుడు ముకుందన్, మంత్రి టీజీ భరత్, సీఎస్ విజయానంద్ తదితరులు

గ్లోబల్ గేట్‌వే ఏపీ

అపార అవకాశాలున్నాయి.. పెట్టుబడులతో రండి

యూఏఈ పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు

ఏడాదిలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం

పారిశ్రామికవేత్తలకు నమ్మకం ముఖ్యం

నేనే వారికి సమన్వయకర్తగా ఉంటా

ఏపీలో విస్తృతంగా వనరులు ఉన్నాయి

భారత్‌కు వచ్చాక ముందు ఏపీని చూడండి

ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ సదస్సులో సీఎం



ఏపీతో కలసి పనిచేస్తాం

యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్

విశాఖలో అల్ట్రా మోడరన్ మాల్ నిర్మిస్తాం

యూసుఫ్ అలీ, లులూ ఇంటర్నేషనల్ చైర్మన్

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్‌వేగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్.. ఉత్తర-దక్షిణ భారతాలకు వారధిగా నిలుస్తోందన్నారు. ఏపీని సందర్శించిన తర్వాతే భారత్‌లో ఇతర ప్రాంతాలకు వెళ్లాలని పారిశ్రామికవేత్తలకు

మిగతా 13వ పేజీలో...

ఎస్ఐపీబీ ఓకే

విశాఖలో 20,216 కోట్ల పెట్టుబడులు

50,600 మందికి ఉద్యోగాలు

16,466 కోట్లతో సిఫి డేటా సెంటర్

సత్వ డెవలపర్స్ 1500 కోట్ల పెట్టుబడి

డేటా విప్లవాన్ని అందిపుచ్చుకుంటున్నాం: లోకేశ్



రాజధానికి 'స్వాతంత్ర్యం'!

13

ఈసారి అమరావతిలోనే పంద్రాగస్టు వేడుకలు

తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశాలు

సోలార్ ప్యానెళ్ల కింద సాగు

12

త్వరలో 'అగ్రివోల్టాయిక్స్' పాలసీ

వ్యవసాయ వర్సిటీలతో ఒప్పందాలు

ఎన్ఆర్ఈడీసీఏపీ, ఇంధన సంస్థలు వెల్లడి



2

వెస్ట్ ఆర్కిటికా దేశమట.. ఆ దేశానికి రాయబారి అట..

ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో నకిలీ ఎంబసీ తెరిచిన ఘనుడు

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతపై వల.. భారీ ఎత్తున వసూళ్లు

హవాలా మార్గాల్లో షెల్ కంపెనీలకు..

నిందితుడు హర్షవర్ధన్ జైన్ అరెస్ట్

కర్ణాటకలో కాఫీ, టీ అమ్మకాలు బంద్

2

జీఎస్టీ నోటీసుల నేపథ్యంలో చిరు వ్యాపారుల నిరసన

రూ.లక్షల్లో పన్ను కట్టాలంటూ కొందరికి నోటీసులు అందాయని ఆందోళన

సీఎం సిద్దరామయ్యతో చర్చలు

పన్నులు వసూలు చేయబోమంటూ ముఖ్యమంత్రి హామీ.. ఆందోళన విరమణ

అనిల్ అనుచరుల ఖాతాల్లో వందల కోట్ల లావాదేవీలు!



చేతికి మట్టి అంటకుండా వారి ద్వారానే దందా

బ్యాంక్ స్టేట్‌మెంట్లు సేకరిస్తున్న పోలీసులు

ఆ ఖాతాల నుంచి వైసీపీ పెద్దల అకౌంట్లకు జమ

నగదు లావాదేవీల్లో తాడేపల్లి ప్యాలెస్‌కూ లింకు?

అనిల్‌పై క్వార్ట్జ్‌తో పాటు మనీలాండరింగ్ కేసు కూడా!

విదేశాలకు పారిపోయిన అనిల్ ముఖ్య అనుచరుడు

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ క్వార్ట్జ్ అక్రమ తవ్వకం, అమ్మకాల కథంతా తన అనుచరుల ద్వారా సాగించినట్లు తేలింది. వారిని ముందుపెట్టి దందాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆయన ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపిన సంగతి తెలిసిందే. శ్రీకాంత్‌రెడ్డిది సాధారణ కుటుంబం. కానీ ఆయనతోపాటు, ఆయన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో రూ.వందల కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. ఆ డబ్బు మొత్తం క్వార్ట్జ్ వ్యాపారుల నుంచి వచ్చినట్లు

మిగతా 14వ పేజీలో...

'వెదర్‌మ్యాన్' అలర్ట్!

వాతావరణ సమాచారమిచ్చే వ్యక్తులు

"మరో రెండు, మూడు గంటల్లో విజయవాడ పరిసరాలు, దానికి ఆనుకుని మంగళగిరి, గుంటూరు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది. పిడుగులు పడే అవకాశం కూడా ఉంది!"

"ఈ రోజు ఉదయం పది గంటలకు వైజాగ్‌లో పలుచోట్ల వర్షం కురుస్తుంది. కాబట్టి ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోగలరు!"

- ఇవి ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న వాతావరణ హెచ్చరికలు కావు! వ్యక్తులే 'వెదర్‌మ్యాన్'గా అవతారమెత్తి... సోషల్ మీడియాలో పంపుతున్న సందేశాలు! అత్యధిక సందర్భాల్లో వాళ్లు చెప్పింది చెప్పినట్లుగా జరుగుతుండటం విశేషం!



వైజాగ్ వెదర్‌మ్యాన్ సాయికిరణ్ తన ఇంటిపై ఏర్పాటుచేసుకున్న వెదర్ సెన్సర్లు

సోషల్ మీడియాలో భారీగా ఫాలోయింగ్

వర్షాలు, ఎండలు, గాలులు, తుఫాన్లపై బులెటిన్లు

ఉద్యోగుల కోసం ఉదయం, సాయంత్రం సమాచారం

కేవలం అభిరుచితోనే 'వెదర్‌మ్యాన్' అవతారం

ప్రధాని ప్రశంసలు అందుకున్న ఏపీ వెదర్‌మ్యాన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైజాగ్ వెదర్‌మ్యాన్, ఈస్ట్‌కోస్ట్ వెదర్‌మ్యాన్, శ్రీకాకుళం వెదర్‌మ్యాన్... వీళ్లంతా ఎవరనుకుంటున్నారా? 'వాన రాకడ'ను ఎప్పటికప్పుడు గుర్తించి... తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసే వ్యక్తులు! వీళ్లేమీ భారత వాతావరణ విభాగాని(ఐఎండీ)కి పోటీ కాదు! భారీ వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్న వారూ కాదు! కేవలం... వాతావరణంపై ఆసక్తి, అభిరుచితో 'వెదర్‌మ్యాన్'లుగా అవతరించారు. ప్రతిరోజూ, అత్యవసర సమయాల్లో సోషల్ మీడియాలో వాతావరణ సమాచారం అందిస్తున్నారు. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఉన్నట్టుగానే మన రాష్ట్రంలోనూ పలువురు వెదర్‌మ్యాన్‌లు

మిగతా 12వ పేజీలో...

మూడో రోజూ అదే తీరు

- పార్లమెంట్‌లో కొనసాగిన విపక్షాల నిరసన
- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ఆందోళన
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు



పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, జూలై 23: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిపక్షాలు మూడో రోజు కూడా నిరసన కొనసాగించాయి. దీనిపై చర్చకు పట్టుబట్టిన విపక్ష సభ్యులు సభా కార్యకలాపాలు జరగకుండా అడ్డు తగిలారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకుపోయారు. సభ్యులు ప్లకార్డులు పట్టుకోరాదని, వెళ్లి తమ స్థానాల్లో కూర్చోవాలని స్పీకర్ ఓం బిర్లా కోరినా వినిపించుకోలేదు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆందోళనలు సద్దుమణగకపోవడంతో

మిగతా 2వ పేజీలో...

28న లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

- 29న రాజ్యసభలో.. ఒక్కో సభకు 16 గంటల చొప్పున కేటాయింపు
- కాల్పులు విరమింపజేశానని ట్రంప్ పాతికసార్లు అన్నారు

పదే పదే అంటున్నారంటే అనుమానంగానే ఉంది: రాహుల్‌గాంధీ



ముందస్తు బెయిల్‌పై 49 పేజీల తీర్పా?

బెయిల్ దశలోనే మొత్తం విచారణ జరిపినట్టు ఉంది

ఐపీఎస్ సంజయ్ కేసులో సుప్రీంకోర్టు ఆశ్చర్యం

వారంలో ఒప్పంద పత్రం, ఇన్‌వాయిస్‌లు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

14

జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు ధర్మాసనం

దాంట్లో నేను భాగస్వామిగా ఉండను

గతంలో ఈ అంశంపై ఏర్పాటైన విచారణ కమిటీలో సభ్యుడిగా ఉన్నాను కాబట్టే..

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వెల్లడి

2

రాజ్‌నాథ్ లేదా నడ్డా!

కొత్త ఉపరాష్ట్రపతిగా వీరిలో ఒకరికి చాన్స్.. బీజేపీ వర్గాల్లో చర్చ

మోదీ, షాకు నమ్మకమైన నేతలుగా వారికి గుర్తింపు

పరిశీలనలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పేర్లూ..





న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఆ పదవిలో మరో నేతను ఎన్నుకునేందుకు బీజేపీ అగ్రనేతలు సన్నాహాలు ప్రారంభించారు. ఆ పార్టీ వర్గాల అంచనా ప్రకారం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లేదా ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 10వ తేదీతో 74 ఏళ్లు పూర్తిచేసుకున్న రాజ్‌నాథ్‌సింగ్.. ప్రధాని నరేంద్రమోదీకి, హోంమంత్రి అమిత్ షాకు నమ్మదగ్గ నేతగా నిరూపించుకున్నారు. ప్రతిపక్షాల

మిగతా 2వ పేజీలో...

ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం

ఉభయ సభల సభ్యులతో ఎలక్టోరల్ కాలేజీ ఏర్పాటు

వీలైనంత త్వరగా షెడ్యూలు ప్రకటన: ఈసీ

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత 30 రోజుల్లో పోలింగ్

వెస్ట్ ఆర్కిటికా దేశమట.. ఆ దేశానికి రాయబారి అట..

- ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో నకిలీ ఎంబసీ తెరిచిన ఘనుడు
- నిందితుడు హర్షవర్ధన్ జైన్ అరెస్ట్



లఖనవూ, జూలై 23: వెస్ట్ ఆర్కిటికా, సెబోర్గా, లోడోనియా, పౌల్వియా అనే కాల్పనిక దేశాల పేరుతో భారత్‌లో అనధికారికంగా రాయబార కార్యాలయాన్ని నడుపుతూ.. యువతను ఉద్యోగాల పేరుతో మోసగిస్తున్న కేటుగాడి ఆటను ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) పోలీసులు కట్టించారు. ఈ కేసులో గాజియాబాద్‌కు చెందిన హర్షవర్ధన్ జైన్‌ను అరెస్టుచేసి, అతని నుంచి నకిలీ డిప్లొమాటిక్ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు ఉన్న నాలుగు వాహనాలు, 12 నకిలీ రాయబార పాస్‌పోర్టులు, విదేశాంగ మంత్రిత్వ శాఖ ముద్రలతో ఉన్న నకిలీ పత్రాలు, రెండు నకిలీ పాన్ కార్డులు, వివిధ కాల్పనిక దేశాలకు చెందిన 34 స్టాంపులు, రెండు నకిలీ ప్రెస్ కార్డులు, రూ.44.7 లక్షల నగదు, విదేశీ కరెన్సీ, అనేక సెల్ కంపెనీలకు సంబంధించిన పత్రాలు, 18 నకిలీ డిప్లొమాటిక్ వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను సీజ్ చేశారు. నిందితుడిని తదుపరి దర్యాప్తు నిమిత్తం కవినగర్ పోలీసులకు అప్పగించారు. కవినగర్ పోలీసుల కథనం ప్రకారం.. గాజియాబాద్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న హర్షవర్ధన్ జైన్ అందులో 'వెస్ట్ ఆర్కిటికా' అనే కాల్పనిక దేశానికి సంబంధించిన రాయబార కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. తనను తాను ఆ సూక్ష్మ దేశానికి(మైక్రోనేషన్) రాయబారిగా పరిచయం చేసుకునేవాడు. సెబోర్గా, లోడోనియా, పౌల్వియా అనే మైక్రోనేషన్స్‌తో కూడా తనకు సంబంధాలున్నట్లు చెప్పుకొంటూ.. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతను మోసగించేవాడు. యువత నుంచి కొల్లగొట్టిన సొమ్మును హవాలా మార్గాల్లో అనేక సెల్ కంపెనీలకు తరలించేవాడని పోలీసులు అనుమానిస్తున్నారు. తాను విదేశీ రాయబారినని నమ్మించేందుకు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఫొటోలు దిగినట్లుగా డిజిటల్ చిత్రాలను సృష్టించి.. ప్రజలకు చూపేవాడు. తన వాహనాలకు 'డిప్లొమాటిక్ నంబర్ ప్లేట్లు' బిగించి, వాటిలో తిరిగేవాడు. హర్షవర్ధన్ కదలికలపై అనుమానం రావడంతో.. అరెస్టు చేసినట్లు ఎస్‌టీఎఫ్ వర్గాలు వెల్లడించాయి. శాటిలైట్ ఫోన్‌ను కలిగి ఉన్నందుకు అతనిపై 2011లో కేసు నమోదైంది. వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు చంద్రస్వామి, అంతర్జాతీయ ఆయుధాల వ్యాపారి అద్నాన్ ఖషోగ్గీ వంటి వారితో ఇతనికి సంబంధాలున్నట్లు గుర్తించారు. కాగా.. 2001లో అమెరికాకు చెందిన ట్రావిస్ మెకెన్హెన్రీ అనే అధికారి 'వెస్ట్ ఆర్కిటికా' దేశాన్ని ప్రకటించి, తాను ఆ దేశానికి గ్రాండ్ డ్యూక్‌గా పేర్కొన్నారు. 6.2 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న ఆ దేశంలో.. 2,356 మంది పౌరులు జీవిస్తున్నట్లు చెప్పుకొన్నారు. వాస్తవానికి అలాంటి దేశమేలేదు. నిజానికి ఆర్కిటిక్ ఖండం ఉత్తర ధ్రువంలో ఉంటుంది. కానీ, వెస్ట్ ఆర్కిటికా దేశం అంటార్కిటికాలో ఉన్నట్లు పేర్కొనడం హర్షవర్ధన్ జైన్ బండారాన్ని బయటపెట్టి ఉంటుందని స్పష్టమవుతోంది.

లోకం తీరు



పుట్టింటికి వెళ్లిపోయిన భార్య తిరిగి రావాలని నరబలి

- ఆరేళ్ల బాలుడిని హతమార్చిన భర్త.. రాజస్థాన్‌లో ఘోరం

జైపూర్, జూలై 23: తనను వదిలి పుట్టింటికి వెళ్లిపోయిన భార్యను తిరిగి రప్పించుకునేందుకు రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి నరబలి ఇచ్చాడు. ఓ మంత్రగాడి మాటలు నమ్మి.. అన్న కొడుకుని హతమార్చాడు. రాజస్థాన్‌లోని సరయకళ గ్రామంలో జూలై 19న ఈ దారుణం జరిగింది. సరయకళకు చెందిన మనోజ్ ప్రజాపత్ మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండేవాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో భార్య తన వద్దకు తిరిగి వచ్చేందుకు ఏం చేయాలంటూ సునీల్ కుమార్(38)అనే మంత్రగాడిని మనోజ్ సంప్రదించాడు. కాళీమాతకు ఓ చిన్నారిని బలిచ్చి, ఆ చిన్నారి రక్తం, గుండెతో పూజ చేస్తే నీ భార్య నీ వశం అవుతుందని సునీల్ సూచించాడు. జూలై 19న పూజ చేయాలని, తనకు రూ.12వేలు ఇవ్వాలని చెప్పాడు. మనోజ్ తన అన్నకుమారుడు లోకేశ్(6)ను బలి ఇవ్వాలనుకున్నాడు. ఈ క్రమంలో 19న లోకేశ్‌ను మనోజ్ ఎత్తుకెళ్లాడు. ఓ పాడుబడిన ఇంట్లోకి తీసుకెళ్లి పీక కోసి చంపేశాడు. అనంతరం ఆ బాలుడి శరీరంలోని వివిధ భాగాల నుంచి సిరంజితో రక్తం తీసి మృతదేహంపై గడ్డి వేసి వెళ్లిపోయాడు. అయితే, కుటుంబసభ్యులు అదే రోజు రాత్రి మృతదేహాన్ని గుర్తించారు. బాలుడి సోదరి ఇచ్చిన సమాచారంతో పోలీసులు మనోజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన ఘోరాన్ని బయటపెట్టాడు. మనోజ్, మాంత్రికుడును పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

జెలెన్‌స్కీకి వ్యతిరేకంగా ఆందోళనలు



కీవ్, జూలై 23: ఉక్రెయిన్‌వ్యాప్తంగా ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. అవినీతిని నిరోధించే ప్రధాన స్వతంత్ర సంస్థలను బలహీనపరిచేలా ఆయన కొత్త చట్టాన్ని తీసుకువస్తూ సంతకం చేయడమే ఇందుకు కారణం. మూడేళ్లుగా రష్యాతో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పౌరుల మద్దతు జెలెన్‌స్కీకి ఉన్నా.. తాజా చట్టంతో ఆయనపై వ్యతిరేకత వెల్లువెత్తడం గమనార్హం..! ఉక్రెయిన్‌లో అవినీతిని నిరోధించేందుకు స్వతంత్ర సంస్థలుగా నేషనల్ యాంటీ-కరప్షన్ ప్రాసిక్యూటర్ ఆఫీస్(ఎన్ఏబీయూ), స్పెషలైజ్డ్ యాంటీ-కరప్షన్ ప్రాసిక్యూటర్ ఆఫీస్(ఎస్ఏపీవో) పనిచేస్తున్నాయి. జెలెన్‌స్కీ సంతకం చేసిన తాజా చట్టంతో.. ఈ సంస్థల స్వతంత్రత ప్రమాదంలో పడుతుంది. వీటిపై ప్రాసిక్యూటర్ జనరల్‌కు నియంత్రణ దఖలుపడుతుంది. సోమవారం రాత్రి జెలెన్‌స్కీ ఈ బిల్లుపై సంతకం చేసి, ఆమోదించడంతో అది చట్టంగా మారింది.

కోర్టు వద్ద కిడ్నాప్ చేసి.. వేట కొడవళ్లతో నరికి..

- బెంగళూరుకు చెందిన తండ్రీకొడుకుల దారుణహత్య
- నిందితుల వెనుక దర్శి మాజీ వైసీపీ ఇన్‌చార్జి?



కె.వీరాస్వామిరెడ్డి



కె.వి ప్రశాంత్‌రెడ్డి

అద్దంకి/సంతమాగులూరు, నగరసారావుపేట లీగల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన తండ్రీకొడుకులు కె.వీరాస్వామిరెడ్డి(60), కె.వి.ప్రశాంత్‌రెడ్డి(37)లు బుధవారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండ లం పాతమాగులూరు సమీపంలో దారుణ హత్యకు గురయ్యారు. రియల్ వ్యాపారంలో విభేదాలే ఈ హత్యలకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షి, మృతుల తరపు న్యాయవాది నాగభూషణం అందించిన ప్రాథమిక సమాచారం మేరకు.. సంతమాగులూరుకు చెందిన ఓ కీలక నేత బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా గతంలో పనిచేశారు. తండ్రీకొడుకులు వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అక్కడే సదరు నేతతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారంలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. బెంగళూరులోనే ఉంటున్న సంతమాగులూరు నేత అనుచరుడైన గడ్డం అనిల్‌రెడ్డి, రఘురామిరెడ్డిలతో తండ్రీకొడుకులు ఆర్థిక లావాదేవీలు జరిపే క్రమంలో బ్యాంక్ చెక్‌లు ఇచ్చారు. చెక్ బౌన్స్ కావడంతో అనిల్‌రెడ్డి నర్సరావుపేట కోర్టులో కేసు వేశారు. ఈ నేపథ్యంలో కోర్టుకు హాజరయ్యేందుకు న్యాయవాది నాగభూషణంతో కలిసి తండ్రీకొడుకులు మంగళవారం రాత్రి నర్సరావుపేటకు వచ్చి లాడ్జిలో ఉన్నారు. బుధవారం ఉదయం కోర్టు సమీపంలో ఉన్న హోటల్‌లో టిఫిన్ చేసి బయటికి వచ్చిన ఆ ఇద్దరితో.. కారులో వచ్చిన అనిల్‌కుమార్‌రెడ్డి, రఘురామిరెడ్డి, మరికొందరు వ్యక్తులు కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలను బలవంతంగా కారులోకి నెట్టి కిడ్నాప్‌చేశారు. ఆ సమయంలో న్యాయవాది కొంతదూరం వెంబడించి, వెంటనే నర్సరావుపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. కిడ్నాప్ చేసిన ఇద్దరినీ పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో సంతమాగులూరు మండలం పాతమాగులూరు పరిధిలో ఉన్న ఒక వెంచర్‌లో వేటకొడవళ్లతో అత్యంత కిరాతకంగా నరికి చంపినట్లు సమాచారం. సంతమాగులూరు సీఐ వెంకట్రావు, బాపట్ల డీఎస్పీ సీతారామాంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హంతకులు ఉపయోగించినట్టుగా భావిస్తున్న స్కార్పియో కారును పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు సమీపంలో గుర్తించారు. కారులో మారణాయుధాలను కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు సంతమాగులూరు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

ఆ విద్యార్థులను అనుమతించండి

- వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదవకున్నా వారిని దరఖాస్తు చేసుకోనివ్వండి: హైకోర్టు మధ్యంతర ఉత్తర్వు

హైదరాబాద్ జూలై 23(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షకు ముందు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన పై తాజా విద్యా సంవత్సరం 2025కు సంబంధించిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో.. కోర్టుకు వచ్చిన అభ్యర్థులను ఎంబీబీఎస్ బీడీఎస్ వంటి కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలని హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది సైతం.. ఈ నిబంధనను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. అప్పట్లో హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నాలుగేళ్ల నిబంధనను కొట్టేసి, నివాస ధ్రువీకరణ పత్రం ఉన్న అభ్యర్థులందర్నీ స్థానికులుగానే గుర్తించి అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే.. తాజా విద్యా సంవత్సరానికి సంబంధించి సైతం హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై.. చీఫ్ జస్టిస్ ఏకేసింగ్, జస్టిస్ షాంకోసితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. కోర్టుకు వచ్చిన అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరించాలంటూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కాగా, మెడికల్ సీట్ల వ్యవహారంలో స్థానికత అంశంపై పరిష్కారంతో రావాలని.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. లేనిపక్షంలో ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది.

ఇటు విదేశాలకు.. అటు ఆందోళనకు..

చర్చనీయాంశంగా మారుతున్న 'యూపీఐ' సేవలు

- విదేశాల్లోనూ యూపీఐ సేవలకు రంగం
- 'పేపాల్ వరల్డ్ యాప్'తో అందుబాటులో
- మరోవైపు బెంగళూరులో భారీగా యూపీఐ లావాదేవీలు జరగడంపై చిరువ్యాపారులకు జీఎస్టీ నోటీసులు



బెంగళూరులో దుకాణాలు మూసి, నల్ల బ్యాడ్జీలతో నిరసనకు సిద్ధమవుతున్న చిరు వ్యాపారులు

న్యూఢిల్లీ, జూలై 23: భారత్‌లో డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్) సృష్టించిన సంచలనం ఇంతా అంతా కాదు. ఓ రకంగా చెప్పాల్సి వస్తే.. యూపీఐకి ముందు, యూపీఐకి తర్వాత అన్నట్టుగా డిజిటల్ చెల్లింపుల చరిత్ర మారిపోయింది. చిన్న కిరాణా దుకాణంలో రెండు, మూడు రూపాయల నుంచి ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేదాకా దాని విస్తృతి పెరిగింది. అలాంటి యూపీఐ ఓవైపు విదేశాల్లోనూ అందుబాటులోకి వస్తుంటే.. మరోవైపు చిరు వ్యాపారుల్లో ఆందోళనలకూ దారితీస్తోంది.

సెప్టెంబరు నుంచి ప్రపంచవ్యాప్తంగా..

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు అందించే పేపాల్ సంస్థ.. పెద్ద డిజిటల్ వాలెట్లు, చెల్లింపుల వ్యవస్థలను అనుసంధానం చేస్తూ 'పేపాల్ వరల్డ్ యాప్'ను తీసుకువచ్చింది. అందులో యూపీఐ సేవలను భాగం చేసేందుకు ఇటీవలే 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)'తో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్‌లో యూపీఐ సేవలు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి. వివిధ దేశాలవారి మధ్యకూడా చెల్లింపులు సులువుగా జరిగేలా యూపీఐతోపాటు వెన్మో, టెన్‌పే గ్లోబల్ తదితర సంస్థలతోనూ పేపాల్ ఒప్పందాలు చేసుకుంది. దీనితో ఏ దేశంలోని వారు అయినా మరో దేశంలోని వారి మొబైల్ నంబర్ నమోదు చేసి, వాలెట్‌ను ఎంపిక చేసుకుని డబ్బులు బదిలీ చేయడానికి వీలవుతుందని పేపాల్ సంస్థ తెలిపింది. ఉదాహరణకు అమెరికాలోని వారు పేపాల్ వరల్డ్ యాప్‌లో.. భారత్‌లోని ఓ వ్యక్తి మొబైల్ నంబర్‌ను నమోదు చేసి, ఇక్కడి జీపే, ఫోన్‌పే, పేటీఎం వంటి వాలెట్‌ను ఎంపిక చేసి నేరుగా డబ్బులు పంపవచ్చు. తరచూ విదేశాలకు వెళ్లేవారు, విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, అక్కడ ఉద్యోగాలు చేస్తున్నవారు సులువుగా చెల్లింపులు చేయడానికి, సొమ్ము బదిలీ చేయడానికి బాగా ఉపకరిస్తుంది.

కర్ణాటకలో పాలు, కాఫీ, టీ అమ్మకాలు బంద్!

చాలా సులువుగా ఉండటంతో ప్రతిచోటా యూపీఐతో చెల్లింపులు చేయడం పెరిగిపోయింది. ఇలా కర్ణాటకలో భారీగా యూపీఐ లావాదేవీలు జరిగిన చిరు వ్యాపారులు, బేకరీలకు జీఎస్టీ కట్టాలంటూ వాణిజ్య పన్నుల శాఖ ఇటీవల నోటీసులు ఇవ్వడం కలకలం రేపింది. కొందరికైతే లక్షల్లో పన్ను కట్టాలంటూ నోటీసులు అందాయి. కూరగాయలు అమ్మే శంకర్‌గౌడ అనే వ్యాపారికి గత నాలుగేళ్లలో రూ.1.63 కోట్లు యూపీఐ చెల్లింపులు అందాయని, రూ.29 లక్షలు పన్ను కట్టాలని నోటీసు అందింది. ఇలా తమకు అందిన నోటీసులను వెనక్కి తీసుకోవాలంటూ వ్యాపారులు ఆందోళనకు దిగారు. యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని చాలా చోట్ల 'నో యూపీఐ' బోర్డులు పెట్టారు. కేవలం నగదు మాత్రమే తీసుకుంటున్నారు. ఆందోళన మరింత ఉధృతం చేస్తూ.. కర్ణాటక వ్యాప్తంగా పాలు, టీ, కాఫీ విక్రయాలను నిలిపివేశారు. బదులుగా ప్రభుత్వానికి నిరసన తెలుపుతూ.. నల్ల బ్యాడ్జీలు ధరించి, కేవలం బ్లాక్ కాఫీ, బ్లాక్ టీలను మాత్రమే విక్రయిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన కర్ణాటకవ్యాప్తంగా బంద్‌కు కూడా పిలుపునిచ్చారు. ఆందోళన నేపథ్యంలో వ్యాపారులతో ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య బుధవారం చర్చలు జరిపారు. జీఎస్టీ నుంచి మినహాయింపు ఉన్న వస్తుసేవలు అందిస్తున్న వ్యాపారుల నుంచి పన్నులు, బకాయిలేమీ వసూలు చేయబోమని హామీ ఇచ్చారు. కాగా, సీఎం సిద్ధరామయ్య హామీతో వ్యాపారులు ఈ నెల 25న నిర్వహించాలనుకున్న బంద్‌ను ఉపసంహరించుకున్నారు.

బోగీ, బెర్త్ నంబర్లు చేతిపై ముద్రించి..

56 మంది యువతుల అక్రమ రవాణా!?

- బెంగాల్‌లోని జల్పాయ్‌గురి నుంచి పట్నా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌లో గుర్తింపు

న్యూఢిల్లీ, జూలై 23: పశ్చిమబెంగాల్‌లో యువతుల అక్రమ రవాణా గుట్టు రట్టయింది. న్యూ జల్పాయ్‌గురి రైల్వే స్టేషన్‌లో 56 మంది యువతులు పట్నా వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కారు. రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తుండగా.. 18 నుంచి 31 ఏళ్లలోపు వయసున్న ఈ యువతులందరూ ఒకే బోగీలో ఉండడాన్ని గుర్తించారు. ఇంత మంది ఒకే బోగీలో ప్రయాణిస్తుండడంతో అనుమానం వచ్చిన ఆర్పీఎఫ్ సిబ్బంది.. ఆరా తీశారు. వారి వద్ద ఎలాంటి టికెట్లు లేకపోగా.. అందరి చేతులపై మాత్రం బోగీ, బెర్త్ నంబర్లతో కూడిన స్టాంపులు ఉన్నాయి. ఎలాంటి పత్రాలు, టికెట్లు లేకుండా ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించగా.. వారు పొంతన లేని సమాధానాలు చెప్పారు. తామంతా జల్పాయ్‌గురి, కూచ్‌బెహార్, అలీపూర్‌దార్ జిల్లాలకు చెందిన వారమని.. బెంగళూరులో ఉద్యోగాలు ఇప్పిస్తామని తీసుకెళ్తున్నారని యువతులు వెల్లడించారు. బెంగళూరులో ఉద్యోగాల కోసం అయితే.. పట్నా రైల్లో ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నిస్తే జవాబు ఇవ్వలేకపోయారు. అలాగే 56 మంది యువతులతో పాటు ఉన్న ఓ పురుషుడు, మహిళను ప్రశ్నించగా.. పరస్పర విరుద్ధ సమాధానాలు ఇచ్చారని చెప్పారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మానవ అక్రమ రవాణా కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధిత యువతులను వారి వారి కుటుంబాలకు అప్పగించినట్లు అధికారులు చెప్పారు.

రాజీనామాకు ముందు రాష్ట్రపతి భవన్‌కు ధన్‌ఖడ్?

న్యూఢిల్లీ, జూలై 23: మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖను 'ఎక్స్'లో పోస్ట్ చేసే ముందు.. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారా? తన రాజీనామా లేఖను ఆమెకు సమర్పించారా? విశ్వసనీయ వర్గాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఆరోజు ఆయన ఎలాంటి ముందస్తు షెడ్యూలూ లేకుండా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లినట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి. ఆయన అలా అకస్మాత్తుగా రావడంతో రాష్ట్రపతి సచివాలయ సిబ్బంది కంగారుపడ్డారు. అక్కడ ఉండే 'ఎయిడ్-డి-క్యాంప్' (ప్రత్యేక కార్యదర్శి స్థాయి అధికారి.. సాధారణంగా ఈ పదవిలో ఒక సైనికాధికారిని నియమిస్తారు) మిలటరీ కార్యదర్శి వద్దకు వెళ్లి ధన్‌ఖడ్ రాక గురించి సమాచారం ఇచ్చారు. రాష్ట్రపతికి తన రాజీనామా లేఖను సమర్పించిన అరగంట తర్వాత ధన్‌ఖడ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు వీలైనంత త్వరలో షెడ్యూల్: ఈసీ

న్యూఢిల్లీ, జూలై 23: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా నేపథ్యంలో.. ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈమేరకు ఉభయసభల సభ్యులతో ఎలక్టోరల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నట్టు.. రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులను ఖరారు చేస్తున్నట్టు వెల్లడించింది. సన్నాహక చర్యలు పూర్తయ్యాక, వీలైనంత త్వరగా ఎన్నికల షెడ్యూలును ప్రకటిస్తామని వివరించింది. నిబంధనల ప్రకారం.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి 30 రోజుల్లోగా పోలింగ్ జరగాల్సి ఉంటుంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడానికి..పార్లమెంటు ఉభయసభలకూ ఎన్నికైన సభ్యులతోపాటు, నామినేటెడ్ సభ్యులు కూడా అర్హులే.

జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు సీజేఐ దూరం

న్యూఢిల్లీ, జూలై 23: నోట్ల కట్టల వ్యవహారంలో జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు బెంచ్ ఏర్పాటు చేస్తామని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. అయితే, ఆ బెంచ్‌లో తాను ఉండబోనని ప్రకటించారు. ఈ వ్యవహారంపై జస్టిస్ సంజీవ్ ఖన్నా సీజేఐగా ఉన్నప్పుడు నిర్వహించిన విచారణ కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నాను కాబట్టి కొత్తగా ఏర్పాటు చేసే బెంచ్‌లో ఉండకూడదని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. జస్టిస్ వర్మ పిటిషన్‌పై వీలైనంత త్వరగా విచారణ చేపట్టాలని ఆయన తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ బుధవారం సీజేఐ నేతృత్వంలోని బెంచ్‌కు విజ్ఞప్తి చేశారు. పలు రాజ్యాంగపరమైన అంశాలను పిటిషన్‌లో లేవనెత్తామని తెలిపారు. దానికి సీజేఐ స్పందిస్తూ తన నిర్ణయాన్ని తెలిపారు.

విదేశీ పర్యటనకు వెళ్లిన మోదీ

న్యూఢిల్లీ, జూలై 23: ప్రధాని మోదీ యూకే, మాల్దీవుల్లో 4రోజులు పర్యటించేందుకు బుధవారం బయలుదేరి వెళ్లారు. తన పర్యటనతో రెండు దేశాలతో భారత్ దౌత్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ప్రధాని ఆశాభావం వ్యక్తంచేశారు. యూకే పర్యటనలో భాగంగా బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో మోదీ భేటీ అవుతారు. ఈ సందర్భంగా భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకం చేస్తారు. ఈ ఒప్పం దం ద్వారా 99 శాతం భారతీయ ఎగుమతులకు సుంకాల నుంచి మినహాయింపు లభించనుంది. యూకే పర్యటన తర్వాత మోదీ మాల్దీవులకు వెళ్తారు. అక్కడ 26న జరిగే 60వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు.

మోదీ మౌనం అనుమానాన్ని పెంచుతోంది

- కాల్పులు విరమింపజేశానని ట్రంప్ పాతిక సార్లు అన్నారు
- కానీ, మోదీ ఒక్కసారన్నా స్పందించలేదు
- ప్రధానిని చూస్తే ఏదో తేడా కొడుతోంది
- ట్రంపే కాల్పులను ఆపించారు: రాహుల్



బుధవారం పార్లమెంటు ఆవరణలో రాహుల్, డీఎంకే ఎంపీ బాలు

న్యూఢిల్లీ, జూలై 23: భారత్-పాకిస్థాన్ మధ్య తానే కాల్పులు విరమింపజేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికి పాతిక సార్లు అన్నారని.. దీనిపై మోదీ ప్రభుత్వం ఎందుకు స్పందించదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నిలదీశారు. కాల్పులు విరమింపజేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. దీనిపై ప్రధాని మోదీ ఒక్కసారి కూడా జవాబివ్వలేదంటే ఏదో తేడా కొడుతోందని వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణ దిశగా మధ్యవర్తిత్వం నెరిపానని ట్రంప్ చెబుతూ ఉన్నా.. మోదీ మౌనం వహిస్తున్నారని..అమెరికా అధ్యక్షుడిగా విధేయుడిగా ఉండాలని అనుకుంటున్నారా అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. 'ట్రంప్ ఒకటికి పదిసార్లు నేనే యుద్ధాన్ని ఆపానంటూ భారత్‌ను అవమానిస్తుంటే మోదీ గట్టిగా స్పందించాలి. కానీ ఆయన మాట్లాడడం లేదు. ఇది ఆయన బలహీనతను సూచిస్తోంది' అని ఖర్గే అన్నారు. ప్రతిపక్షం డిమాండ్ చేసినట్లుగా ఈ అంశంపై పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేయాలంటారా అని విలేకరులు అడుగగా.. ప్రధాని ఎలా ప్రకటన చేస్తారని రాహుల్ ఎదురుప్రశ్న వేశారు. 'ఆయనేం చెబుతారు? కాల్పుల విరమణ ట్రంప్ చేయించారని చెబుతారా? చెప్పరు. కానీ అదే కరెక్టు. మోదీ దాక్కోలేరు. ట్రంపే కాల్పులు ఆపించారు. యావత్ ప్రపంచానికీ ఈ వాస్తవం తెలుసు' అని అన్నారు. దేశంలో ఎన్నికలను దొంగిలిస్తున్నారని రాహుల్ మరోసారి ఆరోపించారు. బిహార్‌లో 52 లక్షల ఓట్లను తొలగించడంపై స్పందిస్తూ.. 'ఇది 52 లక్షల ఓట్ల గురించి కాదు. బిహార్ ఒక్కదాని గురించే కాదు. మహారాష్ట్రలోనూ మోసం చేశారు. దీనిపై ఈసీని ప్రశ్నించాం. ఓటర్ల జాబితాలను చూపించాలని అడిగితే చూపించలేదు. ఎన్నికల బూత్‌లలో వీడియో ఫుటేజీ కోరితే.. రూల్స్‌ను సవరించేశారు. బిహార్లో ఎస్ఐఆర్ పేరుతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సోదరసోదరీమణుల ఓట్లను కాజేస్తున్నారు. దీనిపై మౌనంగా కూర్చోం. ప్రజల హక్కుల కోసం ఇండియా కూటమి పార్లమెంటు నుంచి వీధుల వరకు పోరాడుతుంది' అని రాహుల్ స్పష్టంచేశారు.

మూడోరోజూ అదే తీరు..

(మొదటి పేజీ తరువాయి)

ఉభయసభలూ తొలుత మధ్యాహ్నానికి, తర్వాత గురువారానికి వాయిదా పడ్డాయి. అంతకు ముందు సభా కార్యకలాపాలు ప్రారంభం కాకముందే ఇండియా బ్లాక్‌కు చెందిన పలు పార్టీల ఎంపీలు పార్లమెంట్ కాంప్లెక్స్ మకర ద్వారం బయట నిలబడి ఆందోళన చేపట్టారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, డీఎంకేకు చెందిన టీఆర్ బాలు, శివసేన యూబీటీకి చెందిన సంజయ్ రౌత్, టీఎంసీకి చెందిన కల్యాణ్ బెనర్జీ పాల్గొన్నారు.

సిందూర్‌పై 28న లోక్‌సభలో.. 29న రాజ్యసభలో చర్చ

న్యూఢిల్లీ, జూలై 23: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 28న లోక్‌సభలో, 29న రాజ్యసభలో చర్చ జరగనుంది. దీనికోసం ఒక్కో సభకు 16 గంటలు చొప్పున ప్రభుత్వం సమయం కేటాయించింది. బుధవారం జరిగిన రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్చలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తారని భావిస్తున్నారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ పదేపదే ప్రకటించుకోవడంపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరగాలని కాంగ్రెస్ సహా విపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో చర్చకు తేదీని నిర్ణయించారు. సిందూర్‌పై చర్చలో ప్రభుత్వం తన వాదనను దూకుడుగా వినిపించడానికి సిద్ధమవుతోంది. సీడీఎస్ అనిల్ చౌహాన్, రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, త్రివిధ దళాల అధిపతులతో రాజ్‌నాథ్ భేటీలు నిర్వహించారు.

బిహార్ ఎన్నికలను బహిష్కరించే యోచన

బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ వెల్లడి



పాట్నా, జూలై 23: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ నేపథ్యంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను బాయ్‌కాట్ చేయాలని విపక్ష మహాఘట్‌బంధన్ యోచిస్తోంది. ఈ విషయాన్ని బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ వెల్లడించారు. ఈ విషయంలో ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకుంటామని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై బుధవారం బిహార్ అసెంబ్లీ అట్టుడికింది. అధికార, విపక్ష సభ్యులు పరస్పరం దుర్భాషలాడుకున్నారు. నల్ల టీ షర్ట్ ధరించి వచ్చిన తేజస్వీ యాదవ్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ సరిగ్గా ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టడాన్ని తప్పుబట్టారు. "నకిలీ ఓటర్ల ఏరివేత అంటున్నారు. మరి ఈ నకిలీ ఓటర్లతోటే ప్రధానిగా మోదీ, సీఎంగా నితీశ్ గెలిచారా" అన్నారు.

తేజస్వీ పిల్లవాడు

అసెంబ్లీలో తేజస్వీ ప్రసంగిస్తుండగా సీఎం నితీశ్ అడ్డు తగిలారు. తేజస్వీని పిల్లాడిగా అభివర్ణించారు. ఇలాంటి విషయాలు తేజస్వీకి అర్థం కావన్నారు. అసెంబ్లీ సమావేశాలు మూడ్రోజుల్లో ముగుస్తాయని, ఆ తర్వాత కావాలంటే ఎన్నికల సభల్లో ప్రసంగించుకోవాలని ఎద్దేవా చేశారు.

ఐదేళ్ల విరామం తర్వాత చైనీయులకు భారత్ పర్యాటక వీసాలు

బీజింగ్, జూలై 23: చైనీయులకు పర్యాటక వీసాల జారీని పునఃప్రారంభిస్తున్నట్టు భారత్ ప్రకటించింది. ఈ వీసాల కోసం గురువారం నుంచి చైనీయులు దరఖాస్తు చేసుకోవచ్చని బీజింగ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత చైనీయులకు భారత్ పర్యాటక వీసాల జారీని పునరుద్ధరించింది. కొవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో 2020లో చైనీయులకు పర్యాటక వీసాల జారీని భారత్ నిలిపివేసింది. తర్వాత గల్వాన్ ఘర్షణ కారణంగా ఈ ఆంక్షలను కొనసాగించింది. అయితే ఇరుదేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచుకునే చర్యల్లో భాగంగా తాజాగా భారత్.. చైనీయులకు పర్యాటక వీసాల జారీని పునఃప్రారంభించింది.

రాజ్‌నాథ్ లేదా నడ్డా!

(మొదటి పేజీ తరువాయి)

గౌరవం కూడా చూరగొన్న రాజ్‌నాథ్‌సింగ్ ఇరు వర్గాల మధ్య వారధిలా ఉపయోగపడతారని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఇప్పటికే పదవీకాలం పూర్తయిన జేపీ నడ్డా పేరును కూడా అగ్రనేతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. మోదీ, షాలకు తలలో నాలుకలా నడ్డా ఉన్నారని, స్పీకర్ ఓం బిర్లా లాగే సభను నియంత్రించగలరని పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడి పేరు ఖరారు కానంత వరకూ నడ్డా విషయం తేల్చడం కష్టమని ఈ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా.. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరు బుధవారం మీడియా వర్గాల్లో చక్కర్లు కొట్టింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాధాకృష్ణన్‌కు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. మర్యాదస్తుడిగా పేరుంది. గతంలో కొన్నాళ్లు జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా ఆయన గవర్నర్‌గా వ్యవహరించారు. తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకొని అధికారం దక్కించుకోవాలనే ప్రయత్నంలో బీజేపీ ఉంది. ఈ నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన నేతకు ఉపరాష్ట్రపతి పదవి కట్టబెట్టడం ద్వారా తమిళ ప్రజలకు చేరువ కావాలని కమలం పార్టీ యోచిస్తోంది. మరోవైపు జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పేర్లు కూడా ఉపరాష్ట్రపతి పదవికి చర్చకు వస్తున్నాయి.



అమరావతిలో నిర్మాణంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాస గృహం

2 నెలల్లో ఓఆర్ఆర్ ఆర్థిక ప్రతిపాదనలు!

శరవేగంగా అడుగులు వేస్తున్న ఎన్‌హెచ్ యంత్రాంగం


- క్షేత్ర స్థాయిలో సర్వేలో నిమగ్నమైన కన్సల్టెన్సీ సంస్థ
- వెడల్పు రెట్టింపు కావడంతో భూ సేకరణ వ్యయమూ రెండింతలు
- భూమి కోసం 5,200 కోట్లు... మొత్తం అంచనా వ్యయం 21 వేల కోట్లు
- అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖలకు లేఖలు
- విద్యుత్ టవర్ల ఎత్తు పెంచాలని ట్రాన్స్‌కో, పవర్ గ్రిడ్‌లకు సూచన

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డును(ఓఆర్ఆర్) 140 మీటర్లకు విస్తరించి, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా పట్టాలెక్కించడానికి జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) శరవేగంగా అడుగులు వేస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన తొలి అడుగు... ఆర్థిక ప్రతిపాదనల(ఫైనాన్షియల్ ప్రపోజల్స్) రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కన్సల్టెన్సీ సంస్థ ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే చేస్తోంది.

70 నుంచి 140 మీటర్లకు...

అమరావతి డివిజన్ ఎన్‌హెచ్ అధికారులు గతంలో 70 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ నిర్మాణానికి ఆర్థిక ప్రతిపాదనలను రూపొందించారు. వాటిలో ప్రధానంగా భూ సేకరణ, నిర్మాణ వ్యయం అంతర్భాగంగా ఉంటాయి. ప్రాజెక్టుకు మొత్తంగా రూ.16,200 కోట్లు ఖర్చవుతుందనీ, అందులో భూ సేకరణకు రూ.2,600 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. తాజాగా ఓఆర్ఆర్ వెడల్పును 140 మీటర్లకు విస్తరించడానికి కేంద్రం ఆమోదం తెలిపిన నేపథ్యంలో తిరిగి ఆర్థిక ప్రతిపాదనలను రూపొందించాల్సి వచ్చింది. రెట్టింపు భూ సేకరణ చేయాల్సి ఉండటంతో అందుకు గతంలో కేటాయించిన దానికంటే రెట్టింపు... అంటే సుమారుగా రూ.5,200 కోట్లు వ్యయం అవుతుందని భావిస్తున్నారు. దీనితోపాటే సహజంగానే నిర్మాణ ఖర్చు కూడా పెరుగుతుంది. మొత్తం మీద 140 మీటర్ల వెడల్పున ఓఆర్ఆర్‌ను విస్తరించాలంటే సుమారుగా రూ.21 వేల కోట్లు వ్యయాన్ని ఎన్‌హెచ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కన్సల్టెన్సీ సంస్థ సర్వే రిపోర్టులను క్రోడీకరించి, రెండు నెలల్లోగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పింపించాలని ఎన్‌హెచ్ అధికారులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే క్షేత్ర స్థాయిలో పనులకు శ్రీకారం చుడతారు.



ప్రాజెక్టులో సమన్వయ భారం ఎక్కువే

అమరావతి ఓఆర్ఆర్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు. దీనిని పట్టాలెక్కించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని పలు శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికే ఆయా కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నారు. తొలిగా... కేంద్ర పర్యావరణ శాఖ ఉన్నతాధికారులకు గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు అనుమతుల కోసం లేఖ రాశారు. వారికి పంపించాల్సిన వాయు, ధ్వని, నీటి కాలుష్యాలకు సంబంధించిన నివేదికలనూ సిద్ధం చేస్తున్నారు. అత్యంత కీలకమైనది అటవీ భూముల అంశం. కేంద్ర అటవీశాఖ అధికారులకూ ఆమేరకు ఎన్‌హెచ్ అధికారులు లేఖ రాశారు. అటవీ విస్తీర్ణంలో అలైన్‌మెంట్ పరిధి వరకు సరిహద్దులను ఆశాఖ నిర్ణయించాల్సి ఉంటుంది. ఎంత విస్తీర్ణం పోతుందో అంతమేర రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా అడవిని అభివృద్ధి చేసేందుకు భూములు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ భూములను జిల్లా ఫారెస్ట్ అధికారి (డీఎఫ్ఓ) పరిశీలించి సూటబిలిటీ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని జల వనరుల శాఖకూ ఎన్‌హెచ్ అధికారులు లేఖ రాశారు. ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ పరిధిలోని కాలువలు, ఇతర జల వనరులను గుర్తించాలని కోరారు. అవసరమైతే కాలువలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాల్సి ఉంటుంది. విజయవాడ పశ్చిమ బైపాస్ ఇబ్బందులను దృష్టిలోఉంచుకుని విద్యుత్ లైన్ల అలైన్‌మెంట్ మార్చకుండా ఎక్కడికక్కడ టవర్ల ఎత్తు పెంచాలని పీజీసీఐఎల్, ట్రాన్స్‌కో అధికారుల కు ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదించారు. ఈ క్రమంలోనే త్వరలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు.

ఆరు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభం!

సాధారణంగా ఒక గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రాజెక్టును పట్టాలెక్కించాలంటే కనిష్ఠంగా ఏడాది కాలం పడుతుంది. అయితే అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణ పనులను ఆరు నెలల్లో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. అందుకనే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. టెండర్ల దశకు ప్రాజెక్టును వీలైనంత త్వరగా తీసుకొని వెళ్లాలని భావిస్తున్నారు. టెండర్లు పిలిచిన తరువాత ఆలస్యం కాకుండా పనులు ప్రారంభం కావాలంటే భూములు సిద్ధంగా ఉండాలి. అందుకనే భూ సేకరణలో భాగంగా నోటిఫికేషన్ ఇవ్వవలసిందిగా ఎన్‌హెచ్ అధికారులు ఐదు జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఇప్పటికే కోరారు.



3,600 అడుగుల జాతీయ పతాకం

- ఒంగోలులో ప్రదర్శన... వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్‌లో రికార్డు సాధించే లక్ష్యంతో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన అతి పెద్ద భారత జాతీయ పతాకాన్ని బుధవారం ఒంగోలులో ప్రదర్శించారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 4వేల మంది విద్యార్థులు భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన కార్యక్రమం అద్దంకి బస్టాండ్ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకు సాగింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, మేయర్ గంగాడ సుజాత, వాసవి క్లబ్ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శిద్దా సూర్యప్రకాశరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి వెలుగు 2.0

- రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు: మంత్రి కొండపల్లి
- సెర్ప్ పీడీలతో సమీక్ష

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 7.69 లక్షల స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం రూ.30,635 కోట్ల వార్షిక రుణ ప్రణాళికతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు 2.0 ద్వారా ముందుకెళ్తున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. మంగళగిరిలో బుధవారం సెర్ప్ పీడీలతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఏడాదిలో జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ ప్రత్యేకంగా మహిళల ఆధ్వర్యంలో సంస్థల ఏర్పాటు కోసం దృష్టి పెట్టిందన్నారు. 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలో 2.5 లక్షల మంది మహిళలకు ప్రత్యేకంగా బ్యాంకుల నుంచి వ్యక్తిగత రుణ సౌకర్యాలు కల్పించి వస్తు తయారీ, సేవారంగాల్లో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పీడీలు, డీపీఎంలు, ఏపీఎంలు జిల్లాల్లో వ్యవసాయ కార్యకలాపాలను విశ్లేషించి రైతులకు అధిక ఆదాయం ఇవ్వగల ప్రణాళికలను రూపకల్పన చేయాలని సూచించారు. ఈ ఏడాదిలో 350 రైతు ఉత్పత్తి గ్రూపులకు రూ.98.1 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులను పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించి స్పష్టమైన ఫలితాలు సాధించాలని సూచించారు. నెక్(నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్) ద్వారా రూ.50 వేల విలువ చేసే ఎగ్‌కార్ట్‌లను గుంటూరు జిల్లాలో లబ్ధిదారులకు అందించారు. ఈ ఏడాది వెయ్యి ఎగ్‌కార్ట్‌లను ఇచ్చే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మహిళా మార్టుల ఏర్పాటును ప్రోత్సహించిన చిత్తూరు, తిరుపతి, సత్యసాయి జిల్లాల పీడీలు శ్రీదేవి, శోభన్‌బాబు, నరసయ్య, అత్యుత్తమ ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసిన అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల పీడీలు సచీదేవి, సుధారాణిలను మెమెంటోలతో మంత్రి సత్కరించారు. సమీక్షలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో వాకాటి కరుణ, అదనపు సీఈఓ శ్రీరాములు నాయుడు, వ్యవసాయ శాఖ సలహాదారు టి.విజయ్‌కుమార్, సెర్ప్ డైరెక్టర్లు, పీడీలు, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 12 ఫ్లోటింగ్ జెట్టీల అభివృద్ధికి చర్యలు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో భూభాగ సౌకర్యాలతో 12 ఫ్లోటింగ్ జెట్టీలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం కార్యనిర్వాహక సంస్థగా ఏపీ విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఈడబ్ల్యూఐడీసీ)ను నామినేట్ చేసింది. సాగరమాల కింద ప్రతిపాదించిన 12 జెట్టీల అభివృద్ధికి అవసరమైన ఆమోదాలు, ఆర్థిక అనుమతులు కేంద్ర ప్రభుత్వం నుంచి పొందటానికి ఏపీఈడబ్ల్యూఐడీసీకి అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వందేభారత్‌కు ఏలూరు, సామర్లకోటల్లో హాల్ట్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు పలు రైళ్లకు వివిధ స్టేషన్లలో ప్రయోగాత్మకంగా ఆరు నెలలపాటు హాల్ట్ కల్పిస్తున్నామని విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. కొన్ని రైళ్లకు ఒక నిమిషం, మరికొన్నింటికి రెండు నిమిషాల హాల్ట్ ఉంటుందని పేర్కొన్నారు. రైళ్ల వివరాలు....

- పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17479)కు ఆగస్టు మూడు నుంచి చిన్న గంజాం స్టేషన్‌లో ఒక నిమిషం
- బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17481)కు ఆగస్టు ఐదు నుంచి చిన్న గంజాం స్టేషన్‌లో రెండు నిమిషాలు
- గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243)కు ఆగస్టు రెండు నుంచి భీమడోలు స్టేషన్‌లో ఒక నిమిషం
- విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708)కు ఈనెల 24 నుంచి ఏలూరు స్టేషన్‌లో ఒక నిమిషం, తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20707) ఈనెల 25 నుంచి ఒక నిమిషం
- విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833) ఆగస్టు రెండు నుంచి సామర్లకోట స్టేషన్‌లో రెండు నిమిషాలు, తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834) రెండు నిమిషాలు

కలెక్టర్ పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా

- డబ్బు కోరుతూ కొందరికి సందేశాలు

నరసరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టర్ పేరుతో అగంతకులు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాను సృష్టించారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఫొటోతో డీసీ పల్నాడు అని ఖాతాను ప్రవేశపెట్టారు. కలెక్టర్ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను కూడా ఇందులో పోస్టు చేస్తున్నారు. 4,500 మందికి పైగా ఈ ఖాతాను అనుసరిస్తున్నారు. దీనిని కలెక్టర్ అలస్యంగా గుర్తించారు. కొందరు వ్యక్తులను డబ్బు ఇవ్వాలని సందేశాలు పంపినట్టు నిర్ధారించారు. డీసీ పల్నాడు పేరుతో ఉన్నా ఖాతా నకిలీదని, దీని నుంచి వచ్చిన సందేశాలకు స్పందించవద్దని, ప్రలోభాలకు లొంగవద్దని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

వారం కాదు... సభ 60 రోజులు జరగాలి

- అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి
- తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు: అయ్యన్న


మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23(ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీ సమావేశాలంటే వారం, పది రోజులు కాదు. కనీసం సంవత్సరానికి 60 రోజులు కచ్చితంగా జరగాలి. ఆ 60 రోజుల్లోనూ రాష్ట్ర ప్రజల సమస్యలు, సంక్షేమం పట్ల చర్చ ఉండాలి. దురదృష్టమేమిటంటే ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు తక్కువ సమయం జరుగుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు' అని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తిరుపతిలో సెప్టెంబరులో జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహణపై బుధవారం ఆయన కలెక్టరేట్‌లో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలసి జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'అసెంబ్లీ సమావేశాల్లో గతంలోలా మార్పులు రావాల్సి ఉంది. ఇటీవల స్పీకర్ల సదస్సులో నేను, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఈ విషయంపై మాట్లాడుకున్నాం. పార్లమెంట్ స్పీకర్ ఓం బిర్లా దృష్టికి తీసుకెళ్లాం. నేను 1983లో ఎన్టీఆర్ హయాం నుంచి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ఉన్నా. ఆ రోజుల్లో అసెంబ్లీ ఉదయం 10 గంటలకు ప్రారంభమైతే అర్ధరాత్రి 2 గంటల వరకూ సమావేశాలు జరిగేవి. ఒకసారి ఎన్టీ రామారావు హయాంలో తెల్లవారుజామున 3 గంటల వరకూ అసెంబ్లీ సమావేశం జరిగింది. నేడు కొన్ని గంటల్లోనే సమావేశాలు ముగుస్తుండటం దురదృష్టకరం. తిరుపతి వేదికగా సెప్టెంబరు 14, 15 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహిస్తున్నాం. దేశవ్యాప్తంగా అసెంబ్లీల నుంచి, పార్లమెంట్ నుంచి ఉమెన్ కమిటీ ప్రతినిధులు వస్తారు.' అని స్పీకర్ తెలిపారు. అంతకుముందు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఎంతో నష్టపోయిన రాష్ట్రం అభివృద్ధివైపు అడుగులేస్తోందన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కూడా స్వామిసేవలో పాల్గొన్నారు.

పీఎంజీఎస్‌వై కింద 8 రోడ్లు మంజూరు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన-3 బ్యాచ్-1 కింద 2024-25 సంవత్సరానికి సంబంధించి రోడ్ల నిర్మాణానికి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. 8 రోడ్లకు రూ.80.40 కోట్లు, మూడు వంతెనల నిర్వహణకు రూ.3.18 కోట్లు మంజూరుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఐదేళ్లపాటు కాంట్రాక్టర్లు ఈ రోడ్ల నిర్వహణను చేపట్టాల్సి ఉంటుంది.

బ్యాంకు ఖాతాలతో దందా!

- ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా ఆటకట్టు
- సేవింగ్స్ ఖాతాకు 25వేలు, కరెంటు అకౌంట్‌కు 40వేలు చెల్లింపు
- విదేశీయులతో జట్టు కట్టి నెల్లూరు వాసి మోసాలు

ఒంగోలు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో ప్రజలను మోసగిస్తున్న ముఠా గుట్టును ప్రకాశం పోలీసులు రట్టు చేశారు. అమాయకుల బ్యాంకు ఖాతాలతో లావాదేవీలు నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఆరుగురు ముఠా సభ్యులను అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్. దామోదర్ కథనం మేరకు.. కాంబోడియాలో ఉంటున్న వైట్, జిమ్మీ, మౌనికలతో నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన షేక్ యాసిన్(ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం) చేతులు కలిపాడు. విదేశాల్లో వినియోగంలో ఉన్న కొన్ని బెట్టింగ్ యాప్‌లను వీరు భారత్‌లో ప్రమోట్ చేశారు. ఈ ముఠా అంతా ఓ టెలిగ్రామ్‌లో గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. అందులో వైట్, జిమ్మీ, మౌనిక, యాసిన్, నెల్లూరుకు చెందిన శ్యామ్, హైదరాబాద్‌లో ఉంటున్న ప్రణీత్‌తో పాటు మరి కొంత మందిని యాడ్ చేశారు. ఈ గ్రూప్ ద్వారా వ్యాపారం ప్రారంభించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడేవారికి మనీ ట్రాన్స్‌ఫర్ చేయడం కోసం చాలా బ్యాంకు ఖాతాలు అవసరం కావడంతో అమాయికులకు వల వేశారు. సేవింగ్స్ అకౌంట్‌కు రూ.25వేలు, కరెంట్ అకౌంట్‌కు రూ.45వేలు ఇస్తామని, ఖాతాదారులు తమ బ్యాంక్ పాస్‌బుక్, డెబిట్ కార్డు అప్పగించాలని నిబంధన విధించారు. ఈ ఆఫర్‌కు ఆకర్షితుడైన ప్రణీత్ ఒంగోలులో నివాసం ఉంటున్న తన స్నేహితుడు నాయబ్ రసూల్‌కు విషయం చెప్పాడు. రసూల్ తల్లి మస్తానమ్మ, ఒంగోలు పీర్లమాన్యంలో ఉంటున్న ఆయేషా కలిసి కొంతమందితో కర్ణాటక బ్యాంక్, ఐవోబీ, ఫెడరల్ బ్యాంక్‌ల్లో ఖాతాలు తెరిపించారు. కొంత సొమ్ము ముట్టజెప్పారు. వారి పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు నెల్లూరులో ఉంటున్న చైతన్యకు కొరియర్ ద్వారా చేర్చేవారు. అతను ఆ ఖాతాలకు నెట్ బ్యాంకింగ్‌ను సిద్ధంచేసి నగదు బదిలీలకు వినియోగించేవారు. పక్కా సమాచారంతో కేసును ఛేదించిన ప్రకాశం పోలీసులు 27 బ్యాంకు పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నాయబ్ రసూల్, ప్రణీత్, ఉదయగిరికి చెందిన సయ్యద్ షహిజాద్, సింగనబోయిన చైతన్య, షేక్.ఖాదర్‌న్నిస్సా, ఆయేషాను అరెస్టు చేశామని ఎస్పీ వెల్లడించారు.

'స్టెమి'తో హృద్రోగులకు భరోసా!

- తొలి అరగంటలో చికిత్స అందిస్తే ప్రాణాలు దక్కే చాన్స్
- రూ.50 వేల ఖరీదు చేసే ఇంజక్షన్లు ఉచితంగా
- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్

విజయవాడ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన వారికి అత్యవసర చికిత్స అందించి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో ప్రారంభించిన 'స్టెమి' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప సంచాలకులు, కార్డియాలజిస్ట్, సెంట్రల్ సీఎస్ఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ కాన్ఫరెన్స్ ఇటీవల విజయవాడలో జరిగింది. వివరాలను విజయవాడలోని ఆయుష్ ఆస్పత్రి వద్ద బుధవారం ఆయన మీడియాకు వివరించారు. గుండె పోటు వచ్చిన మొదటి అరగంటలో ఆస్పత్రిలో చేరుకుని థ్రోంబోలిటిక్ థెరపీ చేయించుకుంటే బతికే అవకాశం ఉంటుందన్నారు. దీంతో రక్తనాళాల్లో బ్లడ్ క్లాట్స్‌ను తొలగి రక్త ప్రసరణ మెరుగవుతుందన్నారు. స్టెమి కార్యక్రమంలో భాగంగా రూ.50 వేల ఖరీదు చేసే ఇంజక్షన్లను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రభుత్వం అందుబాటులో ఉంచి ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ఆయుష్ ఆస్పత్రి డైరెక్టర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగిన కార్డియాలజీ సొసైటీ కాన్ఫరెన్స్‌కు 400 మంది కార్డియాలజిస్టులు హాజరయ్యారని తెలిపారు.

ఉచిత ప్రయాణానికి 1,400 కొత్త బస్సులు

- 2 వేల ఎలక్ట్రిక్ బస్సులతో ఆర్టీసీకి పూర్వ వైభవం: మంత్రి రాంప్రసాద్


కాకినాడలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కాకినాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ అందించని సంక్షేమ పథకాలను ఈ 11 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అందించింది. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మందికి రూ.13 వేలు వేసిన ఘనత కూడా మాదే. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేసేలా విధివిధానాలు రూపొందిస్తున్నాం' అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కాకినాడ జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో రవాణా శాఖ అధికారులతో భేటీ అయ్యారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. మంత్రులను పరుగులు పెట్టిస్తున్న మంచి ప్రభుత్వం ఇది. సీఎంగా చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేశ్, వారికి అండగా పవన్ కల్యాణ్, మోదీ ఉండగా.. ఆ అవినీతి జగన్మోహన్‌రెడ్డి ఎందుకు? అన్న ఆలోచనతో ప్రజలు ఉండాలి. ఉచిత బస్సు ప్రయాణానికి అవసరమైన 1,400 బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేస్తుంది. సుమారు 2,000 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి పూర్వవైభవంతెస్తాం.' అని అన్నారు.

వైసీపీ నేతలవి మొసలి కన్నీళ్లు

- మంత్రి అనిత.. చింతలపూడిలో 'సుపరిపాలన'



చింతలపూడి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తమపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తోందని వైసీపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని, అవి అక్రమ అరెస్టులు కావని సిట్ విచారణ జరిపిన తర్వాత తీసుకుంటున్న చర్యలని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టంచేశారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో బుధవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ అక్రమ కేసు లు, అరెస్టులంటే వైసీపీ పాలనలో పెట్టిన కేసులేనన్నారు. తిరుపతిలో విమానం దిగి వస్తున్న చంద్రబాబును కదలనివ్వలేదని, ఆయన నేల మీద కూర్చున్నారని, 15 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి కి ఆ విధంగా చేయడం, రాజమహేంద్రవరం జైలుకు తీసుకెళ్లిన తీరు ప్రజలకు తెలుసునన్నారు. 2022లో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 22 మంది చనిపోయిన ఘటనపై అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడితే అప్పటి సీఎం జగన్ లక్ష మందిలో 22 మంది చనిపోతే అదీ ఒక చావేనా అనడం ఆయన తీరుకు నిదర్శనమన్నారు. ప్రజలు రాక్షస పాలనకు తెరదింపి కూటమికి 164 సీట్లు ఇచ్చారని చెప్పారు. ఒక్క ఏడాదిలోనే ఈ పాలన బాగుంటే వచ్చే నాలుగేళ్లల్లో ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న రూపకల్పన జరుగుతోందని తెలిపారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4పై ఎన్నారైల ఆసక్తి: మంత్రి నాదెండ్ల


రాష్ట్ర సచివాలయంలో పీ4 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమానికి ఎన్నారైల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పీ4 కార్యక్రమ కార్యాచరణలో భాగంగా బుధవారం ఆయన సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. తెనాలిని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రవాస భారతీయుల నుంచి మంచి స్పందనే వచ్చిందని, ఇది కేవలం కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. వారు అందించే ప్రతి రూపాయికీ న్యాయం జరుగుతుందన్న నమ్మకంతోనే పేదలను దత్తత తీసుకుంటున్నారన్నారు. తెనాలి నియోజకవర్గంలో ఇప్పటికే 14,280 కుటుంబాలను గుర్తిస్తే, 376 మంది దాతలు ముందుకు వచ్చారని, వారు 3,298 కుటుంబాలను దత్తత తీసుకున్నారని మంత్రి మనోహర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చర్చ జరగాల్సిందే...

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్న 'ఆపరేషన్ సిందూర్' మీద ప్రభుత్వం చర్చకు సిద్ధపడింది. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తన పర్యటనలు ముగించుకొని 26న స్వదేశానికి చేరుకున్నాక, 28న ఈ అంశంపై చర్చ జరగబోతున్నట్టు వార్తలు వింటున్నాం. దాదాపు పదహారు గంటల ప్రత్యేక చర్చ అనంతరం ప్రధాని సమాధానం ఇస్తారు. మూడురోజుల పాటు పార్లమెంట్ ఉభయసభలూ స్తంభించిపోయిన నేపథ్యంలో, అధికారపక్షం తన వైఖరిని సడలించుకున్నందుకు సంతోషించాలి, అభినందించాలి.


బిహార్ ఓటర్ జాబితాకు ఎన్నికల సంఘం చేపట్టిన 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–సర్) మీదా, పహల్గాం ఉగ్రదాడి–ప్రతీకార ఆపరేషన్ సిందూర్ మీదా అధికారపక్షాన్ని చర్చకు దించాలని విపక్షాలు మూడు రోజులుగా తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి. ఈ ప్రతిష్టంభనకు తోడు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా కూడా ప్రభుత్వానికి జవాబు చెప్పుకోవాల్సిన కొత్త సమస్యగా ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో, సిందూర్ మీద చర్చకు ప్రభుత్వం సిద్ధపడటం విపక్షాలతో ఘర్షణను చల్లార్చేందుకు ఉపకరిస్తుంది. సభ వెలుపల ఉభయపక్షాలూ ఎంత రాజకీయమైనా చేసుకోవచ్చును కానీ, దేశ పరువుప్రతిష్ఠలతో ముడిపడిన ఈ అంశం మీద సభ లోపల అర్థవంతమైన, విలువైన, లోతైన చర్చ జరగాలి. పహల్గాం, సిందూర్ రెండూ కూడా జవాబులేని అనేక ప్రశ్నలను మిగుల్చాయి. పాలకులు చెప్పినదానిని నమ్ముతూ వచ్చిన దేశప్రజల్లో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యానాలు గందరగోళం కలిగించాయి. యుద్ధం ఆపడం, యుద్ధవిమానాలు కూలిపోవడం వంటి మాటలు అనుమానాన్ని, ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలో, అధికారపక్షాన్ని అవమానించడమో, నిలదీయడమో లక్ష్యంగా కాక చర్చ హుందాగా సాగేట్టు విపక్షం చూడాలి. యుద్ధం అన్నాక కష్టనష్టాలు, ఎదురుదాడులు, ఉపసంహరణలూ అత్యంత సహజం. ప్రజలకు నిజాలు నిర్భయంగా చెప్పడానికి పార్లమెంట్‌ను మించిన పవిత్రక్షేత్రం మరొకటిలేదు.

సభలో రభస పూర్తిగా ఉపశమించాలంటే బిహార్ విషయంలోనూ ప్రభుత్వం దిగిరావలసిందే. 'సర్'లో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల సమర్పణ గడువు ఇంకో రెండురోజుల్లో ముగియబోతున్నది. 98శాతం ప్రక్రియ పూర్తయిందని ఈసీ అంటోంది. ఆగస్టు ఒకటిన ప్రకటించబోయే ఓటర్ల ముసాయిదా జాబితాలో నుంచి ఎన్నికల సంఘం తొలగించబోతున్న పేర్లు బుధవారం నాటి అంచనాల ప్రకారం 56లక్షలు. చనిపోయినవారు 20 లక్షలు, శాశ్వతంగా వలసపోయినవారు 28 లక్షలు, పలుచోట్ల నమోదైనవారు 7 లక్షలు, ఆచూకీ తెలియనివారు లక్ష ఉన్నారట. రాష్ట్రం వెలుపల ఉన్నవారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చునంటూ ఇస్తున్న అవకాశాన్ని, పొట్టకూటికోసం కార్మికులుగా ఇతర రాష్ట్రాలకు వలసపోయినవారిలో ఎంతమంది వినియోగించుకోగలరో ఈసీకే తెలియదనుకోలేం. ప్రాథమిక పత్రాలుగా ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు కార్డులను పరిగణనలోకి తీసుకోవాలని సూచనచేయడం వినా, ఈ ప్రక్రియలో జోక్యం చేసుకొనేందుకు సుప్రీంకోర్టు ప్రస్తుతానికి ఇష్టపడలేదు. ఈ మూడింటినీ ప్రామాణిక పత్రాలుగా అనుమతించేదిలేదని ఎన్నికల సంఘం వెంటనే తాను సమర్పించిన అఫిడవిట్‌లో తేల్చేసింది. ఓటరు పౌరసత్వాన్ని ప్రశ్నించే, పరీక్షించే, రుజువులు కోరే హక్కు, తనకు దఖలు పడి ఉన్నదని కూడా ఈసీ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో, చట్టసభల్లో తమ ఆగ్రహాన్ని, ఆవేదనను వెలిబుచ్చడంతో పాటు, బిహార్‌తో ఆరంభమై దేశమంతా విస్తరించబోతున్న ఈ కొత్త పౌరసత్వ పరీక్ష వెనుక ఉన్న రాజకీయలక్ష్యాలు, కుట్రలు, ప్రజాస్వామ్యానికి ఒనగూరే నష్టాలు ప్రజలకు తెలియచెప్పాలని విపక్షాలు ఆశించడం సహజం. ఇప్పుడు తొలగించబోతున్న దాదాపు అరకోటిమంది ఓటర్ల జాబితాతోనే గత రెండు దశాబ్దాల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు పలుమార్లు జరిగి, ప్రధాని మోదీనీ, నితీశ్‌కుమార్‌నూ ప్రజలు ఎన్నుకున్నారని విపక్షాలు గుర్తుచేస్తున్నాయి. తన ఉనికినీ, ఓటుహక్కునూ నిరూపించుకోవాల్సిన అంతిమబాధ్యతను పూర్తిగా పౌరుడి నెత్తి మీదను పెట్టిన ఈ 'సర్' ప్రక్రియ మీద పార్లమెంట్ ఉభయసభల్లోనూ లోతైన చర్చ జరగడం అత్యంత అవశ్యం.

వీధికుక్కల సమస్యకు పరిష్కారం లేదా?

దేశంలో వీధికుక్కలు దాడులు చేయడం ఇటీవల బాగా పెరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్ళలో 6,72,860 కుక్క కాటు కేసులు నమోదైనట్లు కేంద్ర పశుసంవర్ధకశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఒక్క జనవరి నెలలోనే 23,180 కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ప్రతియేటా దేశంలో వీధికుక్కల బారిన పడి గాయాలపాలవుతున్న వారి సంఖ్య 26.5 శాతం చొప్పున పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మధ్యప్రదేశ్ ప్రభుత్వం వీధికుక్కల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఏడుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఏకంగా ఒక కమిటీనే నియమించిం



దంటే దేశంలో వీధికుక్కల సమస్య ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పంజాబ్–హర్యాణా హైకోర్టులో దాఖలైన 193 కుక్కల దాడి ఘటనలపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు ఒక్కొక్క పంటిగాటుకు పదివేల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలనీ, గాయం 0.2 సెంటీమీటర్లు ఉండి, కండ ఊడి వచ్చిన కేసుల్లో బాధితునికి పరిహారంగా ఇరవై వేలు చెల్లించాలని తీర్పు చెప్పింది.

విచిత్రమేమంటే, ఎవరినైనా వీధికుక్క కరవటమో, పత్రికలలోను, మీడియాలోను వార్తలు రావటమో, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తటమో లేదా న్యాయస్థానాలు గట్టిగా చీవాట్లు పెట్టటమో జరిగినప్పుడు మాత్రమే అప్పటికప్పుడు అధికారులు సమీక్షలు జరుపుతున్నారు. ఆ తరువాత మెల్లగా సమస్యను పక్కనపడేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఇదే తంతు జరుగుతోంది. ఈ తంతులో అమాయకులైన ప్రజలు గాయపడటమో, ప్రాణాలు కోల్పోవటమో జరుగుతోంది. పాలకులకు, అధికారులకు ఎటువంటి శిక్షలూ ఉండవు. కనుక సమస్య గురించి పెద్దగా పట్టించుకోవటం లేదు. మన దేశంలో ఏటా పదిహేను లక్షల మంది కుక్కకాటుకు గురవుతున్నారని, ఇరవై వేల మంది రేబిస్ వ్యాధి సోకి చనిపోతున్నారనీ, వీరిలో నలభైశాతం పదిహేనేళ్ళ లోపు స్కూలు వయస్సు బాలబాలికలేననీ లెక్కలు చెబుతున్నాయి. ఒక సర్వే ప్రకారం దేశంలో ముప్పై లక్షలకు పైగా వీధికుక్కలు ఉన్నాయి.

పంచాయితీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల చట్టాలలో ప్రమాదకరమైన వీధికుక్కల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల గురించి నిబంధనలు స్పష్టం చేస్తున్నా, సంబంధిత అధికారులు వాటిని అమలుచేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇందుకు కారణం– చట్టాల అమలు తీరును పర్యవేక్షించేవారు, సకాలంలో సమీక్షించేవారు లేకపోవటం; చట్టాలు, నిబంధనలను అమలుచేయని అధికారులపై సరైన చర్యలు లేకపోవటం.


అలసత్వాన్ని ప్రదర్శించే అధికారులపై కొరడా ఝుళిపించాలి. కుక్కకాటుకు గురైన వారికి నిర్ణీత మొత్తంలో పరిహారాన్ని బాధ్యులైన అధికారుల నుంచి వసూలు చేసి బాధితులకు చెల్లించేలా నిబంధనలను మార్చాలి. స్టెరిలైజేషన్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించి, చిత్తశుద్ధితో సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. సకాలంలో చర్యలు తీసుకుంటే వీధికుక్కల వల్ల రేబిస్ వ్యాధి బారినపడే వారి సంఖ్యను 80 శాతం వరకు తగ్గించవచ్చు. రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిత్యం సమీక్షించాలి. న్యాయస్థానాలు కూడా తాము ఇచ్చిన తీర్పులను తరచు సమీక్షించి, అలసత్వం ప్రదర్శించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సుచేయాలి.

– డా. వి. రాజేంద్రప్రసాద్

ఆదివాసుల మతం ఏమిటి?

జనాభా గణన అధికారి మా ఇంటికి వచ్చిన ప్రతిసారి నన్ను 'మీ మతం ఏమిటి' అని అడుగుతారని ఎంతో ఆశతో ఎదురుచూసేవాణ్ణి. కానీ, నా ఆశను అడియాశ చేస్తూ నన్ను అడగకుండానే వారు నా మతాన్ని హిందువుగా నమోదు చేసేవారు. ఎందుకు మతం అడగలేదని వారితో అంటే, మీరు హిందువులు కదా అని ఆశ్చర్యంగా సమాధానం ఇచ్చేవారు. జనగణన సమయంలో ప్రతి ఆదివాసీ బిడ్డకు ఎదురయ్యే సంఘటన ఇది.

కేంద్ర ప్రభుత్వం 2021లో జరగాల్సిన జనగణనను ఎట్టకేలకు 2027లో నిర్వహించడానికి నిర్ణయించింది. ఈ జనగణనలో ఒక ప్రత్యేకత ఏమంటే, ప్రతి పౌరుడి కులాన్ని నమోదు చేయటం. 1931 తరువాత కులాల వారీ జనగణనను నిలిపివేశారు. దీంతో పాటు ఆదివాసులను Other Religions and Persuasion (ORP) అనే మత కేటగిరీ నుంచి తొలగించి హిందూ మతంలో విలీనం చేయాలనే ప్రతిపాదన కూడా చర్చలో ఉన్నట్లు తెలుస్తోంది.



తమ మతాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో ఆదివాసులు బలంగా ముందుకు వస్తున్నారు. ఇది సెంట్రల్ ఇండియాలో మరింత బలంగా ఉంది. 1951లో 18.4 లక్షల మంది ఓఆర్‌పీ కింద నమోదు కాగా, 2011లో ఇది 79.3 లక్షలకు పెరిగింది. సర్ణధర్మంగా నమోదు చేసుకున్న వారి సంఖ్య 1991లో 18 లక్షల నుంచి 2011లో 35 లక్షలకు పెరిగింది.

ఇదే జరిగితే ఆదివాసులు తమ మతాన్ని ప్రత్యేక మతంగా నమోదు చేసుకునే హక్కును కోల్పోతారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నిబంధనను ఉల్లంఘించడమే. ఈ నిబంధన– ప్రతి పౌరుడు తనకు ఇష్టమొచ్చిన మతాన్ని ఆచరించే హక్కును కల్పిస్తోంది. వందలాది మత సమూహాలు ఈ నిబంధనను ఉపయోగించుకుని ఓఆర్‌పీ కేటగిరీలో తమ మతాన్ని నమోదు చేసుకుంటున్నాయి. ఈ మధ్య కాలం నుంచే ఆదివాసులు తమను ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో ముందుకు వస్తున్నారు. ఈ డిమాండ్‌ను ఆదిలోనే తొక్కేయాలనే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటికే ఆదివాసులను గుండుగుత్తగా హిందువులుగా నమోదు చేస్తున్నారు.

వాస్తవానికి ఆదివాసుల మత విశ్వాసాలకూ హిందూ మతానికీ ఏ సంబంధమూ లేదు. బ్రిటిష్ వలస పాలనలో 1871లో మొదలైన జనగణనతోనే ఆదివాసుల మతం ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటిష్ పాలకులకు ఎవరిని హిందువులుగా గుర్తించాలనే ప్రశ్న ఒక సవాలుగా మారింది. ఎందుకంటే అప్పటికి దేశంలో ఇస్లామేతర మతాలు తమ ప్రత్యేక ఉనికిని కలిగివుండేవి. మొదటగా ఇస్లామేతర మత విశ్వాసాలను బ్రిటిష్ వారు పెగానిజంగా పరిగణించారు. అంటే బహుదేవత ఆరాధన, ఆత్మలను, ప్రకృతిని పూజించటం, విగ్రహారాధన చేయడం. ఈ మతాచారాలకు 19వ శతాబ్దంలో హిందూ మతంగా నామకరణం చేశారు. ఇందులో బ్రిటిష్ పాలకులతో పాటు, మత సంస్కరణవాదులు కూడా ప్రధాన పాత్ర పోషించారు.

ఇండియాలో పురాతనకాలం నుంచి అనేక ప్రాంతీయ మతాచరణలు ఉన్నాయి. అయితే దేశ స్థాయిలో బ్రాహ్మణ (వైదిక), శ్రమణ (బౌద్ధ, జైన) మతాలు ఉండేవి. ఇవి మళ్లీ అనేక శాఖలుగా విభజన అయ్యాయి. బ్రాహ్మణిజం ముఖ్యంగా వైష్ణవ, శైవంగా విభజన అయింది. శైవిజం బ్రాహ్మణేతర మతాచారాల నుంచి అభివృద్ధి చెందింది.

హిందూ అనే పదాన్ని 11వ శతాబ్దం ముస్లిం చరిత్రకారుడు అల్బెరూనీ మొదటిసారి వాడారు. దీనిని సింధూ నది తూర్పున ఉన్న భౌగోళిక ప్రాంతాన్ని, ఆ ప్రజల సంస్కృతిని వర్ణించడానికి వాడారు. క్రమంగా ముస్లిమేతరులను హిందుస్థానీలుగా వర్ణించారు. అలా ఈ పదం ముస్లిమేతరుల భాష, సంస్కృతి, మతాచారాలను వర్ణించడానికి వాడారు.

బ్రిటిష్ పాలకులు దేశంలోని విభిన్న మత విశ్వాసాల్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి హిందూయిజంను ఏకరీతి మతంగా రూపొందించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో అనేక ప్రశ్నలు ముందుకొచ్చాయి. ఒక మతాన్ని ఆధునిక మతంగా గుర్తించాలంటే అది మోనోథియిజం (ఒకే దేవుని విశ్వాసం) పునాది మీద నిర్మితమై ఉండాలి. హిందూయిజంలో కోట్లాది దేవతలున్నారనే భావన ఉంది. మరి ఇది ఆధునిక మతం ఎట్లా అవుతుందనే ప్రశ్న వచ్చింది. అప్పుడు రాజా రామ్మోహన్‌రాయ్ వేదాంత గ్రంథాల్లో మోనోథియిజం ఉందని ప్రచారం చేయడంతో ఇది ఆధునిక మతంగా గుర్తింపు పొందింది.

హిందూయిజాన్ని ఒక మతంగా పరిగణించిన తరువాత ఎవరిని హిందువులుగా గుర్తించాలనే ప్రశ్న ముందుకొచ్చింది. ఏ కులం, సమూహం హిందూయిజంలో భాగం అనే ప్రశ్న అపరిష్కృతంగా ఉండిపోయింది. ఈ చర్చ ఆదివాసుల మతవిశ్వాసాలపై చాలా ప్రభావం చూపింది. ఎందుకంటే హిందూయిజానికి, ఆదివాసీ మతానికి మధ్య గీత క్రమంగా చాలా పలచనైంది. అనేక ఆదివాసీ దేవతలు హిందూ దేవతలుగా చలామణి అవుతున్నారు. ఆ దేవతలకు సంస్కృత పేర్లు పెట్టి, ఆ దేవతలను ఆదివాసీలకు కాకుండా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.

ఎవరిని హిందువులుగా గుర్తించాలనే చర్చ 19వ శతాబ్దం చివరి అంకంలో తారస్థాయికి చేరింది. దయానంద సరస్వతి హిందూ మతంలోని బహుళ అంధ మత ఆచరణలను తిరస్కరించి శుద్ధ ఆర్యవాదాన్ని ప్రచారం చేశారు. ఆయన దృష్టిలో నిజమైన హిందువులు కేవలం ఆర్యులు. కానీ 20వ శతాబ్దానికి వచ్చేసరికి మత రాజకీయాలు మొదలైనాయి. అప్పుడు మత గణాంకాలు రాజకీయ అధికారానికి మార్గమయ్యాయి. ఈ నేపథ్యంలోనే హిందూ మహాసభ నాయకుడు సావర్కర్ 1923లో "హిందూత్వ: హిందువు ఎవరు?" అనే రచనలో ఎవరు హిందువు అనే విషయాన్ని నిర్వచించారు. ఆయన ప్రకారం... ఎవరైతే భారతదేశాన్ని పితృభూమి, పుణ్యభూమిగా స్వీకరిస్తారో వారే హిందువులు.

ఈ భావజాలం దేశంలో మతతత్వ వాదానికి మరింత ఆజ్యం పోసింది. ఆ తరువాత ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు గోల్వాల్కర్– ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు హిందూమతానికి శత్రువులని ప్రకటించారు. దీనికి విరుద్ధంగా మహాత్మాగాంధీ– హిందువు అంటే అన్ని మతాలను గౌరవించేవాడు అని నిర్వచించారు. ఈ మత రాజకీయాలు ఆదివాసీ సమాజాన్ని క్లిష్ట పరిస్థితిలోకి నెట్టివేశాయి. ఆదివాసులను తమ మతంలో కలుపుకోవడానికి హిందు, క్రిస్టియన్ మతాలు పోటీపడ్డాయి. క్రిస్టియన్లు మొదటగా కొంత పైచేయి సాధించినా, హిందూ నాయకులు బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఆదివాసులను గుండుగుత్తగా హిందూయిజంలో కలుపుకునే ప్రయత్నం చేశారు. 1941లో అధికారికంగా ప్రకటించకపోయినా ఆదివాసులు హిందువులుగా నమోదయ్యారు.

ఆదివాసుల మతాన్ని జనగణనలో నమోదు చేయడం మొదటి నుంచి (1871–72) క్లిష్టంగానే ఉండేది. అందుకు కారణం హిందూ మతానికి ఒక స్పష్టమైన నిర్వచనం లేకపోవడమే. హిందూ మతం నుంచి ఇతర స్థానిక మతాలను వేరు చేయడం అధికారులకు సవాలుగా మారింది. 1871 జనగణనలో ఆదివాసులను వారి జాతి పేరుతో (ఓఆర్‌పీ) కేటగిరీ కింది నమోదు చేశారు. 1881లో కూడా ఇదే పద్ధతిని కొనసాగించారు. 1891 నుంచి ఆదివాసి మతాన్ని Animistగా పరిగణించారు... అంటే ప్రకృతి ఆరాధకులుగా. దీనిపై పెద్ద చర్చ జరిగింది. 1921లో యానిమిస్ట్ స్థానంలో ట్రైబల్ రెలిజియన్ అనే పదాన్ని వాడారు.

అయితే హిందూ మహాసభ, ఆర్యసమాజ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆదివాసులను హిందువులుగా గుర్తించాలని జనగణన కమిషన్ మీద చాలా ఒత్తిడిని తీసుకువచ్చారు. వారి ఒత్తిడి వల్ల 1951 నుంచి ట్రైబల్ రెలిజియన్‌ను పూర్తిగా తొలగించి, ఆరు ప్రధాన మతాలతో పాటు Other Religions and Persuasion కేటగిరీని ఎంచుకునే సౌకర్యాన్ని కల్పించారు.

ఆదివాసులను హిందూ మతంలో విలీనం చేయాలన్న ప్రయత్నం పూర్తిగా రాజకీయ లక్ష్యాలతో కూడినదనే విషయాన్ని ఆదివాసులు గ్రహించారు. దేశ వ్యాప్తంగా తమ మతాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో బలంగా ముందుకు వస్తున్నారు. ఇది సెంట్రల్ ఇండియాలో మరింత బలంగా ఉంది. 1951లో 18.4 లక్షల మంది ఓఆర్‌పీ కింద నమోదు కాగా, 2011లో ఇది 79.3 లక్షలకు పెరిగింది. సర్ణాధర్మంగా నమోదు చేసుకున్న వారి సంఖ్య 1991లో 18 లక్షల నుంచి 2011లో 35 లక్షలకు పెరిగింది. సర్ణ ధర్మం, సర్ణ మతం లేదా పవిత్ర అడవుల మతం అని కూడా పిలుస్తారు. ఇది గిరిజన వర్ణాలు, ముఖ్యంగా చోటా నాగపూర్ పీఠభూమి ప్రాంతంలో ఆచరించే, ప్రకృతిని ఆరాధించే విశ్వాసం.

ఆదివాసులు చారిత్రకంగా గ్రామ, కుల వ్యవస్థకు బయట అడవుల్లో జీవించారు. క్రమంగా వారు తమ భాష, మతం, సంస్కృతిని ఏర్పరచుకుని... ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. వారి పోరాటంలో వారి చరిత్రే వారికి ఆయుధంగా ఉంది. వారి ప్రత్యేక మత, భాష, సంస్కృతి ఉనికిని తొలగించడాన్ని వారి చరిత్రను చెరిపివేసే ప్రయత్నంగా చూడాల్సి ఉంటుంది.



▪ ప్రొ. భంగ్యా భూక్యా
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

భద్రాచలం ముంపు.. ఎవరి తప్పు?!

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరలో సాకారం కాబోతోంది. ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనమయిన మండలాలను తమ రాష్ట్రంలో కలపాలని తెలంగాణ నేతలు కోరడం, పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ఆ ప్రాంతంలోని భద్రాచలం దేవాలయం మునిగిపోయే ప్రమాదముందని ఇప్పుడు ఆందోళన చెందడం హాస్యాస్పదం.

పోలవరం ప్రాజెక్టు వల్ల మునిగిపోయే ఏడు మండలాలను 2014లో ప్రభుత్వ ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. అసలు బూర్గంపాడు, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఉన్న గ్రామాలు తప్ప మిగిలిన కూనవరం, చింతూరు, వి.ఆర్.పురం, భద్రాచలం, దుమ్ముగూడెం, పర్ణశాల, వేంకటాపురం, చర్ల, వాజేడు మండలాలన్నీ 1956కు ముందు ఆంధ్ర రాష్ట్రంలోనే భాగంగా ఉండేవి. సమైక్య రాష్ట్రంలో భద్రాచలం రెవెన్యూ డివిజన్ 1959కి పూర్వం ఆంధ్ర ప్రాంతంలోని తూర్పు గోదావరి జిల్లాలో ఉండేది. అప్పటికి జిల్లా కేంద్రం కాకినాడకు ఇప్పటి వలే రహదారులు అభివృద్ధి చెందకపోవడంతో పరిపాలనా సౌలభ్యం, రహదారి సంబంధాలు, గిరిజనులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే లక్ష్యంతో భద్రాచలం డివిజన్‌ను ఖమ్మం జిల్లాలో కలిపారు. ప్రస్తుతం భద్రాచలం తెలంగాణలో ఉండగా చుట్టూ ఉన్న ప్రాంతం మొత్తం ఏపీలో ఉంది. భద్రాచలం గుడి మాన్యాలు కూడా ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణలో ఉన్న మునగాల పరగణా కూడా ఒకప్పుడు కృష్ణా జిల్లాలో భాగంగానే ఉండేది.

తెలంగాణ ప్రస్తుతం దుమ్ముగూడెం వద్ద 70 టీఎంసీలతో ఎత్తిపోతల పథకం నిర్మించుకుంటూ, పోలవరం ప్రాజెక్టు వల్ల భద్రాచలం పట్టణం మునిగిపోతుందేమోనని ఆందోళన చెందుతోంది. 2014లో రాష్ట్ర విభజన సమయంలోనే ఆ ప్రాంతాలన్నింటినీ తిరిగి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కలిపితే నేడు ఈ బ్యాక్ వాటర్ సమస్య వచ్చి ఉండేదే కాదు. విభజన సమయంలో ఆంధ్రా నేతలంతా ఐక్యతతో పోరాడి ఉంటే ఆ ప్రాంతాలన్నీ తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో కలిసేవి. వారిలోని అనైక్యత, అసమర్థత వల్లే నేడు ఈ సమస్యలన్నీ ఉత్పన్నమవుతున్నాయి.

– దేవరకొండ శ్రీరామమూర్తి

'భారతీయ భాషలన్నీ జాతీయ భాషలే'

దేశంలో భాషా వివాదాలు తీవ్రమవుతున్న తరుణంలో ఆరెస్సెస్ అధికార ప్రతినిధి సునీల్ అంబేకర్ 'భారతీయ భాషలన్నీ జాతీయ భాషలే' అంటూ ఇటీవల ఓ ప్రకటన చేశారు. ఇది కేవలం ప్రకటన మాత్రమే కాదు.. దేశంలోని ప్రతి భాషకూ సమాన ప్రాధాన్యం ఉందని, ప్రాంతీయ భాషలంటూ లేవని ఆరెస్సెస్ స్పష్టం చేసింది. ఇది భాషా ఐక్యతకు సంబంధించిన చర్చలకు కొత్త, ఆశాజనకమైన కోణాన్ని అందించింది.

భారతదేశం భిన్న భాషలకు నెలవు. ప్రజల సంస్కృతికి, గుర్తింపునకు భాష ప్రతీక. పౌరుల్లో దేశ సమగ్రతను, ఐక్యతను పెంపొందించాలంటే భాషా వైవిధ్యాన్ని గౌరవించడం, అన్ని భాషలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షిస్తూ, అన్ని భాషలనూ ఆదరించడం ద్వారానే భారతదేశం ఒక బలమైన దేశంగా ముందుకు సాగుతుంది. కానీ దేశంలో కొంతకాలంగా హిందీని జాతీయ భాషగా రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై ప్రజల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం అధికారిక కమ్యూనికేషన్లలో, విద్యా విధానాల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి చేస్తున్న ప్రయత్నాలు మరోసారి వివాదానికి దారితీశాయి. ఉదాహరణకు.. మహారాష్ట్రలోని ప్రాథమిక పాఠశాలల్లో హిందీని మూడో భాషగా తప్పనిసరి చేయాలంటూ ప్రభుత్వం సర్క్యులర్‌ను జారీ చేసింది. కానీ శివసేన (ఉద్ధవ్ థాక్రే), మహారాష్ట్ర నవనిర్మాణ సేన వంటి పార్టీలు దీన్ని వ్యతిరేకించడంతో ఆ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా దక్షిణాదిపై హిందీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సినీ నటులు అజయ్ దేవగన్, కిచ్చా సుదీప్ మధ్య ఇటీవల ట్విట్టర్‌లో జరిగిన వాగ్వివాదం.. వంటి ఘటనలు కూడా ఈ భాషా వివాదానికి జాతీయ స్థాయిలో రాజకీయ రంగులు పులిమాయి.

ఈ నేపథ్యంలో ఆరెస్సెస్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. వీరి ప్రకటనలో మరో కీలకమైన అంశం 'విద్యను మాతృభాషలోనే బోధించాలి' అనే సిఫార్సు. ఈ అంశం వెనుక శాస్త్రీయ, విద్యాపరమైన కారణాలు ఉన్నాయి. బోధన, అభ్యసన మాతృభాషలో జరిగినప్పుడే పిల్లలు ఆయా విషయాలను సులభంగా అర్థం చేసుకుంటారు. తద్వారా వారిలో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన మెరుగుపడుతుంది. అలా కాకుండా చిన్నతనం నుంచే ఇతర భాషలను పిల్లలపై బలవంతంగా రుద్దడం వల్ల వారిపై అనవసరమైన మానసిక భారం పడుతుందని, ఇది వారి ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని భాషా శాస్త్రజ్ఞులు, విద్యావేత్తలు చెబుతున్నారు.

1956లో భాషా ప్రాతిపదికనే రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇది ప్రజలకు స్వభాషలో పరిపాలనను అందించి, వారి సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించడానికి దోహదపడింది. ఈ విషయాన్ని కేంద్రం గుర్తించాలి. ప్రస్తుత ఆరెస్సెస్ ప్రకటనను ఆచరణలో పెట్టి, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సహకార స్ఫూర్తితో భాషా వైవిధ్యాన్ని రక్షించి, ప్రోత్సహించినప్పుడే దేశంలో భాషా సామరస్యం సుస్థిరమవుతుంది. ఇది దేశ సమైక్యతకు, అభివృద్ధికి బలమైన పునాది.

– డా. రావుల కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్‌సీయూ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

బనకచర్లకు ప్రధాన అడ్డంకి ఎవరు?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గోదావరి–బనకచర్ల అనుసంధానానికి తెలంగాణలోని అధికార, ప్రతిపక్షాలు అడ్డుపడటంతో ఆ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదని చాలామంది భావిస్తున్నారు. ఇది అర్ధ సత్యం మాత్రమే. బనకచర్లపై తొలుత బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో తన పార్టీ వారికి ఇచ్చిన ప్రజంటేషన్‌లో ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు–రేవంత్‌రెడ్డి పైనే విమర్శనాస్త్రాలు సంధిస్తూ ప్రసంగించారు. సమావేశం ఆఖరులో కూడా బనకచర్ల అనుసంధానం వల్ల తెలంగాణ నీటి వాటాకు ఎలా నష్టం కలుగుతుందో చెప్పలేదు. భవిష్యత్తులో ట్రిబ్యునల్ ఏర్పడితే 'ఇన్ని వేల కోట్లు వ్యయమయ్యాయి, కాబట్టి నికర జలాలు కేటాయించమని' ఆంధ్రప్రదేశ్ కోరే అవకాశం ఉందని మాత్రమే ఆరోపించారు. అంతేకాదు, గోదావరి జలాలు కృష్ణలో కలిస్తే ట్రిబ్యునల్ అవార్డు మేరకు కృష్ణా జలాలు 200 టీఎంసీలు తెలంగాణకు లభ్యమవుతాయని సంతోషం వ్యక్తం చేశారు. ఇక అధికార పక్షం తరఫున తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గాని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాని తమకు ఏ విధంగా నష్టమో నిర్దిష్టంగా చెప్పలేదు. ఇది తొలి దశ.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టుకు ఎప్పుడైతే కేంద్ర ప్రభుత్వానికి చెందిన రాజ్యాంగబద్ధత గల సంస్థలు కొర్రీలు వేశాయో, అప్పటి నుంచి తెలంగాణలోని అధికార ప్రతిపక్షాలకు బనకచర్లకు వ్యతిరేకంగా మాట్లాడేందుకు కావలసినంత ఇంధనం దొరికింది.



కేంద్ర ప్రభుత్వానికే చెందిన నాలుగు సంస్థలు కట్టగట్టుకొని బనకచర్ల అనుసంధానానికి వ్యతిరేకంగా నివేదికలు ఇచ్చిన తర్వాత తెలంగాణలో అధికార, ప్రతిపక్షాలు మరెంతగా చిందులు వేస్తాయో ఊహించవచ్చు. కేసీఆర్‌ను కాళేశ్వరం ప్రాజెక్టు లొసుగులతో బదనాం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేసే కొద్దీ, బీఆర్ఎస్ పార్టీ నేతలు రేవంత్‌రెడ్డి నేపథ్యం బూచిగా చూపెట్టి, బనకచర్ల అనుసంధానంపై యాగీ చేస్తుంటారు.

తొలుత, కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ కొర్రీ వేసింది. అంతర్ రాష్ట్ర జల వివాదం ఉందని, ముందుగా కేంద్ర జల సంఘం వద్ద తేల్చుకొని, తర్వాత తమ వద్దకు రమ్మంది. ఇది అర్థం లేని కొర్రీ. ఉమ్మడి రాష్ట్రంలో గాని, ఇటీవల తెలంగాణలో గాని పలు ప్రాజెక్టులకు కేంద్రం జల సంఘం ఆమోదం లేకున్నా పర్యావరణ అనుమతులు ఇచ్చిన సందర్భముంది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం ఆమోదించలేదు. కాని పర్యావరణ అనుమతులు లభించాయి. మరి బనకచర్లకు మాత్రమే ఎందుకిలా జరిగింది? పైగా కేంద్ర జల సంఘం మరీ చోద్యమైన ప్రశ్నలు వేసింది. వరద జలాలకు నిర్వచనం చెప్పమంది. వరద జలాలను ఎలా లెక్కిస్తారో వివరించమని కోరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలే కాకుండా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు 75 శాతం డిపెండబిలిటీ ఉన్న తర్వాత మిగిలే వరద నీళ్లలో బనకచర్లకు ఉండే డిపెండబిలిటీ శాతం నివేదించమని కోరింది. అంతర్ రాష్ట్ర జల వివాదంతో పాటు ఇంకా కేంద్ర జల సంఘం అడిగిన సమాచారం పరిశీలిస్తే, పొమ్మన లేక పొగబెట్టిన చందంగా ఉంది. కిందా మీదా పడి కేంద్ర జల సంఘం అడిగిన సమాచారం ఇవ్వవచ్చు. దాంతో అది సంతృప్తి పడుతుందా? లేదా అనేది వేరే విషయం.

కానీ పోలవరం ప్రాజెక్టు అథారిటీ లేవనెత్తిన సందేహాలు మాత్రం ఇప్పట్లో తీర్చగలిగేవి కావు. పోలవరం ప్రస్తుతం 41.15 మీటర్ల ఎత్తులో తొలి దశకు మాత్రమే కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందన్న అసలు చిదంబర రహస్యం పేర్కొంటూ, పూర్తి ప్రయోజనాలు తొలి దశలో తీరవని, ప్రాజెక్టు 45.72 మీటర్లు ఎత్తులో నిర్మాణం జరిగిన తర్వాతే బనకచర్ల అనుసంధానం ఆలోచన చేయాలని తేల్చేసింది. ఇది వాస్తవం కూడా. నికర జలాలు గల పోలవరం రెండవ దశ డీపీఆర్ ఆమోదం గురించి పట్టించుకోకుండా, వరద జలాల ఆధారంగా ఉండే ప్రాజెక్టుల కోసం వెంపర్లాడటం ఒకింత ఆశ్చర్యమే. అంతేకాదు, పోలవరం ఆపరేషన్ షెడ్యూల్ మార్చవలసి ఉంటుందని, కొత్తగా అనుమతులు పొందవలసి ఉంటుందని అథారిటీ బాంబు పేల్చింది. మున్ముందు, ఈ అగడ్తను కేంద్ర జల సంఘం తిరస్కరించి, డీపీఆర్ ఆమోదిస్తుందా? ఇక, మరొక చట్టబద్ధత గల గోదావరి యాజమాన్యం బోర్డు కూడా మోకాలడ్డింది. కేంద్ర ప్రభుత్వానికే చెందిన నాలుగు సంస్థలు కట్టగట్టుకొని బనకచర్ల అనుసంధానానికి వ్యతిరేకంగా నివేదికలు ఇచ్చిన తర్వాత తెలంగాణలో అధికార, ప్రతిపక్షాలు మరెంతగా చిందులు వేస్తాయో ఊహించవచ్చు. ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశానంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంస్థలే వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొనడం గమనార్హం.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ తన అధీనంలో ఉండే సంస్థలచే అనుకూలమైన రిపోర్టు ఇప్పించే అవకాశం లేదు. ఆ పార్టీ తన చేతులకు మట్టి అంటకుండా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ తన కన్నా వెనుకబడటం, పార్లమెంటు ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో, రానున్న శాసన సభ ఎన్నికల్లో సొంతంగా అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బనకచర్ల అంశంలో ఏ మాత్రం అనుకూలంగా వ్యవహరించినా, అటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇటు బీఆర్ఎస్ పార్టీ... బీజేపీని బదనాం చేసే అవకాశం ఉంది. అందుకే అపెక్స్ కౌన్సిల్ సమావేశం కాకుండా, ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రేక్షకపాత్ర వహించారు. నిపుణుల కమిటీ ప్రతిపాదన కూడా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. కొసమెరుపు ఏమంటే– నిపుణుల కమిటీ పరిశీలనలో బనకచర్ల పేరు కేంద్ర జల వనరుల శాఖ విడుదల చేసిన ప్రకటనలో లేదంటున్నారు.

వాస్తవం చెప్పాలంటే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని కాళేశ్వరం ప్రాజెక్టు లొసుగులతో బదనాం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేసే కొద్దీ, బీఆర్ఎస్ పార్టీ నేతలు రేవంత్‌రెడ్డి నేపథ్యం బూచిగా చూపెట్టి, బనకచర్ల అనుసంధానంపై యాగీ చేస్తుంటారు.

ఢిల్లీ సమావేశం తర్వాత ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా మరో పోరాటం మొదలవుతుందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ ట్వీట్ చేశారు. వాస్తవం చెప్పాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు సుడిగుండంలో బనకచర్ల అనుసంధానం చిక్కుబడింది. లేకుంటే 2014–19 మధ్య కాలంలో ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గోదావరి–పెన్నా అనుసంధానం గురించి ముమ్మర ప్రచారం మొదలు పెట్టినప్పుడు అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ అభ్యంతరం పెట్టలేదు. పైగా గోదావరిలో మూడు వేల టీఎంసీలు సముద్రం పాలవుతున్నాయని చెప్పారు. ఇప్పుడు ఆ నీళ్లు ఎందుకు లేవు? ఆంధ్రప్రదేశ్‌లోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు గతంలో చంద్రబాబు నాయుడు ప్రకటించిన గోదావరి–పెన్నా అనుసంధానం కూడా ప్రస్తుతం గగన కుసుమం అయింది. ఏతావాతా తేలినదేమంటే తన చేతులకు మట్టి అంటకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకొంటోంది. ఈ క్రమంలో తెలంగాణలోని అధికార, ప్రతిపక్షాల పోరులో బనకచర్ల చిక్కుకుంది.

● వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



శుభాల.. శ్రావణం



- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- పండుగలకు 'నెల'వు.. మహిళలకు ప్రీతిపాత్రం



శుభకార్యాలకు నెలవైన నిలిచే శ్రావణమాసం ఈనెల 25న ఆరంభం కానుంది. ప్రతి ఇల్లు ఓ ఆలయంగా మారి.. ఉదయం, సాయంత్రం వేళల్లో భగవన్నా మస్మరణతో మార్మోగనుంది. మరో వైపు పెళ్లి బాజాలు ఘనంగా మోగనున్నాయి. ఈ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ఆల యాలను అధికారు లు, కమిటీ సభ్యు లు ముస్తాబు చేస్తున్నారు. సామూహిక వరలక్ష్మీవ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకలు, రాఖీ పౌర్ణమి వరుసగా జరుగనున్నాయి. ఆషాఢం వీడి శ్రావణం మొదలు కానుండడంతో వ్యాపారులు, రైతులు కొత్త ఆశలు పెట్టుకున్నారు.

మట్టి పరీక్షలు 38.72 శాతమే..

- లక్ష్యంపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం
- ఖరీఫ్ సాగు మొదలైనా తేలని భూసారం
- వెంటాడుతున్న సిబ్బంది, రసాయనాల కొరత
- భూ ఆరోగ్య కార్డుల కోసం రైతుల ఎదురుచూపు

మందకొడిగా సాగుతున్న వైనం



భూమి ఆరోగ్యంపైనే సాగు.. దిగుబడులు ఆధారపడి ఉంటాయి. ఇంతటి ప్రధానమైన మట్టి పరీక్షలపై ప్రభుత్వం పట్టుదలగా ఉంది. రైతులకు ఎంతో మేలు చేకూర్చే ఈ మట్టి పరీక్షలపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. ఖరీఫ్ సాగు మొదలైనా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కేవలం 38.72 శాతం మాత్రమే మట్టి పరీక్షలు జరిగాయంటే వ్యవసాయశాఖ శ్రద్ధ తెలుస్తోంది. భూసారం తేల్చేందుకు పెద్ద ఎత్తున పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా వాటిని చేరుకోవడంలో వ్యవసాయ శాఖ చతికిల పడింది. మట్టి నమూనాలను లక్ష్యాల మేర సేకరించడంతో సరిపెట్టిన వ్యవసాయశాఖ పరీక్షలపై దృష్టి సారించడం లేదు. అదేమంటే సిబ్బంది.. రసాయనాలు.. పరికరాల కొరత ఉందని అందువల్లే పరీక్షలు ఆశించిన మేర చేయలేకపోతున్నట్లు అధికారులు చెప్తున్నారు. 38.72 శాతం పరీక్షలకు సంబంధించిన పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ ఇప్పటికీ చేయలేదని రైతులు వాపోతున్నారు.



మట్టి నమూనాల పరీక్షలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూడు నెలలుగా భూసార పరీక్షలు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పట్లో ఆ పరీక్షలు పూర్తయ్యే పరిస్థితులు కానరావడం లేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమునాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 23,284 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి చేశారు. లక్ష్యాలు ఇచ్చిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వసతులు కల్పించడాన్ని విస్మరించింది. భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయశాఖ విఫలమైంది. భూమిలో సారం ఎంత ఉందో మట్టి పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ పరీక్షల ఆధారంగా సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులు (మిగతా 6వ పేజీలో)



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి


దాతలు ముందుకు రావాలి

- పేదరిక నిర్మూలనకు సహకరించాలి
- పీ-4 గ్రామసభలో కలెక్టర్ నాగలక్ష్మి

మేడికొండూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ఉన్నత స్థాయిలో ఉన్న దాతలు ముందుకు రావాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడికొండూరులో జరిగిన గ్రామసభలో కలెక్టర్ ప్రసంగించారు. సమాజంలో ఉన్నతస్థితికి చేరుకున్న దాతల ద్వారా పేదరిక నిర్మూలనకు సహకరించాలన్నారు. నిరుపేదలను దత్తత ద్వారా సమాజంలో అసమానతలు తొలగి పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. సమాజంలో 10 శాతం మంది మార్గదర్శులు 20 శాతం ఉన్న బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆర్థిక అభివృద్ధికి అవసరమైన సాయం అందించడమే పీ-4 కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మేడికొండూరులో ఐదు వందల బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకోవాలన్నారు.

- ఓ రైతు అభ్యంతరం కారణంగా మేడికొండూరు నుంచి నుదురుపాడు మార్గంలో సుమారు వంద మీటర్ల నిలిచిన రహదారిని కలెక్టర్ పరిశీలించారు. రహదారి నిర్మాణంపై అభ్యంతరం తెలుపుతున్న రైతుతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, వ్యవసాయశాఖ, సహకారశాఖ అధికారులు కె.నాగేశ్వరరావు, వీరాచారి, ఎంపీడీవో ప్రభాకర్ రావు, తహసీల్దారు హరిబాబు, ఈవోపీఆర్డీ పూర్ణశంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చేలా వర్షం



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

- వర్షాభావాన్ని అధిగమించేలా వరుణుడి కరుణ
- వీడని వర్షాలతో నారుమళ్లు పోసేందుకు ఆటంకాలు
- ప్రకాశం బ్యారేజీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తెనాలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావం జిల్లాపై తన ప్రతాపాన్ని చూపింది. రెండు రోజులు వాన దండికొట్టింది. మూడోరోజు బుధవారం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీగా చినుకులు పడ్డాయి. నిన్నటి వరకు వర్షాభావంతో అల్లాడిన రైతులకు ఈ వర్షాలు ఊరట ఇస్తోన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ రైతుకు మిశ్రమ ఫలితాలు కలుగుతున్నాయి. వర్షాభావంతో ఇటీవల వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వెద పద్ధతిలో రైతులు వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వానలతో లోతట్టు ప్రాంతాల్లోని చేలు నీటితో నిండిపోయాయి. ప్రస్తుతం విత్తనాలు చల్లాలన్నా, నారుమళ్లు పొయ్యాలన్నా వర్షాల కారణంగా వెయ్యలేని పరిస్థితి. దీంతో కొంతమేర ఖరీఫ్ పనులకు ఆటంకం ఏర్పడి, సాగు ఆలస్యమవుతున్నది. లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు నీటి కష్టాలు తీరాయి. రూ.వేలల్లో నీటి తడులకు చేస్తున్న ఖర్చు భారం లేకుండాపోయింది.

ఎగువ నుంచి వస్తున్న వరద నీరు సముద్రంలోకి

ప్రకాశం బ్యారేజి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు పాలేరు, కీసర, మునేరు వెలగలేరు వాగుల ద్వారా బ్యారేజికి వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రం బ్యారేజికి ఇన్‌ఫ్లో కింద 34,657 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోంది. మంగళవారం (మిగతా 6వ పేజీలో)

బ్యాంకు ఖాతాకు రూ.5వేలు

- ఖాతాల సేకరణకు గుంటూరులో ఏజెంట్లు
- దుబాయ్ కేంద్రంగా నేరాలు.. ఐదుగురు అరెస్టు

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): దుబాయ్ కేంద్రంగా రూ.వందల కోట్ల సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టయింది. పోలీసుల కథనం మేరకు... దుబాయ్‌లో మకాం వేసిన ముఠా అక్కడి నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతోంది. నేపాల్‌కు చెందిన విశాల్ అనే సైబర్ నిపుణుడిని ఎంపిక చేసుకుని బెంగళూరు నుంచి కార్యకలాపాలు సాగించారు. ఈ ముఠా గుంటూరుకు చెందిన సుధాకర్, విష్ణువర్ధన్, అనిల్, తెలంగాణలో నిజామాబాద్‌కు చెందిన రంజిత్‌ను ఏజెంట్లుగా నియమించుకుంది. ఒక్కో బ్యాంకు ఖాతాకు రూ.5 వేలు ఇస్తామంటూ ఈ ఏజెంట్లు పేదలకు వల వేశారు. గుంటూరుతో పాటు పరిసర ప్రాంతాల్లో వీరు సుమారు 500 బ్యాంకు ఖాతాలు తెరిచారని సమాచారం. ఆయా ఖాతాల వివరాలను విశాల్ ద్వారా దుబాయ్‌లోని నేరగాళ్లకు పంపారు. వారు సైబర్ నేరాల ద్వారా వచ్చే సొమ్మును పేదల ఖాతాల్లోకి మళ్లించేవారు. ఇందుకోసం దుబాయ్‌లోని నకిలీ ఖాతాలు తెరిచారు. వాటినుంచి కూడా నగదును వారికి సంబంధించిన ఇతర ఖాతాలకు బదిలీ చేసుకుంటున్నారు. గుంటూరు కొరిటెపాడుకు చెందిన రమేశ్ అనే వ్యక్తి తన బ్యాంకు ఖాతాలో తనకు తెలియకుండా లావాదేవీలు జరుగుతున్నాయని అరండల్ పేట పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేశారు. సైబర్ క్రైమ్ బృందాల విచారణలో ఈ ముఠా వ్యవహారం వెలుగుచూసింది. దీంతో విశాల్‌తో పాటు సుధాకర్, విష్ణువర్ధన్, అనిల్, రంజిత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. దుబాయ్ కేంద్రంగా నేరాలకు తెర తీసిన సూత్రధారి కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వారికి లుక్ అవుట్ నోటీస్‌తో పాటు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని నిర్ణయించారు.

మామూళ్లతో మాయ

- అవలీలగా నకిలీ రిజిస్ట్రేషన్లు
- ఓ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు
- రూ.40 కోట్ల ఆస్తికి రిజిస్ట్రేషన్‌పై నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు



గుంటూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒకరి పేరు నుంచి మరొకరి పేరుపై ఆస్థి మార్చాలంటే కట్టిదిట్టమైన పద్ధతి ఉంది. అయితే ఈ పద్ధతికి స్వస్తి పలుకుతూ మా మూళ్లతో రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. గుంటూ రు సమీపంలోని గోరంట్ల పరిధిలోని రూ.40 కోట్ల ఆస్థి రిజిస్ట్రేషనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. భారీగా ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తుంది. కొద్దినెలల క్రితం ఉద్యోగ విరమణ పొందిన నరసరావుపేట జా యింట్ రిజిస్ట్రార్ ముందుగానే అన్నీ మాట్లా డుకుని నకిలీ రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం నల్లపాడు పోలీసుల అదుపులో ఉన్న కీలక నిందితుడు అక్రమ రిజిస్ట్రేషన్ గుట్టు విప్పినట్లు తెలుస్తుంది. నకిలీ దస్తావేజులు చేయడం ఆ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌కు వెన్నతో పెట్టిన విద్య అని పలు వురు చెప్తున్నారు. ఇతడే గుంటూరులో పని చేసిన సమయంలో మానస సరోవరాన్ని కూడా పలువురికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సమా చారం. కలెక్టర్ జోక్యంతో సదరు దస్తావేజులు రద్దు చేసినట్లు తెలిసింది. పిడుగురాళ్ల, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో కొన్ని వందల నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులో జరిగిన నకిలీ చలానాల కుంభ కోణంలో కూడా ఆయన పాత్ర ఉన్నట్లు చెబు తున్నారు. అన్ని తప్పులు చేసినా కొందరు అధికారులు ఆయనను వెనకేసుకు రావడం వల్ల ఇటువంటి వ్యవహారాలు పదే పదే జరిగి నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గుంటూ రులోని గోరంట్లలో రూ.40 కోట్ల ఆస్థి రిజి స్ట్రేషన్ వ్యవహారంలో ఇదే జాయింట్ రిజి స్ట్రార్ భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ సీనియర్ అసిస్టెంట్‌తోనే 18 జీపీఏ చేయించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పల్నాడులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆ సీనియర్ అసిస్టెంట్ పై కూడా కేసు నమోదు చేయాలని బాధితు లు పోలీసులను కోరినట్లు తెలుస్తుంది. ఇప్ప టికే నల్లపాడు పోలీసులు నరసరావుపేటలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జాయింట్ రిజిస్ట్రార్, గుంటూరుకు చెందిన మరో రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశారు.

డీఐజీ జోక్యంతో..

రూ.40 కోట్ల ఆస్తికి నకిలీ రిజిస్ట్రేషన్‌పై బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు అప్పట్లో నరసరావుపేట వెళ్లి అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదు. దీంతో బాధితుడు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేయడంతో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్ హడావిడిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పట్లో నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు చేశారు.

నకిలీ మనిషిని తెచ్చినా ఓకే..

వాస్తవానికి రూ.40 కోట్ల ఆస్తికి సంబంధించిన అసలు వ్యక్తి కొత్తపల్లి పద్మజ మృతి చెందారు. ఆమె ఆధార్ కార్డు ఆధారంగానే ఆస్థి బదలాయింపు జరగాలి. రిజిస్ట్రేషన్ సమయంలో అసలు యజమాని వేలిముద్రలు కూడా సరిపోలాలి. మామూళ్ల మత్తులో ఉన్న నరసరావుపేట విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ అన్నిటినీ తేలికగా మార్చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరించి అసలు ఆస్థి పరులను వివాదంలోకి నెట్టారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు కొరిటపాడులో అను మతి ఇచ్చారని సమాచారం.



ట్రాఫిక్ నియంత్రణ చర్యలను అధికారులకు వివరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ట్రాఫిక్ నియంత్రణపై ఎస్పీ దృష్టి

- నగరంలో ద్విచక్ర వాహనంపై పర్యటన

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిరోధించేందుకు ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. బుధవారం ఆయన అధికారులతో కలసి కంకరగుంట అండర్‌పాస్, బ్రాడీపేట, లక్ష్మీపురం, లాడ్జ్ సెంటర్, శంకర్‌విలాస్ సెంటర్, అరండల్ పేట, మూడు వంతెనలు, కొత్తపేట, నాజ్ సెంటర్, ప్రభుత్వ మహిళా కళాశాల సెంటర్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించి ట్రాఫిక్ సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేస్తూ, వాటిపై వాహనదారులకు అవగాహన కల్పించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వర్షపు నీరు నిలిచే మూడు వంతెనలు, కంకరగుంట అండర్ పాస్‌ల్లో ఎప్పటికప్పుడు నీటిని తొలగించేందుకు మోటార్ల ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, అరవింద్, సీఐలు అళహరి శ్రీనివాస్, అశోక్‌కుమార్, సింగయ్య, ఆరోగ్యరాజు తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.



ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ వాహనంపై ఎస్పీ సతీష్‌కుమార్

మిర్చియార్డు పదవిపై మీమాంస

- యార్డు చైర్మన్‌కి జిల్లా అధ్యక్ష పదవితో లింకు
- ఒకటి బీసీలకు ఇస్తే మరొకటి కాపులకు ఇవ్వాలనే యోచన



గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇంచు మించు అన్ని మార్కెట్ కమిటీల చైర్మన్ పోస్టులను భర్తీ చేశారు. అయితే గుంటూరు మిర్చి యార్డు పదవి విషయంలో నేటికీ మోక్షం లభించలేదు. ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అధిష్ఠానం పెండింగ్‌లో పెట్టింది. కీలకమైన ఈ పదవిని చేపట్టేందుకు టీడీపీలో ఎంతో మంది నేతలు ఆశ పడుతూ ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మిర్చియార్డు చైర్మన్ పదవికి జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి లింకు పెట్టారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్నాడు జిల్లాకు టీడీపీకి కొత్త జిల్లా అధ్యక్షుడ్ని నియమించారు. అదే సమయంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్‌ను కూడా మార్చి కొత్త అధ్యక్షుడ్ని నియమించాలని భావించారు. రాజీనామాకి శ్రావణ్ కూడా సిద్ధమయ్యారు. అయితే ఆయన తప్పుకుంటే అప్పటికప్పుడు ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేయలేమని భావించి అప్పటికి దాట వేశారు. ఈ నేపథ్యంలో యార్డుకు చైర్మన్‌ను, జిల్లా పార్టీకి అధ్యక్షుడ్ని ఒకే సారి ఎంపిక చేయాలని అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఒక పదవిని బీసీలకు ఇచ్చే పక్షంలో రెండో పదవిని కాపులకు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీంతో జిల్లా అధ్యక్ష పదవికి కొన్ని పేర్లు రాగా ఎన్నికల సమయం వరకు పార్టీలో సభ్యత్వం కూడా లేని వారికి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలనే ఆలోచన చేయడం సరికాదని శ్రేణుల నుంచి విమర్శలు వచ్చాయి. అంతటితో అది వాయిదా పడింది. జిల్లా పార్టీ అధ్యక్ష పదవి తేలకపోవడంతో గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎంపిక కూడా ఏడాదిగా వాయిదా పడుతూ వస్తోంది. దీంతో ఏడాదిగా యార్డులో అధికారుల పాలన కొనసాగుతున్నది.



పీ-4 వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్ 6

దివ్యాంగులకు వాహనయోగం

- ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- తొలిదశలో నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ
- త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ

8

ఇంజనీరింగ్ సీట్ల జాబితా విడుదల

- ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా సీట్లు
- 26 లోపు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు

15 లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఏవీ నాగేశ్వరరావు, వేదికపై సీఐటీయూ నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. పాత గుంటూరు, శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో రెండు రోజులు పాటు జరిగే భవన నిర్మాణ కార్మికుల సంఘ రాష్ట్ర మహాసభలను బుధవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చే కన్నా ప్రజల నుంచి పన్నుల పేరుతో వసూలు చేసేది ఎక్కువైందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అనుస రిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికవర్గం చైతన్యంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు, మహిళా రాష్ట్ర నాయకులు దయారామాదేవి ప్రసంగించారు. తొలుత సీఐటీయూ జెండాను వి ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. మహాసభకు రమణారావు అధ్యక్షత వహించగా, సభలో సీఐటీయూ నాయకులు, పలు జిల్లాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజి బాధిత రైతులకు చెక్కుల పంపిణీ



రైతుల బీమా పత్రాలను తనిఖీ చేస్తున్న దుగ్గిరాల యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు

దుగ్గిరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రక్రియ బుధవారం కొనసాగింది. పంటబీమా నగదు కింద చెక్కుల పంపిణీలో భాగంగా దుగ్గిరాల మార్కెట్‌యార్డులో సోమవారం ప్రారంభం కాగా, రెండ్రోజుల పాటు తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. బీమాసంస్థ నుంచి వచ్చిన జాబితా ప్రకారం 346 మందికి బీమా మొత్తం అందించాల్సి ఉంది. వీరిలో 332 మంది రైతులు, 14 మంది వ్యాపారులు ఉన్నారు. మొత్తం రూ.22.50కోట్ల మంజూరు కాగా వ్యాపారులకు చెందిన 42 బాండ్లకు సంబంధించి రూ.2.76కోట్లు మంజూరు చేశారు. దుగ్గిరాల ఏఎంసీ, తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మూడ్రోజుల్లో 308 మంది ఖాతాల్లో రూ.19.5కోట్ల నగదు జమచేశారు. మిగిలిన 24 బాండ్లకు సంబంధించి నగదు చెక్కులను పంపిణీ చేయాల్సి ఉందని, వారికి ఫోన్‌ద్వారా సమాచారం అందించగా, అందుబాటులో లేమని కొందరు చెప్పారన్నారు. వారందరి ఖాతాల్లో నగదు జమపై ఉన్నతాధికారుల ఆదేశాను సారం నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

పేదల జీవనప్రమాణాలు పెంచడమే.. పీ-4 ముఖ్య ఉద్దేశం

పోస్టర్ల ఆవిష్కరణలో మంత్రి మనోహర్



సచివాలయంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జూలై23(ఆంధ్రజ్యోతి):పేదల జీవనప్రమాణాలను పెంచేందుకే కూటమి ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని చేపట్టిందని, 2029 నాటికి 50లక్షల పేద కుటుంబాలు అభివృద్ధివైపు నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అమరావతి సచివాలయంలో బుధవారం మంత్రి మనోహర్ తెనాలి విజన్‌యాక్షన్ ప్లాన్‌పై నియోజకవర్గ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మంది పేదలు తరాలు మారుతున్నా అందులోనే మగ్గుతున్నారని చెప్పారు. అటువంటి కుటుంబాలను సైతం ఆర్థికంగా నిలదొక్కుకుని అభివృద్ధిలోకి వచ్చేలా పీ-4 (పబ్లిక్ - పీపుల్ - ప్రైవేట్ - పార్టనర్‌షిప్) ప్రోగ్రాంను చేపట్టడం జరిగిందన్నారు. తెనాలి ప్రాంతంలో ఉన్న పేదలను గుర్తించి పీ-4లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటికే అధికారయంత్రాంగం సమాయత్తమవుతోందన్నారు. తెనాలి నియోజకవర్గంలో సుమారు 14280 (పేదలు) బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. వారికి అండగా నిలిచేందుకు 376మంది ముందుకు వచ్చారన్నారు. వీరు దాదాపు 3289మందిని దత్తత తీసుకోనున్నట్లు తెలియజేశారు. డేటా వెరిఫికేషన్ అనంతరం వీరి సహాయంతో వారి అభివృద్ధికి అవసరమైనవిధంగా ఉపాధి పొందేందుకు, చదువులకు తోడ్పాటు, వ్యవసాయ సాగుకు, మార్కెటింగ్, బ్యాంక్ రుణాలు ఇప్పించడం, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి వైద్య సహాయం తదితర విషయాల్లో చేయూతనందించడం జరుగుతుందన్నారు. త్వరలోనే మార్గదర్శకులను పరిచయం చేసేలా కార్యక్రమాన్ని తెనాలిలో నిర్వహించనున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు. ఈ యాక్షన్ ప్లాన్ తెనాలి నియోజకవర్గానికి ఒక రోల్‌మోడల్‌గా మారుతుందన్నారు. ఎన్నారైలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న తెనాలి వాసుల సహకారం తీసుకుంటూ వారిని భాగస్వాములుగా మార్చే ప్రణాళిక చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత పీ-4 వాల్ పోస్టర్లను అధికారులతో కలిసి మంత్రి మనోహర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సంజనసింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవోలు అత్తోట దీప్తి, విజయలక్ష్మి, మునిసిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావు, స్వర్ణాంధ్రవిజన్ మేనేజ్‌మెంట్ యూనిట్ అధికారులు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి వర్సిటీ స్నాతకోత్సవం నేడు

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ వీసీ శారదా జయలక్ష్మీదేవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవం వేడుకలను గన్నవరం మండలం ఆత్కూర్ గ్రామంలోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో గురువారం నిర్వహించనున్నట్లు వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారని తెలిపారు. విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థి అయిన మాజీ ఐఏఎస్ ఏ వేణుప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. 2023-24 సంవత్సరంలో 1419 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, 1995 మంది విద్యార్థులు వివిధ కోర్సులలో చేరారని తెలిపారు. డిప్లొమాలో 2023-24లో 1016 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. పీజీ కోర్సుల్లో 196 మంది, పీహెచ్‌డీలో 46 మంది విద్యార్థులు స్నాతకోత్సవంలో పట్టాలు పొందేందుకు అర్హత సాధించారన్నారు. స్నాతకోత్సవంలో వ్యవసాయ పరిశోధనల్లో అత్యుత్తమ ప్రతిభకు రెండు జాతీయ అవార్డులను ఇస్తున్నట్లు తెలిపారు. సాంబమసూరు బియ్యం రకాన్ని కనుగొన్న డాక్టర్ ఎంవీ రెడ్డి, స్వర్ణ రకాన్ని కనుగొన్న వీ రామచంద్రరావు పేర్ల మీద జాతీయస్థాయిలో అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా పేరుమీద యువ శాస్త్రవేత్త పురస్కారాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. యోగ్య ఉపాధ్యాయ పురస్కార గ్రహీత అవార్డులు 4, యోగ్య పరిశోధనా పురస్కార గ్రహీతలు 3, యోగ్య విస్తరణ పురస్కార గ్రహీత అవార్డులు 2 ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ కార్యకర్తల దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు





చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలు నంబుల కాట్రాజు, మాగంటి బాబూరావు

సత్తెనపల్లి రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ళలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు మాగంటి బాబూరావు తన గొర్రెలతో పాటు తన బంధువులకు చెందిన గొర్రెలను పొలంకు తోలుకు వెళ్ళి సాయంత్రం కావటంతో ఇంటికి తోలుకొని వస్తున్నాడు. మార్గ మధ్యలోకి వచ్చే సరికే వర్షం కురవటంతో పక్కన పొలాల్లో(దుక్కిలో) నిలుపి వేశాడు. ఈ సమయంలో గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు తన మిరప నారు మడుల వద్దకు వెళ్తూ గొర్రెలు ఇక్కడ ఎందుకు ఆపావు?, పక్కన మిరప నారు మడులు ఉన్నాయి, తొందరగా తోలుకు వెళ్ళు అని హెచ్చరించాడు. రాంబాబు నారు మడి వద్ద నుంచి తిరిగి వచ్చే సరికే గొర్రెలు అక్కడే ఉండటంతో నిన్ను గొర్రెలు తోలుకు వెళ్ళమంటే ఇక్కడే ఉంచావేంటంటూ తనను గొంతు పట్టుకొని నెట్టాడని బాబూరావు విలేకరులకు తెలిపారు. ఈ సమయంలో ఇరువురు ఒకరికొకరు నెట్టుకున్నారు. ఈ క్రమంలో నువ్వు ఊళ్ళోకి వస్తావో చూస్తానని బాబూరావును రాంబాబు హెచ్చరించాడు. ఈ క్రమంలో వల్లెపు వీరయ్య, రవితేజ, మరికొందరిని తీసుకొని గొర్రెలు తోలుకు వస్తున్న బాబూరావు వద్దకు వెళ్ళి ఘర్షణ పడ్డాడు. బాబూరావు తరపు వారు కూడా రావటంతో రాంబాబు, అతని వర్గీయులు బాబూరావు, నంబుల కాట్రరాజు, మరికొందరిపై కర్రలు, గొడ్డళ్ళతో దాడి చేశారు. ఈ ఘటనలో బాబూరావు, కాట్రరాజు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బంధువులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. తాము టీడీపీకి చెందిన వారమనే గొర్రెలు నారు మడిలో పడక పోయినా తమపై దాడి చేసి కొట్టారని బాబూరావు ఆరోపించారు. ఈ ఘర్షణలో వైసీపీకి చెందిన ఇద్దరికి కూడా స్వల్ప గాయాలైనట్టు సమాచారం. ఈ విషయంపై ఇరు వర్గీయులు సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వల్లెపు రాంబాబు ఫిర్యాదు పై మాగంటి బాబురావు మరో ముగ్గురిపై, మాగంటి బాబూరావు ఫిర్యాదు మేరకు వల్లెపు రాంబాబు, మరో ఇద్దరి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు.

చిత్తుగా ఓడించినా..వైసీపీ దద్దమ్మలకు బుద్ధి రాలేదు!

● జనసేన నేతలు బోనబోయిన, గాదె వెల్లడి



మాట్లాడుతున్న బోనబోయిన శ్రీనివాసయాదవ్, పక్కన గాదె, చందు

గుంటూరు మెడికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో చిత్తుగా ఓడించి, కనీసం ప్రతిపక్షం హోదా కూడా ఇవ్వకుండా ఇంటికి పంపినా నేటికి వైసీపీ దద్దమ్మలకు బుద్ధి రాలేదని, కూటమి ప్రభుత్వంపై అవాకులు చెవాకులు పేలడం మానుకోలేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. అమరావతి రోడ్‌లోని జనసేన పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో..జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సీనియర్ నేత చందు సాంబశివరావుతో కలసి ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం కుక్కల చింపిన విస్తరిలా మార్చిందని బోనబోయిన విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిరంతరం కష్టపడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నట్లు ఆయన వివరించారు. గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమని బోనబోయిన తెలిపారు. మరోవైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు తెలిపారు. అభివృద్ధికి సహకరించి నిర్మాణాత్మక విమర్శలు చేయాల్సిన వైసీపీ నేతలు, ఇప్పటికీ టీడీపీ, జనసేన నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ ప్రజలకు మరింత దూరం అవుతున్నారని ఆయన దుయ్యబట్టారు. మాజీ మంత్రి రోజా రెడ్డి ఆడుదాం ఆంధ్రాలో రూ.కోట్లు అవినీతికి పాల్పడ్డారని, త్వరలో ఆమె కూడా జైలు ఊచలు లెక్కించాల్సిందేనని గాదె స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో జనసేన నేతలు అడపా మాణిక్యాలరావు, శిఖా బాలు, చట్టాల త్రినాద్, యడ్ల వెంకటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు.. 38.72 శాతమే

(5వ పేజీ తరువాయి)

తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే పరీక్షలే పూర్తి కాకపోవడంతో సాగు పరిస్థితి తారుమారవుతోంది. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నా యా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువు లు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్ష లు మొక్కుబడిగా సాగుతుండటంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు, బాపట్ల కంటే పల్నాడులో పర్వాలేదు..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు చేసే సామర్థ్యం మాత్రమే ల్యాబ్‌కు ఉంది. జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా 23,191 మట్టి నమూనాలను సేకరించారు. 12,005 నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల కంటే పల్నాడు జిల్లాలోనే పరీక్షల నిర్వహణ మెరుగ్గా ఉంది. బాపట్ల జిల్లాలో లక్ష్యం మేర 22,688 సేకరించి 7785 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 13,862 సేకరించగా 3494 పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షలు ఇలా జరిగితే ఏడాది చివరికి కూడా పూర్తికావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సూక్ష్మ పోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అ యితే మట్టి పరీక్షలు తేలకపో వడంతో ఆయా సూక్ష్మపోష కాలను రైతులు కోల్పోయే ప్ర మాదం ఉంది. సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా సూక్ష్మపోష కాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేప థ్యంలో భూసార పరీక్షలు ఇప్పటికైనా వేగవంతం చేయాల్సి ఉంది.

ఐదు రోజుల పాటు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీటీర్ వర్కులు కారణంగా ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని ఐదు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు సీపీటీఎం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 22876 గుంటూరు - విశాఖపట్టణం, 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏషియన్ పోటీలకు స్కేటర్ జెస్సీరాజ్



మంగళగిరి సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో ఈ నెల 24 నుంచి పది రోజులపాటు జరగనున్న ఏషియన్ చాంపియన్‌షిప్ స్కే టింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ మాత్రపు జెస్సీరాజ్ ఎంపికైంది. భారత జట్టు తరపున ఎంపికైన 29 మం ది సభ్యుల బృందంతో కలిసి మంగళవారం దక్షిణ కొరియా తరలివెళ్లింది. క్యాడెట్ గర్ల్స్ విభాగంలో ఏపీ నుంచి పాల్గొనే ఏకైక క్రీడాకారిణి జెస్సీరాజ్ మాత్రమే.

పూణే గోవింద్ డెయిరీని సందర్శించిన సంగం బృందం



ధూళిపాళ్ల నరేంద్రకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న పూణేలోని గోవింద్ డెయిరీ యాజమాన్యం

పొన్నూరుటౌన్, జూలై23(ఆంధ్రజ్యోతి): పూణేలోని గోవింద్ డెయిరీ అవలంబిస్తున్న పశు వైద్య చికిత్సలను అధ్యయనం చేసి స్థానిక రైతులకు మెరుగైన పశు వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు సంగం డెయిరీ చైర్మన్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం మహారాష్ట్ర పూణేలోని గోవింద్ డెయిరీని సంగం బృందం సందర్శించింది. అక్కడి రైతులు అవలంబిస్తున్న పశు వైద్య చికిత్సలో ఉపయోగిస్తున్న పద్ధతులు, లూస్ హౌసింగ్ వంటి ప్రక్రియలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోవింద్ డెయిరీ చైర్మన్ సంజీవ్ రాజే నాయక్, డెయిరీ అవలంబిస్తున్న సాంకేతిక వనరులు సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఓఓ పర్వతనేని అనిల్, పశు వైద్య బృందం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

● పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య బ్రహ్మజీరావు

పెదకాకాని, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి బీటెక్,ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంలో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్,కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ కోర్సుల్లో సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్ల భర్తీకి బుధవారం నిర్వహించిన ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసిందని పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పీ బ్రహ్మజీరావు బుధవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 114 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 86 మంది హాజరయ్యారన్నారు. ఫలితాలను త్వరలో విడుదల చేస్తామన్నారు. ఆయా కోర్సులలోని సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని ఆయన వివరించారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

రెంటచింతల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి చెందిన సంఘటన బుధవారం రెంటచింతల నుంచి మిట్టగుడిపాడు వెళ్లే రహదారిలో ఏడుమంగళం వాగు ఒడ్డున సంభవించింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా వున్నాయి. మంచికల్లు గ్రామానికి చెందిన బొమ్మనబోయిన నరసింహారావు(42) రెంటచింతల పరిసరాల్లో 30 ఎకరాలను కౌలుకు తీసుకుని సేద్యం ప్రారంభించారు. మాగాణి పొలానికి వెళ్లి బోర్ మోటార్‌ను స్టార్ట్ చేసే క్రమంలో చేయి ప్యానల్ బాక్స్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే ప్రాణాలిడిచారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం. భార్య నాగ లీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శబరి ఎక్స్‌ప్రెస్‌కు గుంటూరులో 10 నిమిషాల హాల్ట్

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌కు ఇప్పటివరకు గుంటూరు రైల్వే జంక్షన్‌లో ఒక నిమిషం మాత్రమే హాల్టింగ్ సమయం ఉండగా సెప్టెంబరు 29వ తేదీ నుంచి అది 10 నిమిషాలకు పెరగబోతున్నది. దీని వలన ఆ రైలులోకి ప్రయాణికులు బోర్డింగ్/అన్‌బోర్డింగ్ చేయడం సులభతరం అవుతుంది. పైగా ఇక్కడే వాటరింగ్ కూడా పెట్టనుండటంతో టాయిలెట్స్, వాష్‌బేసిన్‌లలో నీటి సమస్యలు కూడా తొలగిపోతాయి. తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం గుంటూరుకు ఉదయం 6.29కి వచ్చి 6.30కి బయలుదేరుతున్నది. దీనివలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పైన ప్రకటించిన తేదీ నుంచి ఈ రైలు గుంటూరుకు ఉదయం 6.05కి వచ్చి 6.15కి బయలుదేరుతుంది. ఈ కారణంగా సత్తెనపల్లికి 6.54కి, పిడుగురాళ్లకు 7.19కి, నడికుడికి 7.39కి, సికింద్రాబాద్‌కి 11 గంటలకు చేరుకొంటుంది. అలానే సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ మారనున్న షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరుకు వచ్చి 6.45కి బయలుదేరుతుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి అధికారిక సమాచారం బుధవారం డివిజన్ ఆఫీసులకు చేరింది.

ఊరట ఇచ్చేలా వర్షం

(5వ పేజీ తరువాయి)

కేవలం 11వేల క్యూసెక్కుల వరకే ఉన్న ఇన్‌ఫ్లో ఉండగా అది పెరుగుతూ వస్తోంది. కీసర వాగు నుంచి భారీగా 20,966 క్యూసెక్కులు వస్తుంటే, పాలేరు నుంచి 7,004 క్యూసెక్కులు, వెలగలేరు నుంచి 5,083 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి చేరుతోంది. బ్యారేజి సామర్థ్యం 12 అడుగుల మేర నిల్వ అవకాశం ఉంటే, ప్రస్తుతం 11.5 అడుగుల నీటి మట్టం ఉండేలా చూస్తున్నారు. మిగిలిన నీటిని కిందికి వదిలేస్తున్నారు. బ్యారేజి దగ్గర 20 గేట్లను అడుగు ఎత్తుమేర పైకి లేపి 14,240 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. పశ్చిమ డెల్టాకు బుధవారం 516 క్యూసెక్కులు వదిలారు. బుధవారం కూడా వర్షాలు పడటంతో గురువారం వరద ప్రభావం ఎక్కువగా ఉండి, బ్యారేజికి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉంటుందని బ్యారేజి అధికారులు చెబుతున్నారు. బ్యారేజి నుంచి 14,240 క్యూసెక్కుల వరద నీటిని నదిలోకి వదిలేస్తుండటంతో కొల్లిపర, గాజుల్లంక దగ్గర కృష్ణా జిల్లాకు వెళ్లేందుకు వేసుకున్న గాలు మార్గం కోతకుగురై, రాకపోకలు ఆగిపోయాయి. నిన్నటి వరకు వ్యవసాయ ఉత్పత్తులు, వరి గడ్డి రవాణాకు ఈ మార్గాలు ఉపయోగపడితే, ఇప్పుడు అవకాశం లేకుండా పోయింది. మనుషులు మాత్రం పడవల ద్వారా నది దాటుతున్నారు.

కుడి కాల్వకు సాగునీరు

భారీగా వరద పోటెత్తు తుండ టంతో నాగార్జున సాగర్ జలాశ యంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో సాగర్ జవహర్ కుడి కాల్వకు జలవనరుల శాఖ బుధవారం సాయంత్రం 6 గంటలకు సాగుకు 500 క్యూసెక్కు ల నీటిని విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈలు భారతి, సుదా, అనిత, రమణ పాల్గొన్నారు. క్ర మేపి నీటి విడుదలను 6,000 క్యూసెక్కులకు పెంచనున్నారు. గత ఏ డేళ్లలో జూలైలో సాగునీటిని విడు దల చేయడం ఇదే ప్రథమం. నీటి విడుదలతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

50,048 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,954 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,048 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,222 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12500
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	----
4884	---	---	341	10000	13600
సూపర్ 10	----	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	---	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

బంగారు కుటుంబాల దత్తతకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

● కలెక్టర్ నాగలక్ష్మి విజ్ఞప్తి

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రారంభించిన పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకొని అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రభుత్వ, దాతలు, ప్రజలు భాగస్వామ్యం(పీ4) కార్యక్రమంపై జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న పది శాతం వ్యక్తులు మార్గదర్శకులుగా, అట్టడుగున ఉన్న 20 శాతం బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించటమే పీ-4 అని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్చి నుంచి నిర్వహించిన సర్వేలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో దాదాపు 1.20 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించారన్నారు. గుర్తించిన బంగారు కుటుంబాల వివరాలను గ్రామసభల ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక పెద్దలతో చర్చించి అర్హత ఉన్న వారినందరిని జాబితాలో చేర్చుచున్నారు. పీ-4 కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న వారు వ్యక్తిగతంగాను, సంస్థల పరంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని సహకారం అందించాలన్నారు. కుటుంబాలు, ప్రాంతాలు, గ్రామాలు, మండలాలను దత్తత తీసుకోవచ్చన్నారు. ప్రభుత్వం విజన్ 2047 స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా శ్రీకారం చుట్టిన పీ-4 కార్యక్రమంలో మార్గదర్శులు బాగస్వాములై బంగారు కుటుంబాలను దత్తత తీసుకో వటానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఏపీఐఐసీ, జీఎస్‌టీ, ఐటీసీ, కోకాకోలా, మిర్చి ఎక్స్‌పోర్ట్, ఆటోనగర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉంటే మార్ట్ గేజ్ రిలీజ్ చేయం

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు తగిన డ్రైనేజి సిస్టం ఏర్పాటు చేసుకొని, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, లేకుంటే మార్టిగేజ్ మంజూరు చేయబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ గోరంట్ల, గాయత్రీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, డ్రైనేజి కనెక్షన్ లేని వాటికి మార్టిగేజ్ మంజూరు నిలిపివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డు సచివాల య ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

అనంతరం చౌడవరంలోని సీఆర్ కాలనీలో పర్యటించి, కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలని, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదే శించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ఎస్ఎస్ ఐజాక్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలి

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జీఎంసీ ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌వోబీ నిర్మాణ పనులు ప్రారంభమైనందున నగరంలో ప్రజల రాకపోకలకు జీఎంసీ వైపు నుంచి పక్కగా చర్యలు తీసుకోవాలన్నారు. కంకరగుంట ఆర్‌యూబీ వద్ద వర్షానికి నీరు నిలిచి రాక పోకలకు ఇబ్బందిగా ఉందని, అక్కడ ప్రస్తుతం ఉన్న మోటర్లకు అదనంగా ఏర్పాటు చేసి, వర్షాకాలం ముగిసే వరకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ట్రాఫిక్ సీఐలు అశోక్, వీరాస్వామి, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ఏసీపీలు రెహ్మాన్, వెంకటేశ్వరరావు, డీఈఈలు నాగభూషణం, కల్యాణరావు, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమే

● డీఎస్పీ అరవింద్‌కుమార్

గుంటూరు (విద్య), జూలై 23 (ఆంధ్రజ్యోతి): యువత ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమేనని డీఎస్పీ కే అరవింద్‌కుమార్ హెచ్చరించారు బుధవారం టీజేపీఎస్ కళాశాలలో ర్యాగింగ్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్ భూ తం జోలికి వెళ్లి అందమైన జీవితాలను అంధకారం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని చక్కగా చదువుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోజుల్లో అందరూ సెల్ ఫోన్స్ వినియోగించడం మూలంగా సైబర్ క్రైమ్‌కి సంబంధించి నేరాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి మీద అవగాహన కలిగివుంటే మనకు నష్టం కలుగకుండా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కామే శ్వర శాస్త్రి, పీజీ ప్రిన్సిపాల్ ఎస్ అనితాదేవి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంక టేశ్వర్లు, ఎస్ఐ రామాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, కళా శాల యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ కుమార్‌రాజా, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అరవింద్‌కుమార్

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞానపరిషత్ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ గణపతి, రుద్ర, చండీ హోమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలి తాంబ దంపతులతో 9మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



చండీహోమం చేస్తున్న వేదపండితులు

జీటీ రోడ్డులో ట్రా'ఫికర్'

● ఒక వైపు డివైడర్ నిర్మాణం.. మరో వైపు వ్యర్థాల కుప్పలు

● వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



మట్టి కుప్పలతో కుచించుకుపోయిన జీటీ రోడ్డు

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జీటీ రోడ్డులో వాహనదారులు భయం భయంగా వాహనాలు నడపాల్సి వస్తోంది. ఇప్పటికే గుంతలతో అనేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు తాజాగా డివైడర్ నిర్మాణాలతో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జీటీ రోడ్డులో పొగాకు బోర్డు ఎదుట నుంచి చుట్టుగుంట సెంటర్ వరకు రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇటీవల జోరు వర్షాలతో డివైడర్ పనులకు ఆటంకం కలిగింది. ఇదిలా ఉంటే డివైడర్ నిర్మాణ పనుల కోసం గ్రావెల్ కుప్పలను రోడ్డు పైనే పోశారు. మరో వైపు రోడ్డు పక్కన అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణాల కోసం తొలగించిన వ్యర్థాలను మరోవైపు రోడ్డుపైనే కుప్పలు, కుప్పలుగా వేయటంతో అసలు సమస్య మొదలైంది. ఉదయం, సాయంత్రం వంటి రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే లారీలు, బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే జీటీ రోడ్డులో ఒక వైపు మట్టి కుప్పలు, మరో వైపు ఆక్రమణలతో రోడ్డు కుచించుకుపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



వ్యర్థాల కుప్పలతో దర్శనమిస్తున్న జీటీ రోడ్డు

మిర్చియార్డులో అవినీతిపై వారంలో నివేదిక ఇవ్వాలి

● ఎమ్మెల్యే మాధవి ఫిర్యాదుపై సీఎస్ విజయానంద్ ఆదేశాలు

● గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనాలతో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే

● అయినప్పటికీ పట్టించుకోని మార్కెటింగ్ అధికారులు

● సీఎస్‌కు ఫిర్యాదు చేయడంతో శాఖలో ఉలికిపాటు

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో లైసెన్సులను పునఃసమీక్షించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఇచ్చిన ఫిర్యాదుపై ఏమి చర్యలు తీసుకొన్నారో వారంలో వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రెటరీ విజయానంద్ మార్కెటింగ్ శాఖను ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరుస కథనాలపై ఎమ్మెల్యే మాధవి ఈ ఏడాది మే 30వ తేదీన మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎమ్మెల్యే మాధవి నేరుగా సీఎస్‌కు ఫిర్యాదు చేశారు. చీఫ్ సెక్రెటరీ నుంచి మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీతకు ఆదేశాలు వెళ్లడంతో ఆమె మిర్చియార్డు సెక్రెటరీ చంద్రికకు ఎమ్మెల్యే మాధవి ఫిర్యాదును జత చేసి వారంలో సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాలకు టాప్ ప్రయార్టీ ఇవ్వాలని బుధవారం జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు.

28న వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు

గుంటూరు (విద్య), జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ పర్యావరణ పరిరక్షణ' దినోత్సవాన్ని పురస్కరించుకొని టీజేపీఎస్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థాయి అంతర కళాశాలల వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచనకు సంబంధించి ది ఇంపార్టెన్స్ ఆఫ్ ప్రొటెక్టింగ్ నేచర్ ఫర్ ఫ్యూచర్ జెనరేషన్స్, పోస్టర్ పెయింటింగ్‌కు సంబంధించి ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి కళాశాల నుంచి ఒక ఈవెంట్‌కి ముగ్గురు విద్యార్థులు పాల్గొనవచ్చని, పోస్టర్ పెయింటింగ్‌కు సంబంధించి ఛార్ట్ కళాశాల వారే ఏర్పాటు చేస్తారన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు మెమోంటో, ప్రశంసా పత్రాలు ఇవ్వటం జరుగుతుందని, పాల్గొన్న అందరికీ ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు 27వ తేదీ సాయంత్రం లోపు తమ పేర్లను డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ (9849854221) గుంటూరు జిల్లా నోడల్ అధికారిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్క హాస్పిటల్‌లో అత్యాధునిక బ్రాకీథెరపీ సేవలు

గుంటూరు మెడికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆర్క హాస్పిటల్‌లో అత్యాధునిక కేన్సర్ వైద్య చికిత్సలు అందుబాట్లోకి రావడం జిల్లావాసులకు ఎంతో మేలు చేస్తుందని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. పెదకాకాని రోడ్‌లోని ఆర్క హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రా ఫ్లెక్సిట్రాన్ బ్రాకీథెరపీ యూనిట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ పరికరంతో గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌ను సమర్థవంతంగా నయం చేయవచ్చని డాక్టర్ రమణ తెలిపారు. ఆస్పత్రి డైరెక్టర్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ డీఎస్ రాజునాయుడు మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్ పథకాలు ఉన్నాయన్నారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ హేమంత్ మాకినేని మాట్లాడుతూ పేదలతో పాటు మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని సేవాదృక్పథంతో తక్కువ ధరలకే కేన్సర్ చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్క ట్రస్ట్ ద్వారా పేద రోగుల చికిత్సల్లో ఆర్థిక సాయం కూడా అందిస్తున్నట్లు చెప్పారు.



బ్రాకీథెరపీ యూనిట్‌తో రమణ, రాజునాయుడు, హేమంత్

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందజేస్తున్న సీహెచ్ మస్తానయ్య

గుంటూరు (తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదిక పై అన్నమయ్య సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివే పేద విద్యార్థులకు ఉపకారవే తన పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహే శ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు తదితరులు పాల్గొని సుమారు 40 విద్యార్థులకు సుమా రుగా 5 లక్షల రూపాయలను పంపిణీ చేశారు.

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు(తూర్పు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మండల కార్యాలయంలో ఈనెల 26న ఉదయం 11 గంటలకు రూరల్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరు గుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మండల సిబ్బంది పాల్గొనాలని కోరారు.

మృతుడి కుటుంబానికి అండగా ప్రభుత్వం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని దేవాపురంలో పీకలవాగుపై మంగళవారం నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ కూలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కూలీ తోట అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని మేయర్ కోవెలమూడి రవీంద్ర హామీ ఇచ్చారు. బుధవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాల యంలోని మేయర్ చాంబర్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకర్గ ఎమ్మె ల్యే గల్లా మాధవితో కలిసి బాధిత కుటుంబసభ్యులకు రూ.5 లక్షల చెక్‌ను కాంట్రాక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడికి ముగ్గురు ఆడపిల్లలున్నారని, వారు తమ జీవన భృతికి రైతుబజార్‌లో షాప్ వంటి వాటిని అడుగు తున్నారని, అందుకు తగిన విధంగా సాయం చేయడానికి కృషి చేస్తామన్నారు.



మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన మేయర్, కమిషనర్

కళాస్రవంతి నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్రనగర్ లో కళాస్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడిగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, ఉపాధ్యక్షుడిగా ఎర్రమనేని రంగారావు, ప్రధాన కార్యదర్శిగా తాళ్ళూరి వెంకట రత్నారావు, కార్యదర్శిగా సూరం సాంబశివ రావు, కోశాధికారి పుట్టగంటి నరసింహారావు, కార్యవర్గ సభ్యులుగా రాణీ ప్రమీల, కొమ్మతోటి కెజియా, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాహిత్య సభ అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి ప్రభు దాస్ మాట్లాడుతూ తొలి కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం కవికోకిల గుర్రం జాషువా సాహిత్య సభ నిర్వహి స్తున్నట్టు చెప్పారు. సమావేశంలో పల్నాటి సుబ్బారావు, వాసా మాణి క్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కళాస్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ సభ్యులు

స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలపాలి

గుంటూరు సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): నేటి తరానికి స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్య ఫౌండేషన్ చైర్మన్ వీబీ ప్రసాద లింగం అన్నారు. అందుకోసమే ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలకు, గ్రంథాలయా లకు సమరయోధుల జీవిత చరిత్ర, పోరాటాలకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా గుంటూరులోని బండ్లమూడి హనుమాయమ్మ పాఠశాలలో బుధవారం పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన పెద్ద బాలశిక్ష, జనరల్ నాలెడ్జి పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమశాఖ సూపరింటెండెంట్ ఎంఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అంద జేస్తున్న విద్య ఫౌండేషన్ చైర్మన్ వీబీ ప్రసాదలింగం

ఎన్నారైలో క్వాంటం కంప్యూటింగ్ ల్యాబ్ ప్రారంభం

మేడికొండూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరిం గ్ కళాశాలలో క్వాంటం కంప్యూ టర్ శిక్షణ కోసం ఎన్నారైల సహకారంతో నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీ.తిలక్ బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులకు నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించాలని, పోటీ ప్రపంచంలో విద్యార్థుల ఉపాధి కల్పనకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నూతన కంప్యూటర్ ల్యాబ్‌ని సరికొత్త ఆవిష్కరణలతో ఎన్నారైల సహకారంతో ప్రారంభిస్తున్నామని చెప్పారు.

కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ మాట్లాడుతూ విద్యార్థుల కు మొదటి సంవత్సరం నుంచే ఉద్యోగాల సాధనకు అవసరమైన డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక శిక్షణ పొందవచ్చునని తెలిపారు. విద్యార్థులను పోటీ ప్రపంచంలో మంచి ప్యాకేజ్‌తో ఉద్యోగాల్లో చేరి రాణించాలంటే ఇటువంటి ల్యాబ్‌లు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో బండారు సీతారామయ్య, డేటా సైన్స్ విభాగాధిపతి భవాని, కంప్యూటర్ సైన్స్ విభాగాధి పతి కోటేశ్వరరావు, ఐటీ హెచ్‌వోడీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మూడు వంతెనల వద్ద మురుగుకు చెక్

● మురుగునీటి తరలింపునకు డ్రెయిన్ నిర్మాణం ● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'చినుకుపడితే మూడు వంతెనలతో పాటు నెహ్రూనగర్, మోతీలాల్ నగర్ ప్రాంతాలు నీట మునిగిపోయేవి. నాలుగు దశాబ్దాలుగా వేధిస్తున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నాం' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మురుగునీటి తరలింపు కోసం నిర్మించే డ్రెయిన్ నిర్మాణానికి సంబం ధించి నెహ్రూనగర్‌లో అడ్డుగా ఉన్న గృహ యజమానులను గురువారం కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ వెళ్లి కలిశారు. ఎన్నో ఏళ్లుగా వర్షాకాలంలో ముంపు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి వారికి వివరించారు. ఇళ్లు కోల్పోతున్న వారికి డ్రెయిన్ ఆవశ్యకత గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పించి ప్రభుత్వపరంగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. దీంతో డ్రెయిన్ నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 'రూ.2 కోట్లతో చేపట్టిన మూడు వంతెనల నుంచి మణిపురం బ్రిడ్జి అనుసంధానంగా పీకలవాగులో కలిసే డ్రెయిన్ నిర్మాణానికి సహకరించిన నెహ్రూనగర్ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి రైల్వే, మున్సిపల్ అధికారు లను సమన్వయం చేసుకుంటూ డ్రెయిన్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తామని అన్నారు.



నెహ్రూనగర్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గడపగడపలో సంక్షేమం.. వాడవాడలా అభివృద్ధి : ఎమ్మెల్యే

గడపగడపకు సంక్షేమాన్ని, వాడవాడలా అభివృద్ధిని తీసుకురావడమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలన- తొలిఅడుగు అంటూ 57వ డివిజన్లో బుధవారం ఆయన ప్రజలతో మమేకమయ్యారు. రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలపై వెంటనే అధికారులకు ఆదేశాలిచ్చారు. నందివెలుగు బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్, కార్పొరేటర్ రిహానా, క్లస్టర్ ఇన్‌చార్జ్ వేల్పూరి కిరణ్, చట్టు కనకారావు, పల్లెపోగు రమేష్, వెంకటేశ్వరావు, వాసు కాసింబాబు, రమాదేవి, దాసు మాస్టర్, బెనర్జీ మాస్టర్, చాట్ల విజయబాబు, ఆగ్నేస్, అప్పారావు, కుమార్, నూర్, కోటేశ్వరరావు, శోభన్‌బాబు, అంకారావు, పవన్, శివకృష్ణ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ



రామకృష్ణ

గుంటూరు(తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బజరంగ్ రామకృష్ణను నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరు కూరి తిరుపతిరావు తెలిపారు. గతంలో రామకృష్ణ 44వ డివిజన్ అధ్యక్షుడిగా, మజ్దూర్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ గోరక్షా సమైక్య ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనని నియమించడంపై జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావుకి, సీనియర్ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

పిడుగును పసిగట్టే దామిని

వర్షా కాలం వచ్చిందంటే చాలు తరచూ ఏదో ఒక చోట పిడుగులు పడుతూ ఉంటాయి. వాటి తీవ్రతకు ప్రజలు. మూగ జీవాలు ప్రాణాలు కోల్పోవటం జరుగుతుంటుంది. ఈ ప్రమాదం నుంచి బయట పడటానికి, పిడుగు పాటును ముందుగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సాంకేతికతతో యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఆ యాప్ అపాయాన్ని ముందుగానే గుర్తించి మనల్ని అప్రమత్తం చేస్తుంది.



సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో ఇటీవల పిడుగు పడి ఇంటి గోడలు పగుళ్ళు ఇచ్చాయి. ఐతే ఇంటిలో వారికి ఎటువంటి ప్రమాదం జరగ లేదు. పిడుగు శబ్దానికి ఆ ఇంట్లోని సామాగ్రి పాడవ్వటంతో పాటు భయాందోళనలకు గురయ్యారు.

సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి): పిడుగు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు యాప్‌లో తెలియ జేస్తున్నారు. ఆరు బయట ఉంటే ఇళ్ళల్లోకి వెళ్ళాలి. వర్షం కురుస్తున్న సమయంలో చాలా మంది చెట్ల కిందకు వెళ్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. చెట్టు పిడుగును త్వరగా ఆకర్షిస్తుంది. వర్షం పడేటప్పుడు చెట్టు కిందకు ఎట్టి పరిస్థితుల్లోను వెళ్ళకూడదు. మెరుపులు అధికంగా ఉంటే ఇంటి నుంచి బయటకు వెళ్ళక పోవటం ఉత్తమం. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో ఎలక్ట్రానిక్ వస్తువులు ఉపయోగించకపోవటం మేలని నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

● దామిని యాప్ అందుబాటులోకి..

వాతావరణానికి సంబదించిన వివరాలు తెలుసుకోవటానికి కేంద్ర యర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ప్రజలకు ఉయోగ పడేలా దామిని యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీనిని గుగూల్ ప్లే స్టోర్ ఉంచి డౌన్ లోడు చేసుకొని పేరు, మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి. జీపీఎస్ లొకేషన్ తెలుసుకోవటం కోసం యాప్‌కు అనుమతి ఇవ్వాలి. దీంతో మీరు ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో ముందుగానే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో అన్ని బాషలు అందుబాటులో ఉన్నాయి.

శుభాల.. శ్రావణం

పండుగలు వస్తున్నాయ్..

శ్రావణంలో అనేక పండుగలు వస్తున్నాయి. ఈనెల 25న తొలి శుక్రవారం, 8న వరలక్ష్మి వ్రతం, 9న రాఖీ, జంధ్యాల పౌర్ణమి వేడుకలు, 15న స్వాతంత్రదినోత్సవం, 16న శ్రీకృష్ణాష్టమి వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. 22న ఐదో శుక్రవారంతో శ్రావణ మాసం ము గుస్తుంది. శ్రావణం పూరైన వెంటనే బాద్రపద మాసంలో 27న వినాయక చవితి పండుగ వస్తుంది.



- రేపటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- పండుగలకు 'నెల'వు..
- మహిళలకు ప్రీతిపాత్రం
- వ్యాపారులు, రైతులు, పురోహితుల్లో ఆశలు
- దేవాలయాలూ ముస్తాబు

నెలల వారీగా ముహూర్తాలు

జూలైలో: 26, 30, 31
ఆగస్టు: 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17.
సెప్టెంబరు: 24, 26, 27, 28.
అక్టోబరు: 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31.
నవంబరు: 1, 2, 7, 8, 12, 13, 15. 22, 23, 26, 27, 28, 30

● నవంబరు నెల్లో కూడా ముహూర్తాలు రికార్డు స్థాయిలో ఉన్నాయని అనంతరం. డిసెంబరు 8 నుంచి ఫిబ్రవరి 6 తేది వరకు దాదాపు రెండు నెలలపాటు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

గుంటూరు (తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): మే నెలతో ముహూర్తాలు ముగియడంతో వివాహాలు, శుభకార్యాలకు విరామం వచ్చింది. శ్రావణ మాసం ఆరంభం నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో పట్టణాలతో పాటు పల్లెల్లోనూ కల్యాణ మండపాలను సిద్ధం చేస్తున్నారు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలకు బలమైన ముహూర్తాలు ఉన్నట్టు వేద పండితులు చెబుతున్నారు. మరో వైపు ఈ మాసం మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైంది. ధార్మిక, ఆధ్యాత్మిక, వ్యాపార ప్రారంభం వంటి శుభకార్యాలతో ముడిపడి ఉంటుంది. వివాహం, గృహ ప్రవేశం, గృహ నిర్మాణం, నామకరణం వంటి అనేక శుభ కార్యాలు నిర్వహించటానికి మంచి నెలగా అందరూ భావిస్తారు. కొత్త దంపతులు ఆషాడంలో ఎడబాటు కు గురవు తారు. శ్రావణంలో కలుస్తారు.

విష్ణు పూజలకు ప్రత్యేకం..

శ్రావణ మాసం ప్రారంభం కానుండటంతో మహిళలు శ్రావణ లక్ష్మీవ్రతాలను ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. సర్వమంగళ కారియైన గౌరి, లక్ష్మి, హరిహరులను విశేషంగా అర్చించే నెల కూడా ఇదే. చాంద్రమానం ప్రకారం శ్రావణాన్ని ఐదో నెలగా పరిగణిస్తారు. ఈనెల పౌర్ణమిన చంద్రుడు శ్రవణ నక్షత్ర సమీపంలో సంచరిస్తున్నందున శ్రావణ మాసంఅనే పేరు వచ్చినట్లు పండితులు చెబుతారు. శ్రవణ నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం కావటంతో విష్ణు పూజలకు ప్రసిద్ధి. ఈ నెలలో వచ్చే మంగళ, శుక్ర, శనివారాలను అత్యంత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు. మంగళవారం గౌరీ పూజలు, శుక్రవారాల్లో లక్ష్మీపూజలు, శనివారాల్లో విష్ణు పూజలు చేస్తారు. వైష్ణవారాధనతో పాటు మహా శివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు.

వ్యాపారుల్లో ఆశలు...

ముఖ్యంగా ఈనెల 31న పెద్ద ముహూర్తం కావడంతో పెళ్లిళ్ల పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. దీంతో అయా వ్యాపారులు, పురోహితులు ఈ ముహూర్తంపై ఆశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో శ్రావణ మాసంపై రైతులు పెద్ద ఆశలే పెట్టుకున్నారు. ముఖ్యంగా ధరలేక నష్టపోతున్న మిర్చి, పొగాకు రైతులు ఈ నెలలో నైనా ధర పెరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



● శ్రావణ మాసం ప్రత్యేకమైంది...

శ్రావణమాసం అంటే ఎంతో పవిత్రమైనదిగా, ప్రధానమైనదిగా భావిస్తారు. జ్ఞానసిద్ధిని అందించే మాసంగా పురాణాల్లో పేర్కొన్నారు. వైష్ణవా రాధనతో పాటు మహా శివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.



మాధవస్వామి

గుంటూరు బృందావన్‌గార్డెన్స్,వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు



● పెసర్లంక వద్ద వరద ఉధృతికి కోతకు గురవుతున్న పంట పొలాలు

నదీపాతంలో పొలాలు

- భూమి కోతలతో రైతులకు గుండెకోత
- తీర పొలాల రక్షణకు గ్రాయిన్స్ ఏర్పాటు చేయాలని వినతి

కొల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉధృతికి తీర ప్రాంత పొలాలు నదీపాతంలో కలిసిపోతున్నాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో చిలుమూరు నుంచి రావిఅనంతవరం వరకు సుమారు 30 కి.మీ పైగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో వందలాది ఎకరాల పంట భూములు వరదల వల్ల కోతకు గురవుతున్నాయి. గత సంవత్సరం కృష్ణానదికి వచ్చిన భారీ వరదకు అంచున ఉన్న భూములు నదిలో కలిసిపోయాయి. 30 ఏళ్ల క్రితం కొల్లూరు మండలంలో పోతార్లంక, తిప్పలకట్ట గ్రామాల మధ్యలో భూమి కోతలు నివారించేందుకు గ్రాయిన్స్(గోడలు) నిర్మించి నదీ ప్రవాహాన్ని దారి మళ్లించడంతో కొంత మేరకు కోతలు తగ్గాయి. కొన్నేళ్ల నుంచి భట్టిప్రోలు మండలం ఓలేరు, కొల్లూరు మండలంలోని పెసర్లంక, పోతార్లంక, తిప్పలకట్ట గ్రామాల పరిధిలో భూమి కోతకు గురవుతోంది. వరద ప్రవాహం పెరిగేటప్పుడు తగ్గేటప్పుడు భూమి కోతలు ఎక్కువగా ఉంటున్నాయి. భూమి ఎక్కువగా కోతకు గురయ్యే ప్రాంతాల్లో నది పరివాహక శాఖాధికారులు గుర్తించి గ్రాయిన్స్ ఏర్పాటు చేస్తే ప్రవాహం దిశ మారుతుందని రైతులు చెప్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రాయిన్స్ ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ సీట్ల జాబితా విడుదల

- 26 లోపు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు

గుంటూరు (విద్య) జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ఆప్షన్ పెట్టుకున్న విద్యార్థిని విద్యార్థులకు సీట్లు కేటాయిస్తూ సాంకేతిక విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థిని ,విద్యార్థులు నిర్దేశించిన తేదీల్లో సీట్లు కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాలని సాంకేతిక విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీట్లు కేటాయింపు తెలుసుకునేది ఇలా..

విద్యార్థిని విద్యార్థులు తమకు ఏ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వచ్చింది అనే విషయాలు తెలుసుకునేందుకు వెబ్సైట్ లో చూడాలి . ఏపీ ఈఏపీ సెట్ హోం పేజీలో ఫారమ్స్ అనే బాక్స్ లో డౌన్లోడ్ అలాట్మెంట్ ఆర్డర్ పై క్లిక్ చేస్తే వివరాలు తెలుస్తాయి. అక్కడ హాల్ టికెట్ నంబర్ పుట్టిన తేదీ వివరాలు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది దానిని ఎంటర్ చేసిన వెంటనే అలాట్మెంట్ ఆర్డర్ సెల్ఫ్ రిపోర్టింగ్ ,వెబ్ ఆప్షన్ రిపోర్టింగ్ డిస్ప్లే అవుతాయి. ఇక్కడ ఏ కళాశాలలో సీటు వచ్చిందో దానికి సంబంధించిన అలాట్మెంట్ ఆర్డర్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చినని సాంకేతిక విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వెరిఫికేషన్‌కు అవసరమైన పత్రాలు ఇవే..

ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు వచ్చిన విద్యార్థిని విద్యార్థులు ఈనెల




26న రిపోర్ట్ చేయాలి. ఈ నేపథ్యంలో విద్యార్థులు కళాశాలకు వెళ్లే సమయంలో ఆన్లైన్ కౌన్సెలింగ్ స్లిప్పు , ఏపీ ఏపీ సెట్ ర్యాంక్ కార్డ్, అడ్మిట్ కార్డ్, పదవ తరగతి సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల జాబితా, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ ,ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కుల, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్ కాపీల సెట్లు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. జిరాక్స్ కాపీలను కళాశాలలో అందజేసి రిపోర్ట్ చేయాలి. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది.

జిల్లాలో పరిస్థితి ఏమిటి

ఉమ్మడి జిల్లాలో రెండు యూనివర్సిటీ కాలేజీ లతోపాటు మరో 36 పైగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో దాదాపు 30వేలకు పైగా సీట్లు ఉన్నాయి. అయితే అయితే ఏపీ ఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల విద్యార్థులు 25 వేల మంది వరకు ఉన్నారు.

మిర్చి.. మోత

కిలో రూ. 100, టమోటా రూ. 60



గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో పచ్చి మిర్చి ధర చెబితేనే ఘాటెక్కుతోంది. మరో వైపు టమోటా ధరలు కూడా మోత మోగుతున్నాయి. టమోటా కిలో రూ. 60కు చేరుకుంది. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవటం, డిమాండ్‌కు అనుగుణంగా పంట ఉత్పత్తులు లేకపోవటంతో టమోటా, మిర్చి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. పచ్చి మిర్చి గత రెండు వారాల కింద రూ. 50 నుంచి రూ. 60ల నుంచి ఎగబాకుతూ ప్రస్తుతం రూ. 100లకు చేరుకుంది. గత వారంలో టమోటా కిలో రూ. 40లు ఉండగా రోజురోజుకు పెరుగుతూ తాజాగా కిలో రూ. 60లకు చేరింది. సోమ, మంగళవారాలు కూడా టమోటా కిలో రూ. 40లు, రూ. 50లకు విక్రయించగా ఒక్క రోజులోనే కిలోకు రూ.10లకు పెరిగింది. ఇక బెండ, దొండ, గోరు చిక్కుడు, వంకాయ వంటి కూరగాయలు కిలో రూ. 40 నుంచి రూ. 50ల వరకు విక్రయిస్తున్నారు.

సబ్ డివిజన్ సర్వీసులకు ఫీజు రాయితీ

డిసెంబరు 12 వరకు పొడిగించిన ప్రభుత్వం

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌ల ఆన్‌లైన్ సబ్ డివిజన్ సర్వీసుల కోసం అందిన దరఖాస్తులకు వన్‌టైం ఫీజు రాయితీని ప్రభుత్వం మరికొన్ని నెలలు పొడిగించింది. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన వన్‌టైం ఫీజు రాయితీని ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. అయితే ఇంకా చాలామంది ఈ రాయితీని వినియోగించుకోనేందుకు అభ్యర్ధనలు పెట్టుకోవడంతో గడువు తేదీని పొడిగిస్తూ సీసీఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

భూముల రీసర్వేలో భాగంగా గత ప్రభుత్వం ఎల్‌పీఎంలను తీసుకొచ్చింది. వీటి వలన భూముల సర్వే నంబర్లు కనుమరుగై వాటి స్థానంలో ఎల్‌పీఎంలు వచ్చాయి. వీటి ఆధారంగానే రిజిస్ట్రేషన్లు కూడా చేస్తున్నారు. అయితే జాయింట్ ఎల్‌పీఎంల వలనే అనేక భూవివాదాలు నెలకొన్నాయి. వాటిని సింగిల్ ఎల్‌పీఎంలుగా చేయాలని రైతుల నుంచి రెవెన్యూ సదస్సుల సందర్భంగా వేల సంఖ్యలో అభ్యర్ధనలు వచ్చాయి. గుంటూరు జిల్లాలో 3036, పల్నాడు జిల్లాలో 3378, బాపట్ల జిల్లాలో 4253 అర్జీలు వచ్చాయి. వీటిల్లో ఎక్కువగా జాయింట్ ఎల్‌పీఎంలవే ఉన్నాయి. తమకు ఉచితంగా సింగిల్ ఎల్‌పీఎం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్ధించగా అందుకు ఆమోదం తెలిపి, ఆరు నెలల పాటు ఉచితంగా అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు రూ. 550 ఫీజు నిర్ణయించడంతో రైతులు ఇబ్బంది పడగా ప్రభుత్వం దానిని వన్‌టైం రాయితీ కింద మినహాయించింది. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలపై స్వీకరించిన దరఖాస్తులను పూర్తి పరిశీలన చేసి ఆన్‌లైన్ సబ్‌డివిజన్‌ని ఉచితంగా చేస్తున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన తొలి ఆరు నెలల గడువు ఆయా ఆన్‌లైన్ దరఖాస్తుల పరిష్కారానికి సరిపోకపోవడంతో రైతుల విజ్ఞప్తి మేరకు మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు త్వరితగతిన ఆన్‌లైన్ సబ్ డివిజన్‌కు సంబంధించిన జాయింట్ ఎల్‌పీఎం అర్జీలను పరిష్కరించాలని కోరుతున్నారు.

దివ్యాంగులకు వాహనయోగం

- ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- తొలిదశలో నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ
- త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు(తూర్పు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇంధన రాయితీ, శాశ్వత గుర్తింపు కార్డులు అందజేసిన కూటమి ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. వారికి నూరు శాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు (రెట్రోఫిటెడ్ వాహనాలు) అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ త్వరలోనే ప్రారంభమవుతుందని అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితాను తయారు చేసి వీలైనంత వేగంగా వాహనాలు అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. గతంలోనే 50 శాతం ఇందన రాయితీ కల్పించిన ప్రభుత్వం మరోసారి రూ లక్ష విలువ కలిగిన వాహనాలను అందజేయడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ వాహనాలు అందజేసింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల కాలంలో ఒక్కసారే పంపిణీ చేశారు.

● ఆనందంగా ఉంది..



ఎన్నికల హామీలో భాగంగా పెన్షన్ పెంచడం, ఆ తరువాత ఇందన రాయితీ, ఇప్పుడు లక్ష రూపాయిలు విలువ చేసే వాహనాలను అందించడం ఆనందంగా ఉంది. ఇటువంటి కార్యక్రమాలతో దివ్యాంగులకు స్వయం ఉపాధిని కొనసాగించడానికి, వారికి జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు శక్తి నిస్తుంది. ప్రభుత్వం స్పందించి అధికారంలోకి రాగానే ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించడం అభినందనీయం. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వాహనం అందించేలా కార్యచరణ రూపొందించాలి.

వెలుగు శివప్రసాదు, విభిన్న ప్రతిభా వంతుల ఆదరణ సేవ సమితి అధ్యక్షుడు



● సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం తీసుకు వస్తున్న ఈ కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వియోగం చేసుకోవాలి. దీనికి సంబంధించిన నిధులును ప్రభుత్వం కేటాయించింది. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తాం. కావాల్సిన పత్రాలు ఇతర వివరాలను అందజేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచాం. ప్రభుత్వ ఆదేశాలు అందగానే దరఖాస్తులు స్వీకరించి, ప్రభుత్వానికి పంపుతాం. అర్హుల జాబితాను ఎంపికచేసి, వీలైనంత త్వరలోనే వాహనాలను పంపిణీ చేస్తాం.

దుర్గాబాయి, ఇన్‌చార్జి ఏడీ వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లా శాఖ.

కావాల్సిన పత్రాలు

దరఖాస్తుతో పాటు వైకల్యం 70శాతం నిర్ధారించే సదరన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పదవ తరగతి సర్టిఫికెట్, బ్యాంకు వివరాలు, ఆధార్, రేషన్ కార్డులు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్టు ధృవీకరణ పత్రంతో అయా జిల్లాలోని వయోవృద్ధులు, హిజ్రాల, దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలి.

అర్హులు ఎవరంటే..

త్రిచక్ర వాహనాల పంపిణీకి దివ్యాంగుల అర్హతలను ఇప్పటికే ప్రభుత్వం నిర్ధారించింది. డిగ్రీ, ఆపై ఉన్నతవిద్య అభ్యసించే విద్యార్థులకు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారికి తొలి ప్రాధాన్యమిస్తారు. 18-45 ఏళ్ల మధ్య ఉన్న 70 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు దీనికి అర్హులు. వార్షికాదాయం రూ. 3లక్షల లోపు ఉండాలి.

● నియోజకవర్గానికి పది వాహనాలు

తొలిదశలో నియోజకవర్గానికి 10 చొప్పున వాహనాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని ప్రతి ఏడాది నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుంది. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరి కొంత మందికి వీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారునికి వాహనం అందుతుందని అధికారులు చెబుతున్నారు.

విజేత



వింత చూపులు వెంటాడేవి. చులకన మాటలు నిద్ర లేని రాత్రుల్ని మిగిల్చేవి. అన్నిటినీ దిగమింగుకొని... స్వశక్తితో ఎదిగి... నేడు పిల్లల దుస్తుల బ్రాండ్‌కు అధిపతులయ్యారు. చేనేతపై కవిత్వాన్ని పేర్చి... కళాకారులకు చేయూతనందించి... పర్యావరణహితమైన దుస్తులు ఉత్పత్తి చేస్తూ... మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు... **శ్వేత, అంకిత ధరివాల్.** ఈ అక్కాచెల్లెళ్ల స్ఫూర్తిదాయక కథ... శ్వేత మాటల్లోనే...

నవ్విన నోళ్లే మెచ్చేలా!

"మా కథ చెప్పాలంటే... పద్దెనిమిదేళ్లు వెనక్కి వెళ్లాలి. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్... ఎండలు మాడిపోతున్నాయి. నా పిల్లలు ఏ డ్రెస్ వేసినా ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మార్కెట్‌లో ఎంత వెతికినా సరైన గాలి జొరబడేవి, సున్నితమైన శరీరానికి హాని కలిగించని దుస్తులు లభించలేదు. ఇది టెక్స్‌టైల్ డిజైనర్‌గా కార్పొరేటు సంస్థల్లో పని చేసిన అనుభవం ఉన్న నన్ను ఆలోచనలో పడేసింది. దీనికి పరిష్కారం ఏంటి? తీవ్రంగా పరిశోధించాను. ఎక్కడ వస్త్ర ప్రదర్శనలు జరిగితే అక్కడకు వెళ్లాను. ఎంతోమంది నేత కళాకారులతో మాట్లాడాను. వాళ్లు చెప్పింది విన్నాను. నా అభిప్రాయాలు, ఆలోచనలు వారితో పంచుకున్నాను. పదేళ్లు విస్తృతంగా అధ్యయనం చేశాక ఒక అభిప్రాయానికి వచ్చాను. అదేంటంటే... 'సేంద్రియ పద్ధతిలో పండిన పత్తి'. రసాయనాలు లేని పత్తితో, సహజసిద్ధమైన పద్ధతిలో తయారైన దుస్తులు చంటి పిల్లలకు చాలా సౌకర్యంగా ఉంటాయి. ఎన్నో ఎగ్జిబిషన్లను సందర్శించిన నాకు అలాంటి వస్త్రాలు ఎక్కడ కనిపించలేదు. దాంతో నేనే ఒక అడుగు ముందుకు వేశాను. మా సోదరి అంకిత సహ వ్యవస్థాపకురాలిగా 2017లో 'వైట్‌వాటర్ కిడ్స్' పేరుతో కంపెనీ నెలకొల్పాను.



దానికీ ఒక అర్థం ఉంది...

మా బ్రాండ్‌కు 'వైట్ వాటర్' అని పెట్టడానికి ఒక కారణం ఉంది. పేరు చూడగానే ఉత్పత్తుల ఉద్దేశం అర్థమవ్వాలనేది మా ఆలోచన. తెలుపు స్వచ్ఛతకు, నీరు పారదర్శకతకు, ప్రవాహానికీ ప్రతీకలు. అంకితకు కూడా డిజైనింగ్, స్టోరీ టెల్లింగ్‌లో అనుభవం ఉంది. తను 'లండన్ కాలేజీ ఆఫ్ కమ్యూనికేషన్' నుంచి డిగ్రీ పూర్తి చేసింది. డిజిటల్ మార్కెటింగ్‌కు తన నైపుణ్యం బాగా కలిసివచ్చింది. నేను కోరుకున్నది కేవలం డ్రెస్‌ల డిజైన్ మాత్రమే కాదు... అవి కమ్మని కథలు కూడా చెప్పేలా రూపొందించాలని. స్వతహాగా కవిత్వంపై నాకు ఆసక్తి. తీరిక దొరికినప్పుడల్లా ఏదోఒకటి రాస్తుంటాను. అలా కాగితం మీద పెట్టిన అక్షరాలను దుస్తులపైకి తెచ్చాను. మా చేనేత కళాకారులు నా కవితాత్మక పంక్తులకు చక్కని రూపం ఇస్తున్నారు. అవన్నీ చిన్నారుల్లో స్ఫూర్తి నింపేవిగానే ఉంటాయి.

కళాకారుల సంగమం...


మా బ్రాండ్ సంప్రదాయ వస్త్ర శ్రేణుల మేలి కలయిక. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు పేరుపొందిన చేనేత కళలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నాం. అందుకోసం సాధ్యమైనంతమంది స్థానిక కళాకారులను సంప్రతిస్తున్నాం. వారితో కలిసి పని చేస్తున్నాం. తద్వారా వారికీ ఒక ఆదాయ మార్గం లభిస్తోంది. ప్రధానంగా మహిళా కళాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వారికి ఇంటి దగ్గర నుంచే పని చేసే వెసులుబాటు కల్పిస్తున్నాం. ఏదిఏమైనా మా అంతిమ లక్ష్యం... చిన్నారులకు సౌకర్యవంతమైన వస్త్ర శ్రేణులను అందించడం. అందులో రాజీ లేదు. సేంద్రియ పత్తితో తయారైన వస్త్రం, సహజసిద్ధ రంగులు మాత్రమే ఉపయోగిస్తాం. కుర్తా సెట్ నుంచి దిండు గలీబు వరకు చిన్నారులకు సంబంధించిన అన్ని వస్త్ర శ్రేణులను తీసుకువచ్చాం. అదే సమయంలో ప్రయోగాత్మకంగా, వేటికవే భిన్నంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకొంటున్నాం.

వైకల్యాన్ని దాటి...

అంకితకు, నాకు... ఇద్దరికీ వైకల్యం. నా ఒంటి నిండా తెల్ల మచ్చలు. అంకితకు పోలియో. సరిగ్గా నడవలేదు. బాల్యంలోనే కాదు... కాలేజీకి వెళ్లే రోజుల్లోనూ మేం ఎన్నో అవహేళనలు, అవమానాలు ఎదుర్కొన్నాం. మాలోని లోపాలను చూసి కొందరు చులకనగా మాట్లాడేవారు. అవి మమ్మల్ని విపరీతంగా బాధించేవి. కానీ వాటివల్ల మా కెరీర్ దెబ్బతినకుండా చూసుకోవాలని ఇద్దరం అనుకున్నాం. కష్టపడి చదివాం. ఇవాళ నవ్విన నోళ్లే మమ్మల్ని పొగిడేలా... వింతగా చూసిన కళ్లే మెచ్చుకొనేలా... స్వశక్తితో ఎదిగి ఒక సంస్థకు అధిపతులం అయ్యాం. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నాం. 'ఇదీ మేం సాధించిన విజయం' అని గర్వంగా చెప్పుకోగలుగుతున్నాం."

> **దృక్పథం మారాలి...**
>
> మాలాంటి వారి పట్ల ఈ సమాజం దృక్పథం మారాలి. మేమూ ఈ సంఘంలో మనుషులమే. వైకల్యం ఉన్నంతమాత్రాన దూరం నెట్టడం, చులకన చేయడం దారుణం. ఎటు వెళుతున్నాం మనం? ప్రపంచం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంటే... మనిషిలోని ప్రతిభ, సామర్థ్యాలను వదిలేసి లోపాల గురించి మాట్లాడేవారు ఇంకా ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉంది. మా అబ్బాయిని తన స్నేహితుడు అడిగాడు... 'ఆంటీ ముఖానికి ఏమైంది' అని! అందుకు నేను కోపగించుకోకుండా... ఆ పిల్లాడిని కూర్చోబెట్టి, అర్థమయ్యేట్టు చెప్పాను. ఆ తరువాత ఎప్పుడూ తను ఆ ప్రస్తావన తేలేదు. నేను కోరేది ఏంటంటే... వైకల్యం ఉన్నవారిపై జాలి, దయ చూపక్కర్లేదు. ఆ చిన్నారిలా అర్థం చేసుకొని... ఒక మనిషిలా చూడండి చాలు.

మహాసంకల్పం



'మహాలక్ష్మి'... పద్దెనిమిది నెలల కాలం... రెండు వందల కోట్లమంది ప్రయాణం... మహిళల కోసం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు పథకం ఇది. ఈ ప్రతిష్ఠాత్మక పథకం మహిళలను సాధికారత వైపు నడిపించిందంటున్నారు టీజీఎస్ఆర్టీసీ ఆర్ఎంలు... **జె.శ్రీలత, ఎన్.సుచరిత.** దీనివల్ల ఆర్థిక స్థోమత లేనివారు సుదూర ప్రాంతాల్లో ఉన్న పెద్దాసుపత్రులకు కూడా వెళ్లి వైద్యం చేయించుకొనే అవకాశం లభించిందని... ఇది శుభపరిణామమని చెబుతున్న అధికారులను 'నవ్య' పలుకరించింది.

మన 'మహాలక్ష్మి' పెద్ద హిట్

ఆరోగ్య లక్ష్మి.. ఆనంద లక్ష్మి..

'మహాలక్ష్మి' పథకం అమల్లోకి వచ్చిన తర్వాత చికిత్సకోసం ఆస్పత్రులకు వెళ్తున్న మహిళల సంఖ్య పెరిగింది. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు ఉచిత బస్సు సౌకర్యంతో ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఆలయాలకు వెళ్లే వారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో మహాలక్ష్మి... ఆరోగ్య లక్ష్మి... ఆనంద లక్ష్మిగా మారింది. గతంలో బస్సు చార్జీలు భరించే స్థోమత లేకపోవడంతో జిల్లా కేంద్రాలు, పట్టణాలతోపాటు హైదరాబాద్‌లో ఉండే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకునేందుకు మహిళలు వెనకాడేవారు. కానీ ఇప్పుడు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో... ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా జిల్లా కేంద్రాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పెద్దాసుపత్రులకు వెళుతున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన సర్వేలో గతంతో పోలిస్తే ఈ ఏడాది, ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న మహిళా రోగుల సంఖ్య 31% పెరిగినట్లు తేలింది. దీనికి ప్రధాన కారణం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం. పెరిగిన మహిళా ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు బస్టాండ్లలో మరుగుదొడ్లు, తాగునీరు వసతి కల్పిస్తున్నాం. భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సీసీ కెమెరాల ఏర్పాటు చేశాం. మహిళా భద్రతా సిబ్బందిని నియమించాం.

అరవై శాతానికి...

గతంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గరిష్ఠంగా 35% వరకు ఉండేది. కానీ మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య 60 శాతానికి పెరిగింది. ప్రయాణికుల రద్దీని కంట్రోల్ చేసేందుకు రద్దీ ఉన్న మార్గాల్లో బస్సు సర్వీస్‌లను పెంచాం. ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో బస్టాండ్ బయట ఉండేవారిని బస్టాండ్లలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. పెద్ద పెద్ద బస్టాండ్లలో మహిళా భద్రతా సిబ్బందిని పెంచాం. ఇమ్లిబన్‌లో 140 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గతంలో సీసీ కెమెరాలు లేని పరిగి, వికారాబాద్ బస్టాండ్లలోనూ కొత్తగా సీసీ కెమెరాలు పెట్టాం. పండగలు, సెలవులు, రద్దీ సమయాల్లో జిల్లాల నుంచి బస్సులు సిటీలోకి రాకుండా వరంగల్, హన్మకొండ నుంచి వచ్చే బస్సుల్ని ఉప్పల్ నుంచి ఆపరేట్ చేస్తుంటాం. నల్లగొండ వాళ్లు ఎల్బీనగర్ నుంచి ఆపరేట్ చేస్తుంటారు. ఎల్బీనగర్, ఆరంఘర్ ప్రాంతాల్లో మహిళా ప్రయాణికులకు సరిపడా వాష్‌రూమ్స్ సదుపాయాలు లేవు. ఏర్పాటు కోసం సంబంధిత విభాగాల అధికారులకు లేఖలు రాయడం జరిగింది. బస్టాండ్లలో మహాలక్ష్మి టాయ్‌లెట్‌లను ఏర్పాటు చేశాం. ఆర్టీసీలో సివిల్ ఇంజనీరింగ్ బడ్జెట్‌ను పెంచడం జరిగింది. బడ్జెట్ పెంపుతో అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. దానికి అనుగుణంగా అన్ని బస్టాండ్లలో వసతులు మెరుగుపరుస్తాం.

మహిళా ప్రయాణికులు మార్గమధ్యంలో కాకుండా... సమీపంలోని బస్టాండ్ వరకు వచ్చి బస్సులు ఎక్కాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ విషయంలో జిల్లాల్లో ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. కొందరు ఊర్లో బస్టాండులో బస్సు ఎక్కి... ఊరి చివర పొలాల వరకు ప్రయాణిస్తున్న విషయాల పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అలాంటి వారికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం.

పోలీస్‌లతో సమన్వయం...

పండగలు, సెలవులు, ప్రత్యేక సందర్భాల్లో బస్టాండ్లల్లో రద్దీ మరీ ఎక్కుగా ఉంటోంది. ఇలాంటి సందర్భాల్లో ఆర్టీసీతో పాటు పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకుని పని చేస్తాం. ఫలితంగా బస్టాండ్లలో అనవసర ట్రాఫిక్ జామ్‌లతోపాటు ప్రయాణికుల భద్రతకు భరోసా ఉంటుంది. ఎక్కడెక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని పోలీస్‌లకు వివరించి అదనపు భద్రత కోరుతున్నాం. కో-ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై చర్చిస్తున్నాం. రద్దీ మార్గాల్లో బస్సుల సంఖ్యను పెంచి నడుపుతున్నాం. భవిష్యత్తులో డిమాండ్ మేరకు ఆయా మార్గాల్లో బస్సు సర్వీస్‌ల్ని మరింత పెంచుతాం. విద్యుత్ బస్సుల్ని ఎంపిక చేసిన మార్గాల్లో ఎక్కువగా తిప్పుతున్నాం.

- జె.శ్రీలత
రంగారెడ్డి జిల్లా రీజనల్ మేనేజర్ (ఆర్ఎం)

ఆర్థిక పురోగతి...

ఒకప్పుడు ప్రయాణికుల కోసం ఆర్టీసీ సిబ్బంది బస్టాండ్లలో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆర్టీసీ బస్సు కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లుగా కొత్త బస్సులు, రద్దీ మార్గాల్లో సర్వీస్‌లను పెంచడం జరిగింది. బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో గతంలో అత్యధికంగా 68% వరకు ఉండగా ప్రస్తుతం 105%కిపైగా పెరిగింది. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా సాధికారత పెరిగింది. మహిళా చిరుద్యోగులకు ఉచిత బస్సు సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉంది. మహిళా ప్రయాణికులతో మాట్లాడిన సమయంలో వారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ప్రయాణికులు లేకపోవడంతో ట్రిప్పులు రద్దు చేసేవాళ్లం. ఇప్పుడు అదనపు ట్రిప్పులు వేస్తున్నాం. షటిల్ బస్సుల నిర్వహణ, స్పేర్‌లో ఉన్న బస్సుల్ని నడుపుతున్నాం. మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో రద్దీ సమయాల్లో పురుష ప్రయాణికుల కోసం మెట్రోడీలక్స్ సర్వీస్‌ల్ని పెంచాం. ఈ సర్వీస్‌ల్లో మహిళలు సైతం ప్రయాణిస్తున్నారు.



రోజుకు 20 లక్షలు...

గతంతో పోలిస్తే ఇప్పుడు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో రోజుకు 20 లక్షల మంది ప్రయాణికులు పెరిగారు. గతంలో ఆటోలు, మెట్రోలు, ఇతర రవాణా మార్గాల్లో ప్రయాణించే వారు ఇప్పుడు ఆర్టీసీ ప్రయాణానికే ఆసక్తి చూపిస్తున్నారు. బస్సు ప్రయాణం సురక్షితం కావడంతో ఇటువైపు ప్రయాణికులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కేవలం అక్కడి వరకే పరిమితం చేసి చూడాల్సిన అంశం కాదు. దీనివల్ల ఆర్థిక పురోగతి ఏర్పడింది. మహిళలు ముఖ్యంగా గృహిణులు ఆలయాల సందర్శనకు వెళ్తున్నారు. దాంతో స్థానికంగా ఉండే చిరు వ్యాపారులకు ఆదాయం పెరిగింది. కొందరు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో కొత్తగా చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించారు. ఇలా అనేక రకాలుగా ఉచిత బస్సు ప్రయాణం నిరుపేద, పేద కుటుంబాలకు ఆర్థికంగా ఆసరాగా మారింది. సమాజాభివృద్ధిలో మహాలక్ష్మి పథకం ఎంతో కీలకంగా మారింది.

టాయ్‌లెట్ బ్లాక్స్...

ఏడాదిన్నర కాలంలో మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. దీంతో అప్పుడు మహిళా ప్రయాణికుల్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన టాయ్‌లెట్స్ ఇప్పుడు ఏ మాత్రం సరిపోని పరిస్థితి. దీంతో అన్ని బస్టాండ్లలో మహాలక్ష్మి టాయ్‌లెట్ బ్లాక్స్ ఏర్పాటు చేస్తున్నాం. పనులు ముగించుకుని ఇంటికి తిరిగివెళ్లే సమయాల్లో రాత్రివేళ బస్టాండ్లలో మహిళా ప్రయాణికుల కోసం... విద్యుత్ దీపాల సదుపాయం మెరుగుపర్చడంతో పాటు సీసీ కెమెరాల సంఖ్య పెంచాం.

- ఎన్.సుచరిత,
సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్

• యస్.సోమేశ్వర్

ప్రతి రోజూ పంచుకునే భోజన పద్ధతులు, దినచర్యలూ... ఆరోగ్యాన్నీ, శరీర బరువునూ ప్రభావితం చేస్తున్నట్టు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) తాజా అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలోనే ఊబకాయ పరిష్కార మార్గాలను కూడా ఐసీఎంఆర్ సూచించింది. ఆ వివరాలు తెలుసుకుందాం!



ఊబకాయానికి ఇది కూడా కారణమే!

సాధారణంగా మన ఇళ్లలో ఇంటి మొత్తానికీ కలిపి వంట చేస్తారు. కుటుంబసభ్యుల్లో ఎవరికి వారికంటూ ప్రత్యేకమైన వంట నియమాలేవీ ఉండవు. పోషకాల అవసరతల ఆధారంగా వంటలు వండే విధానాలు అంతకంటే ఉండవు. ప్రధానంగా అన్నం, నూనెలో వేయించిన వేపుళ్లు, కూరలు, తీపి పదార్థాలతోనే మన భోజనం పూర్తవుతూ ఉంటుంది. ఇలా అందరికీ ఒకే భోజనం అలవాటు వల్ల, కుటుంబసభ్యుల్లో ఎవరికి వారికి వాళ్ల వయసుకూ, శారీరక శ్రమలకూ అవసరమైన పోషకాలు అందకపోవచ్చు. ప్రత్యేకించి మహిళలు కుటుంబంలో ఎక్కువ పోషక లోపానికి లోనవుతూ ఉంటారు. కుటుంబం తిన్న తర్వాత భోంచేసే అలవాటుతో పోషకాల లోపానికి గురయ్యే ఇలాంటి మహిళలతో పాటు, దేన్నీ మిగల్చకూడదనే ఉద్దేశంతో మిగిలినవన్నీ తినేయడం వల్ల తేలికగా ఊబకాయం బారిన పడే మహిళలూ ఉంటారు.

వంటపని పంచుకుంటూ...

కలిసి పంచుకునే భోజన అలవాట్లతో, ఒబేసిటీ, హైపర్ టెన్షన్, టైప్2 మధుమేహం, గుండెజబ్బులతో పాటు పునరుత్పత్తి సమస్యలను కూడా కలిసి పంచుకునే ముప్పు పొంచి ఉంటుందంటున్నారు వైద్యులు. తెలియకుండానే పోషకలోపాలతో కూడిన అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లనూ, ఎక్కువ సమయాల పాటు కదలకుండా కూర్చునే సెడెంటరీ జీవనవిధానాన్నీ దంపతులు కలిసి పంచుకుంటూ ఉంటారు. దాంతో జీవనశైలి సంబంధిత రుగ్మతలు ఇద్దర్నీ ఏకకాలంలో వెంటాడుతూ ఉంటాయి. నిజానికి ఆరోగ్యకరమైన వంటకాలను వండుకోవడం శ్రమతో కూడుకున్న వ్యవహారం కానే కాదు. భార్యలు తామొక్కరే వంటగదిలో శ్రమపడుతున్నట్టు చెప్తూ ఉంటారే తప్ప, వంటపనిలో భర్త, పిల్లల సహాయాన్ని తీసుకోడానికి మాత్రం ముందుకు రారు. వంట తన సొత్తే అన్నట్టు, వంటగది తన సామ్రాజ్యం అన్నట్టు వ్యవహరించకుండా వంటపనిలో భర్త, పిల్లల సహాయం తీసుకోగలిగితే పని తేలికవడంతో పాటు, పోషక ప్రాధాన్యతలతో వంటలను వండుకునే వెసులుబాటు చిక్కుతుంది. అలాగే దంపతులిద్దరూ భోజనాలను వండుకుంటున్న విధానం మీద కూడా దృష్టి పెట్టాలి. తోచింది వండుకుని తినేయడం కాకుండా, అదనపు క్యాలరీలు దరి చేరకుండా తక్కువ నూనెతో, పోషకాలు నష్టపోకుండా వండుకునే విధానాలను నేర్చుకోవాలి. తక్కువ క్యాలరీలను అందించే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. అన్నం బదులు మిల్లెట్స్ తినడం, వేపుళ్లకు బదులు ఆవిరి మీద మగ్గించిన కూరగాయ ముక్కలు తినడం లాంటి అలవాట్లు అలవరుచుకోవాలి. అలాగే పప్పు, కూరగాయలను విడిగా ఉడికించుకుని ఎవరి అవసరతలకు తగ్గట్టుగా కారం, ఉప్పు, నూనెలను జోడించుకోవచ్చు.

నియమనిబద్ధతలతో...

సగం కంచం కూరగాయలతో, పావు కంచం పొట్టుతీయని ధాన్యాలు, మిగతా పావు కంచం ప్రొటీన్‌తో నింపుకోవడం మొదలుపెట్టాలి. ఆకుకూరలు, పులిసిన పదార్థాలు, స్థానిక ధాన్యాలతో కూడిన సంప్రదాయ వంటకాలకు పెద్ద పీట వేయగలిగితే దంపతులిద్దరితో పాటు వారి పిల్లల ఆరోగ్యం కూడా భేషుగ్గా ఉంటుంది. అలాగే కుటుంబమంతా కలిసి బయటి ఆహారానికి బదులుగా ఇంటి భోజనానికే కట్టుబడి ఉండాలనే నియమాలు కూడా ఆచరించాలి. రాత్రివేళ ఆలస్యంగా భోజనం చేయడం, టివి ముందు కూర్చుని చిరుతిళ్లు తినడం లాంటి అలవాట్లకు స్వస్తి చెప్పాలి. అలాగే దైనందిన జీవితంలో వ్యాయామానికి తప్పనిసరిగా చోటు కల్పించాలి.

• గోగుమళ్ల కవిత

> **కుటుంబ సమస్య**
>
> ముందు రెండు టైర్లూ ఒకే వైపు ప్రయాణిస్తేనే కారు క్షేమంగా గమ్యానికి చేరుకోగలుగుతుంది. ఒక టైరు ఒక దిక్కుకూ, మరో టైరు మరో దిక్కుకూ ప్రయాణిస్తే గమ్యం చేరుకోలేకపోగా, ప్రమాదానికి గురయ్యే అవకాశాలుంటాయి. ఇదే సూత్రం కుటుంబానికీ వర్తిస్తుంది. ఒబేసిటీ వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. ఇది కుటుంబ సమస్య. కుటుంబంలో ఒకరు ఒబేసిటీతో బాధపడుతున్నారంటే ఆ కుటుంబమంతా ఆ సమస్య ప్రభావానికి లోనవుతుందని అర్థం. మునుపు దంపతుల్లో ఒకరు ఒబేసిటీతో ఆస్పత్రులకు వస్తూ ఉండేవారు. కానీ ఇప్పుడు అదే సమస్యతో దంపతులిద్దరూ ఆస్పత్రులకు వస్తున్న సందర్భాలు పెరిగిపోయాయి. అందరూ ఒకే రకమైన అనారోగ్యకరమైన ఆహారశైలిని అనుసరించడమే ఇందుకు కారణం. ఇంటి భోజనంలో నూనెల వాడకం పెరగడంతో పాటు, ప్రతి ఇంట్లో అస్తవ్యస్థ ఆహారపుటలవాట్లు పెరిగిపోయాయి. స్విగ్గీలు, జొమాటోలతో కోరుకున్న ఆహారం ఇంటికే చేరుతోంది. దీనికి తోడు వ్యాయామ లోపం. వెరసి ప్రతి ఇంట్లో స్థూలకాయం కనిపిస్తోంది. దంపతులే కాదు పిల్లలు కూడా స్థూలకాయులవుతున్నారు. ఆహార నియమాలు, వ్యాయామాలతో ఈ సమస్యను చాలావరకూ అదుపులోకి తెచ్చుకోవచ్చు. పోషక లక్ష్యాలకు తగ్గట్టుగా ఇంటి భోజనంలో మార్పులు చేసుకోవడం, దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పించడం ద్వారా ఊబకాయాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. అయినప్పటికీ స్థూలకాయాన్ని తగ్గించుకోలేని వారు మాత్రమే అంతిమంగా బేరియాట్రిక్ సర్జరీని ఆశ్రయించాల్సి ఉంటుంది. ఊబకాయంతో పాటు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సంబంధిత రుగ్మతలన్నీ అదుపులోకి తీసుకురావడమే తాజా బేరియాట్రిక్ అండ్ మెటబాలిక్ సర్జరీ లక్ష్యం. సర్జరీ తదనంతర ఫలితాలు మరింత మెరుగ్గా ఉండడం కోసం, ఆహార, వ్యాయామ నియమాలూ తప్పక అనుసరించాల్సి ఉంటుంది.
>
> 
>
> **డాక్టర్ ఎన్. సుబ్రహ్మణ్యేశ్వర బాబు,**
> సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, అపోలో హాస్పిటల్స్, సికింద్రాబాద్.

బిజినెస్

గుంటూరు ● గురువారం 24 జూలై 2025

మింత్రాపై ఫెమా కేసు నమోదు చేసిన ఈడీ

న్యూఢిల్లీ: ఫ్లిప్‌కార్ట్ అనుబంధ సంస్థ మింత్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. ఈ సంస్థ విదేశీమారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనలకు విరుద్ధంగా విదేశాల నుంచి రూ.1,654 కోట్లకు పైగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సమీకరించిందని అభియోగం మోపింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా మింత్రాపై ఈ కేసు నమోదు చేసినట్టు ఈడీ తెలిపింది. హోల్‌సేల్ కాష్ అండ్ కారీ' ముసుగులో మింత్రా, దాని అనుబంధ సంస్థలు మల్టీ బ్రాండ్ రిటైల్ వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించింది. ఇలా చేయడం ఎఫ్‌డీఐ నిబంధనలతో పాటు,ఫెమా నిబంధనలకూ వ్యతిరేకమని తెలిపింది. ఎఫ్‌డీఐ, ఫెమా నిబంధనలను తుంగలో తొక్కేందుకు మింత్రా తన వస్తువుల్లో ఎక్కువ భాగాన్ని, తనకే చెందిన విక్టర్ ఇ-కామర్స్ అనే కంపెనీకి విక్రయించి, దాని ద్వారా రిటైల్ అమ్మకాలు జరుపుతోందని అభియోగ పత్రంలో ఈడీ పేర్కొంది. ఈ కేసు దర్యాప్తులో ఈడీకి పూర్తిగా సహకరిస్తామని మింత్రా ఒక ప్రకటనలో తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	475
వరంగల్	452	గోదావరి	475
చిత్తూరు	523	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	109
కర్నూలు	115	నెల్లూరు	114
విశాఖపట్నం	97	అనంతపురం	114
గోదావరి	114		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,330 ▲	93,800 ▲	1,29,000 ▲
విజయవాడ	1,03,750 ▲	97,000 ▲	1,19,400 ▲
విశాఖపట్నం	1,02,650 ▼	93,800 ▲	1,29,000 ▲
రాజమండ్రి	1,02,330 ▲	93,800 ▲	1,19,000 ▲
ప్రొద్దుటూరు	99,750 ▲	91,770 ▲	1,11,780 ▲
ముంబై	1,00,530 ▲	92,090 ▲	1,15,850 ▲

డాక్టర్ రెడ్డీస్ లాభం
రూ.1,410 కోట్లు

11% వృద్ధితో రూ.8,545 కోట్లకు ఆదాయం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ త్రైమాసికానికి హైదరాబాద్‌కు చెందిన ఔషధాల తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ రూ.1,410 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.1,392 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం 1.4 శాతం వృద్ధిని కనబరిచింది. ఐరోపా, భారత మార్కెట్లలో మెరుగైన వ్యాపార వృద్ధి ఇందుకు దోహదపడింది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఏకీకృత ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11.3 శాతం పెరిగి రూ.8,545 కోట్లకు చేరింది. 2024-25లో ఇదే త్రైమాసికానికి ఆదాయం రూ.7,673 కోట్లుగా నమోదైంది.

"జూన్ త్రైమాసికంలో కంపెనీ రెండంకెల వృద్ధిని కనబరిచింది. బ్రాండెడ్ మార్కెట్లో మా బలాన్ని, నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ పోర్ట్‌ఫోలియో సానుకూల వృద్ధిని ఇది ప్రతిబింబిస్తోంది" అని డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. అయితే, అమెరికా జనరిక్ మార్కెట్లో మల్టిపుల్ మైలోమా చికిత్స కోసం ఉపయోగించే లెనాలిడోమైడ్ ఔషధ ధరలపై ఒత్తిడి తీవ్రతరం కానుందన్నారు. ప్రస్తుతం పైప్‌లైన్‌లో ఉన్న ఉత్పత్తులను అందించడం, ఉత్పాదకత పెంపు, వ్యాపారాభివృద్ధి ద్వారా కంపెనీకి మూలాధారమైన వ్యాపారాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించామని ప్రసాద్ పేర్కొన్నారు. మరిన్ని విషయాలు..

- క్యూ1లో కంపెనీ గ్లోబల్ జనరిక్స్ వ్యాపారం వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.7,560 కోట్లుగా నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ అమెరికా మార్కెట్లో 5 కొత్త ఔషధాలను విడుదల చేసింది. అలాగే, మరో కొత్త ఔషధం విడుదల కోసం యూఎస్ఎఫ్‌డీఏకు దరఖాస్తు చేసుకుంది.
- బీఎస్ఈలో బుధవారం ట్రేడింగ్ ముగిసేసరికి డాక్టర్ రెడ్డీస్ షేరు 0.58 శాతం పెరిగి రూ.1,247.55 వద్ద స్థిరపడింది.

హెరిటేజ్ ఫుడ్స్ నుంచి లివో యోగర్ట్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డెయిరీ దిగ్గజం హెరిటేజ్ ఫుడ్స్ ఆరోగ్య చైతన్యం అధికంగా గల యువతనుద్దేశించి లివో యోగర్ట్‌ను మార్కెట్లోకి తెచ్చింది. నిరంతరం ఎక్కడో అక్కడికి తిరుగుతూ మెరుగైన స్నాకింగ్ ప్రత్యామ్నాయం కావాలనుకునే యువతకు ఇది చక్కని, రుచికరమైన ఆహారమని కంపెనీ తెలిపింది. మంచి ఫ్లేవర్, పోషకాహార విలువలు, సౌకర్యవంతం అయిన ఈ యోగర్ట్ రిటైలింగ్ దిగ్గజాలైన విజేత, రత్నదీప్‌లలో అందుబాటులో ఉంటుంది. 90 గ్రాముల కప్పు విలువ రూ.30గా నిర్ణయించారు. క్లాసిక్ వేరియెంట్ ధర రూ.40. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, మామిడి ఫ్లేవర్లలో ఇది లభిస్తుంది.

అపోలో హాస్పిటల్స్‌తో సీమెన్స్ జట్టు

న్యూఢిల్లీ: కాలేయ సంరక్షణలో ఆధునిక ఆవిష్కరణల కోసం అపోలో హాస్పిటల్స్‌తో సీమెన్స్ హెల్తినీర్స్ జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా క్వాంటిటేటివ్ అల్ట్రాసౌండ్ ఇమేజింగ్ నుంచి ఏఐ ఆధారిత క్లినికల్ సొల్యూషన్స్ వరకు పలు అంశాల్లో పరిశోధనలు చేపట్టనున్నట్లు ఇరు కంపెనీలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

దక్షిణాఫ్రికా కంపెనీపై
నాట్కో ఆసక్తి

36 శాతం వాటా కొనుగోలుకు ఆఫర్

రూ.2,100 కోట్లు చెల్లించేందుకు రెడీ

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నాట్కో ఫార్మా వ్యాపార విస్తరణ చేపట్టింది. ఇందులో భాగంగా దక్షిణాఫ్రికాకు చెందిన ఫార్మా కంపెనీ యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ హోల్డింగ్స్ ఈక్విటీలో 36 శాతం మైనారిటీ వాటా కొనుగోలు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకోసం యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ వాటాదారులకు ఒక్కో షేరుకు 4.27 డాలర్ల చొప్పున 22.6 కోట్ల డాలర్లు (సుమారు రూ.2,100 కోట్లు) చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. వాటాదారులు ఇందుకు అంగీకరిస్తే యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ ఈక్విటీలో నాట్కో ఫార్మాకు 35.75 వాటా లభిస్తుంది. నాట్కో ఫార్మాకు ఇప్పటికే ఈ కంపెనీ ఈక్విటీలో 0.8 శాతం వాటా ఉంది. అన్ని అనుమతులు లభిస్తే నాలుగు నెలల్లో ఈ లావాదేవీ పూర్తవుతుందని భావిస్తున్నారు.

దక్షిణాఫ్రికా మార్కెట్‌లోకి ఎంట్రీ: ఫార్మా మార్కెట్ పరంగా చూస్తే ఆఫ్రికా ఖండంలో దక్షిణాఫ్రికా అతి పెద్ద మార్కెట్. ఈ మార్కెట్‌లో యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ కంపెనీకి మంచి పట్టుంది. యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ ఈక్విటీలో 36 శాతం కొనుగోలు చేయడం ద్వారా దక్షిణాఫ్రికాతో పాటు మిగతా ఆఫ్రికా దేశాల్లోనూ పట్టు పెంచుకునే అవకాశం ఉంటుందని నాట్కో ఫార్మా సీఈఓ, వైస్ చైర్మన్ రాజీవ్ నన్నపనేని చెప్పారు. నాట్కో ఫార్మా వంటి దిగ్గజంతో జట్టు కట్టడం తమకూ మేలు చేస్తుందని భావిస్తున్నట్టు యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ సీఈఓ ఆండ్రూ హాల్ తెలిపారు. దీని వల్ల మరింత చౌకగా తమ ఔషధాలు అందించగలుగుతామన్నారు. పైగా నాట్కో కంపెనీ 36 శాతం వాటా కోసం ఆఫర్ చేస్తున్న ధర, మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఉన్నందున మైనారిటీ వాటాదారులకూ మేలు జరుగుతుందన్నారు.

బీమా సంస్థలకు అంతర్గత అంబుడ్స్‌మన్

ఐఆర్‌డీఏఐ ప్రతిపాదన

న్యూఢిల్లీ: రూ.50 లక్షల వరకు క్లెయిమ్‌లకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు బీమా సంస్థలకు అంతర్గత అంబుడ్స్‌మన్‌ను నియమించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ప్రతిపాదించింది. రీఇన్సూరెన్స్ సంస్థలు మినహాయించి, మూడేళ్లకు పైగా కార్యకలాపాలు సాగిస్తున్న అన్ని బీమా కంపెనీలకు ఇది వర్తిస్తుందని ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది. బీమా సంస్థలు ఒకరికి పైగా అంతర్గత అంబుడ్స్‌మన్‌లను నియమించుకోవచ్చని కూడా తెలిపింది. తాజా ప్రతిపాదనలపై ఆగస్టు 17లోగా ప్రజాభిప్రాయాలను కోరింది.

సానుకూల సంకేతాలతో
మార్కెట్ దూకుడు

540 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: అమెరికా, జపాన్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం వార్తలతో ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల నడుమ బుధవారం మన ఈక్విటీ మార్కెట్ దూకుడు ప్రదర్శించింది. బ్యాంకింగ్, ఆయిల్ రంగాల షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 539.83 పాయింట్లు లాభపడి 82,726.64 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 599.62 పాయింట్ల లాభంతో 82,786.43ని తాకింది. నిఫ్టీ 159 పాయింట్ల లాభంతో 25,219.90 వద్ద క్లోజయింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ఒక దశలో 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకినా చివరికి 1 శాతం లాభంతో ముగిశాయి.

- లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 29న ప్రారంభమై 31న ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని రూ.150-158గా కంపెనీ ప్రకటించింది.

ఎస్‌బీఐ క్యూఐపీ సూపర్ హిట్

ముంబై: ఎస్‌బీఐ జారీ చేసిన క్యూఐపీ సూపర్ డూపర్ హిట్టయింది. ఇష్యూ ప్రారంభమైన తొలి రోజే నాలుగింతలకుపైగా సబ్‌స్క్రైబ్ అయింది. ఈ క్యూఐపీ ద్వారా రూ.25,000 కోట్లు సమీకరించాలని ఎస్‌బీఐ భావించగా, ఇష్యూ ప్రారంభమైన కొద్ది సేపటికే రూ.1.12 లక్షల కోట్లకు బిడ్స్ అందాయి. ఇందులో మూడింట రెండు వంతుల బిడ్స్ విదేశాల నుంచి వచ్చినట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఎస్‌బీఐ ఆర్థిక పునాదులపై మదుపరులకు ఉన్న నమ్మకానికి ఈ క్యూఐపీ సబ్‌స్క్రిప్షన్ ఒక ఉదాహరణ అన్నారు. ఎల్ఐసీతో సహా అనేక సంస్థలు ఈ ఇష్యూ కోసం బారులు తీరాయి.

ఇన్ఫీ భళా

- అంచనాలను మించిన త్రైమాసిక ఫలితాలు
- క్యూ1 లాభం రూ.6,921 కోట్లు
- రెవెన్యూ వృద్ధి అంచనా 1-3 శాతానికి పెంపు



బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ ఇన్ఫోసిస్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం రూ.6,921 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.6,368 కోట్ల లాభంతో పోలిస్తే 8.7 శాతం వృద్ధి కనబరిచింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.53% పెరిగి రూ.42,279 కోట్లుగా నమోదైంది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సేవల్లో బలమైన పనితీరుతో పాటు కొత్త డీల్స్ ఇందుకు దోహదపడ్డాయని కంపెనీ పేర్కొంది. కాగా, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే నికర లాభం 1.5% తగ్గగా.. ఆదాయం మాత్రం 3.3% పెరిగింది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 0-3 శాతం నుంచి 1-3 శాతానికి మెరుగుపరిచింది. మార్జిన్ అంచనాను మాత్రం 20-22 శాతంగా కొనసాగించింది.
- గత త్రైమాసికంలో 380 కోట్ల డాలర్ల విలువైన బడా డీల్స్‌ను దక్కించుకున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ జూన్ చివరి నాటికి మొత్తం యాక్టివ్ క్లయింట్ల సంఖ్య మాత్రం 1,861కు తగ్గింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ సంఖ్య 1,869గా ఉంది.
- క్యూ1లో కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య కేవలం 210 పెరుగుదలతో 3,23,788కి చేరింది. ఉద్యోగుల వలసల రేటు 14.4 శాతానికి పెరిగింది.
- ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 20,000 మందిని ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.
- విభాగాలవారీగా చూస్తే, ఈ క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయంలో 27.9 శాతం ఆర్థిక సేవల రంగం నుంచి సమకూరింది. తయారీ రంగం వాటా 16.1 శాతం, రిటైల్ రంగం వాటా 13.4 శాతంగా ఉంది.
- మార్కెట్ల వారీగా, మొత్తం ఆదాయంలో ఉత్తర అమెరికా వాటా 56.5 శాతానికి తగ్గింది. అయినప్పటికీ, కంపెనీకి అత్యధిక ఆదాయం ఈ మార్కెట్ నుంచే సమకూరుతోంది. యూరప్ మార్కెట్ వాటా 31.5 శాతానికి పెరిగింది. గడిచిన కొన్ని త్రైమాసికాలుగా కంపెనీ యూరప్ మార్కెట్లో బలమైన పనితీరు కనబరుస్తూ వస్తోందని ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా అన్నారు. ఇది కొన్నేళ్లక్రితం యూరప్‌లో కంపెనీ పెట్టిన పెట్టుబడుల ప్రతిఫలమని ఆయన పేర్కొన్నారు.
- బీఎస్ఈలో బుధవారం ట్రేడింగ్ ముగిసేసరికి, ఇన్ఫోసిస్ షేరు ధర 0.27 శాతం పెరిగి రూ.1,574.40 వద్ద స్థిరపడింది.

తొలిరోజు మనదే

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్

- సుదర్శన్, జైస్వాల్ అర్ధ శతకాలు
- టీమిండియా 264/4



సాయి సుదర్శన్ (61)

పంత్‌కు గాయం

68వ ఓవర్‌లో వోక్స్ యార్కర్‌ను రివర్స్‌స్వీప్ ఆడే క్రమంలో పంత్ కుడికాలికి బంతి బలంగా తగిలింది. దీంతో నొప్పితో అతడు విలవిల్లాడాడు. కాలు వాయడంతో పాటు రక్తం రావడంతో పంత్ రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు.

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్ తొలిరోజును భారత్ మెరుగ్గా ముగించింది. బుధవారం మొదలైన ఈ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 264/4 స్కోరు చేసింది. జట్టులో తనకు తిరిగి లభించిన అవకాశాన్ని సాయి సుదర్శన్ (61) తొలి అర్ధ శతకంతో సద్వినియోగం చేసుకోగా.. యశస్వి జైస్వాల్ (58) రాణించాడు. జడేజా (19), శార్దూల్ ఠాకూర్ (19) క్రీజులో ఉన్నారు. రాహుల్ (46) శుభారంభాన్ని చేజార్చుకోగా.. రిషభ్ పంత్ (37 రిటైర్డ్ హర్ట్) గాయం జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. స్టోక్స్ 2 వికెట్లు తీశాడు. టీమిండియా తరపున పేసర్ అన్షుల్ కాంబోజ్ అరంగేట్రం చేయగా.. కరుణ్ నాయర్, నితీశ్ స్థానాల్లో సుదర్శన్, శార్దూల్ జట్టులోకొచ్చారు.

జైస్వాల్, రాహుల్ ఓర్పుగా..: ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో టాస్ గెలిచి ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించిన జట్టు ఇంతవరకు మ్యాచ్ గెలిచింది లేదు. కానీ, ఆకాశం మేఘావృతమై ఉండడంతో.. ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకొన్నాడు. అయితే, ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ ఓర్పుగా ఆడుతూ.. భారత్‌కు చక్కని ఆరంభాన్ని అందించారు. ముఖ్యంగా జైస్వాల్ ఎంతో క్రమశిక్షణతో బ్యాటింగ్ చేశాడు. మరో ఎండ్‌లో మాత్రం రాహుల్ తన దైన శైలిలో ఆడుతూ స్కోరు బోర్డును నడిపించడంతో.. భారత్ 78/0తో లంచ్‌కు వెళ్లింది.

1 గత 35 ఏళ్లలో ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో అరంగేట్రం చేసిన తొలి భారత క్రికెటర్‌గా అన్షుల్ కాంబోజ్. 1990లో అనిల్ కుంబ్లే తన తొలి టెస్ట్ ఇక్కడే ఆడాడు.

14 అన్ని ఫార్మాట్లలో కలిపి టీమిండియా టాస్ ఓడడం ఇది 14వసారి.

దెబ్బకొట్టిన ఇంగ్లండ్: రెండో సెషన్‌లో భారత్ 71 రన్స్ చేసినా 3 కీలక వికెట్లు చేజార్చుకొంది. నిలకడగా ఆడుతున్న రాహుల్, జైస్వాల్‌తోపాటు గిల్‌ను అవుట్ చేసి ఇంగ్లండ్ పైచేయి సాధించింది. ఫిఫ్టీకి చేరువవుతున్న రాహుల్‌ను వోక్స్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బౌండ్రీలతో వేగంగా ఆడే ప్రయత్నం చేస్తున్న జైస్వాల్.. సింగిల్‌తో ఫిఫ్టీ మార్క్‌ను అందుకొన్నాడు. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చిన స్పిన్నర్ డాసన్ బౌలింగ్‌లో డిఫెన్స్ ఆడే క్రమంలో ఫస్ట్ స్లిప్‌లో ఉన్న బ్రూక్‌కు జైస్వాల్ క్యాచిచ్చాడు. కెప్టెన్ గిల్ (12)ను స్టోక్స్ ఎల్బీ చేశాడు. కానీ, వన్‌డౌన్ బ్యాటర్ సుదర్శన్, పంత్ రక్షణాత్మకంగా ఆడడంతో భారత్ 149/3తో టీ బ్రేక్‌కు వెళ్లింది.

ఆఖరి సెషన్‌లో 115/1: సుదర్శన్, పంత్ ఎదురుదాడితో.. మూడో సెషన్‌లో భారత్ 115 పరుగులు రాబట్టింది. క్రీజులో కుదురుకున్నాక సాయి సుదర్శన్ వీలుచిక్కినప్పుడల్లా బౌండ్రీలు బాదాడు. క్రమంగా పంత్ తన సహజశైలిలో షాట్లు ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేశాడు. 61వ ఓవర్‌లో కార్స్ బౌలింగ్‌లో ఫ్రంట్ ఫుట్‌పై సిక్స్‌తో వావ్ అనిపించాడు. ఈ క్రమంలో జట్టు స్కోరు కూడా డబుల్ సెంచరీ మార్క్ దాటింది. అయితే, 72 పరుగుల భాగస్వామ్యంతో వీరిద్దరు జట్టును బలమైన స్థితికి చేర్చేలా కనిపించారు. కానీ, పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. జడేజా క్రీజులోకి వచ్చాడు. మరో వైపు ఫోర్‌తో కెరీర్‌లో తొలి అర్ధ శతకం నమోదు చేసిన సాయిని స్టోక్స్ వెనక్కి పంపాడు. జడేజా, శార్దూల్ మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగించారు.

ఇంజనీర్, లాయిడ్ పేరిట స్టాండ్

భారత మాజీ ఆటగాడు ఫరూక్ ఇంజనీర్ (87), వెస్టిండీస్ లెజెండ్ క్లైవ్ లాయిడ్ (80) అరుదైన గౌరవం దక్కింది. ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలోని ఓ స్టాండ్‌కు వీరిద్దరి పేర్లు పెట్టారు. బి-స్టాండ్‌కు సర్ క్లైవ్ లాయిడ్ అండ్ ఫరూక్ ఇంజనీర్ స్టాండ్‌గా నామకరణం చేశారు. టాస్‌కు ముందు స్టాండ్ ఆవిష్కరణ కార్యక్రమం జరగ్గా.. ఇంజనీర్, లాయిడ్ హాజరయ్యారు. ఇంగ్లండ్‌లో స్టాండ్‌కు ఓ భారత ఆటగాడి పేరు పెట్టడం ఇదే తొలిసారి.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58, రాహుల్ (సి) క్రాలే (బి) వోక్స్ 46, సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61, గిల్ (ఎల్బీ) స్టోక్స్ 12, పంత్ (రిటైర్డ్ హర్ట్) 37, జడేజా (బ్యాటింగ్) 19, శార్దూల్ (బ్యాటింగ్) 19; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 83 ఓవర్లలో 264/4; వికెట్ల పతనం:** 1-94, 2-120, 3-140, 3-212 (పంత్ రిటైర్డ్ హర్ట్), 4-235; **బౌలింగ్:** వోక్స్ 17-4-43-1, ఆర్చర్ 16-2-44-0, కార్స్ 16-1-60-0, స్టోక్స్ 14-2-47-2, డాసన్ 15-1-45-1, రూట్ 5-0-19-0.

భళా..దివ్య

- చెస్ ప్రపంచ కప్‌లో ఫైనల్‌కు
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా రికార్డు
- క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత
- హంపి సెమీస్ ఫలితం టైబ్రేకర్‌కు



బటూమి (జార్జియా): భారత చిచ్చర పిడుగు దివ్యా దేశ్‌ముఖ్ చరిత్ర సృష్టించింది. మహిళల చెస్ వరల్డ్ కప్‌లో 19 ఏళ్ల దివ్య ఫైనల్లో అడుగుపెట్టింది. తద్వారా ఈ మెగా టోర్నమెంట్ టైటిల్ ఫైట్‌కు చేరిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. చైనా జీఎం, ప్రపంచ మాజీ చాంపియన్ టాన్ జోంగ్‌యితో బుధవారం జరిగిన సెమీఫైనల్ రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడిన దివ్య విజయం సాధించింది. దాంతో 1.5-0.5 పాయింట్ల తేడాతో ఆమె టైటిల్ ఫైట్‌లో ప్రవేశించింది. సెమీస్ తొలి గేమ్‌ను దివ్య డ్రా చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ కప్ ఫైనల్ ప్రవేశం దరిమిలా..2026లో జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి దివ్య క్వాలిఫై అయ్యింది. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ ఝు జినెర్‌తో తలపడే చాలెంజర్‌ను క్యాండిడేట్స్ టోర్నమెంట్ ద్వారా నిర్ధారిస్తారు. అంతేకాదు..సెమీఫైనల్ గెలుపుతో దివ్య తొలి గ్రాండ్‌మాస్టర్ (జీఎం) నార్మ్‌నూ సొంతం చేసుకుంది. మరో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సెమీఫైనల్ ఫలితం టైబ్రేకర్‌లో తేలనుంది. చైనా గ్రాండ్ మాస్టర్ లి టింగ్జీతో సెమీఫైనల్ రెండో గేమ్‌ను హంపి డ్రా చేసుకుంది. హంపి-టింగ్జీ మొదటి గేమ్‌లో కూడా ఫలితం తేలని విషయం తెలిసిందే. ఫలితంగా రెండు క్లాసికల్ గేమ్‌ల అనంతరం హంపి, టింగ్జీ చెరో పాయింట్‌తో సమంగా నిలిచారు. దాంతో గురువారం జరిగే టైబ్రేకర్‌లో హంపి-లి టింగ్జీ అమీతుమీ తేల్చుకోనున్నారు.

స్పోర్ట్స్

సింధు ముందంజ

- సాత్విక్ జోడీ బోణీ
- చైనా ఓపెన్

చాంగ్జౌ: భారత షట్లర్లు పీవీ సింధు, ఉన్నతి హుడా, డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి చైనా ఓపెన్‌లో శుభారంభం చేశారు. సింగిల్స్ మొదటి రౌండ్లో సింధు 21-15, 8-21, 21-17తో మియాజకి (జపాన్)పై, ఉన్నతి 21-11, 21-16తో గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలిచారు. రెండో రౌండ్లో సింధుతో ఉన్నతి అమీతుమీ తేల్చుకోనుంది. సాత్విక్/చిరాగ్ ద్వయం 21-13, 21-9తో జపాన్ జోడీ మిత్సుహషి/ఒకమురను అర గంటలోనే ఇంటిబాట పట్టించింది.

జాతీయ క్రీడా పాలన బిల్లు..
క్రీడా రంగంలో మేలి మలుపు



- విస్తృత అధికారాలతో ఎన్ఎస్‌బీ
- వివాదాల పరిష్కారానికి జాతీయ స్పోర్ట్స్ ట్రైబ్యునల్
- లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశ క్రీడా రంగాన్ని సమూలంగా మార్చే దిశగా కీలక ముందడుగు పడింది. 'జాతీయ క్రీడా పాలన బిల్లు'ను కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు దేశ క్రీడా రంగంలో మరింత జవాబుదారీతనం ఉండేలా నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్ఎస్‌బీ) ఏర్పాటు కానుంది. జాతీయ క్రీడా పాలన బిల్లు చట్టంగా మారాక.. అన్ని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లు ఎన్ఎస్‌బీ నుంచి గుర్తింపు పొందాల్సి ఉంటుంది.

నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్..

నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్ (ఎన్ఎస్‌టీ) ఏర్పాటుకు కూడా ప్రతిపాదన చేశారు. ఈ ట్రైబ్యునల్‌కు సివిల్ కోర్టు అధికారాలుంటాయి. సమాఖ్యల ఎన్నికలు, అథ్లెట్ల ఎంపికల్లో వివాదాలను ఈ బోర్డు పరిష్కరిస్తుంది. ట్రైబ్యునల్ నిర్ణయాలను సుప్రీంకోర్టులోనే సవాలు చేయాల్సి ఉంటుంది.

70 ఏళ్లు దాటినా కొనసాగొచ్చు..

క్రీడా సమాఖ్యల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వయస్సు పరిమితిలో సడలింపులకు కొత్త బిల్లు వీలు కల్పించింది. ఎన్నికల్లో పోటీ చేసే సమయానికి వయసు 70 దాటకూడదు. అయితే, ఆయా సమాఖ్యల అంతర్జాతీయ కమిటీల నిబంధనలు అనుమతిస్తే 70 నుంచి 75 సంవత్సరాలు కలిగిన వ్యక్తులు పదవిలో కొనసాగొచ్చు.

ఆర్టీఐ పరిధిలోకి బీసీసీఐ..

భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) తోపాటు గుర్తింపు పొందిన అన్ని క్రీడా సమాఖ్యలు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పరిధిలోకి రానున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకోనందున తమకు ఆర్టీఐ వర్తించదని బీసీసీఐ ఎంతో కాలంగా వాదిస్తూ వస్తోంది. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఒలింపిక్ ఉద్యమంలోకి బీసీసీఐ వచ్చినట్టేనని, అందువల్ల కొత్త బిల్లు నిబంధనలను పాటించాల్సిందేనని క్రీడా శాఖ స్పష్టంజేసింది. నేషనల్ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానెల్ ఏర్పాటుకూ బిల్లులో ప్రతిపాదించారు. జాతీయ లేదా రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాజీ సభ్యులు, లేదా రాష్ట్రాల మాజీ చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, మాజీ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లను ప్యానెల్‌లో నియమిస్తారు.

ఎన్నికలల్లేకుంటే గుర్తింపు రద్దే..

ఎన్నికలు నిర్వహించని క్రీడా సమాఖ్యల గుర్తింపును రద్దు చేసే అధికారం ఎన్ఎస్‌బీ కలిగి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగినా గుర్తింపును రద్దు చేస్తారు. వార్షిక లెక్కలు సమర్పించకపోయినా, నిధుల దుర్వినియోగం చేసినా ఎన్ఎస్‌బీ చర్యలు తీసుకుంటుంది.

ఏర్పాటు ఇలా..

చైర్మన్ ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్ఎస్‌బీ)ను ఏర్పాటు చేయనున్నారు. చైర్మన్‌తోపాటు, సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమించనుంది. ప్రజా పాలన, క్రీడా పాలన, క్రీడా చట్టాలలో పరిజ్ఞానం కలిగిన వారు, ఈ మూడు రంగాలలో ఆచరణాత్మక అనుభవం ఉన్న వారిని ఎన్ఎస్‌బీలో నియమిస్తారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి లేదా క్రీడా కార్యదర్శి ఎంపిక కమిటీ చైర్మన్‌గా ఉంటారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) డైరెక్టర్ జనరల్, ఏదైనా జాతీయ క్రీడా సమాఖ్యలో అధ్యక్షుడు లేదా సెక్రెటరీ జనరల్ లేదా కోశాధికారిగా పని చేసిన ఇద్దరు, ద్రోణాచార్య లేదా ఖేల్‌రత్న లేదా అర్జున అవార్డీలలో ఒకరితో కలిపి మొత్తం నలుగురు సభ్యులతో ఎంపిక కమిటీని ఏర్పాటు చేస్తారు.

నాడా చట్టానికి సవరణ..

జాతీయ డోపింగ్ నిరోధక (నాడా) చట్టం సవరణ బిల్లును కూడా ప్రవేశపెట్టారు. అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ సూచనల మేరకు నాడా చట్టానికి సవరణలు చేశారు.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
గుంటూరు ● గురువారం 24 జూలై 2025

మూడో షెడ్యూల్ ముగించారు




చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రం ('మెగా 157' వర్కింగ్ టైటిల్) షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ సినిమా షూట్ గురించి అప్‌డేట్ ఇచ్చారు అనిల్ రావిపూడి. 'మన శంకరవరప్రసాద్ గారు' కేరళ షెడ్యూల్‌ను పూర్తి చేశారు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అలాగే, విమానాశ్రయంలో చిరంజీవితో కలసి తీసుకున్న వీడియోను షేర్ చేశారు. చిరంజీవి సినిమాల్లోకి రాకముందు ఉన్న ఈ పేరును అనిల్ రావిపూడి వాడడంతో సినిమా టైటిల్ ఇదే అయ్యుండొచ్చని అంతా అనుకుంటున్నారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతారపై డ్యూయెట్‌తో పాటు కొంత టాకీపార్ట్ చిత్రీకరించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి 'మెగా 157' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

మాస్ లుక్‌తో మెప్పించేందుకు



వాణిజ్య హంగులతో పాటు తనలోని నటనా కౌశలాన్ని వెలికితెచ్చే పాత్రలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు హీరో సూర్య. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'కరుప్పు'. ఆర్జే బాలాజీ దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. త్రిష కథానాయిక. బుధవారం సూర్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో సూర్యను పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంది. ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి ఇదొక భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్ అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి సంగీతం: సాయి అభ్యంకర్, సినిమాటోగ్రఫీ: జీకే విష్ణు

రానాకు మరోసారి ఈడీ నోటీసులు



బెట్టింగ్ యాప్‌ల కేసులో నటుడు దగ్గుబాటి రానాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇదివరకు నోటీసు జారీ చేసిన సమయంలో వేరే ప్రాంతంలో సినిమా షూటింగ్‌లో ఉన్నందున విచారణకు రాలేనంటూ ఆయన ఈడీ అధికారులకు తెలిపారు. వచ్చే నెల 11న ఈడీ కార్యాలయంలో విచారణకు తప్పకుండా హాజరుకావాలని తాజా నోటీసులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి నటులు ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మికి సైతం ఈడీ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ అధికారులు.. 28 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, యూట్యూబర్లు, సినీ నటులు, కొన్ని బెట్టింగ్ కంపెనీలపై ఈసీఐఆర్ నమోదు చేశారు. మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ జరుపుతున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు సంబంధించిన డబ్బు ఏ విధంగా అందిందనే విషయంపై ఆరా తీస్తున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)



గబ్బర్‌సింగ్ వంటి హిట్ ఇవ్వండి

పవన్ కల్యాణ్

'ప్రతిసారి అన్నా... ఒక్క హిట్ అంటూ అడుగుతుంటారు. తొలిసారి అభిమానుల కోసం 'హరిహర వీరమల్లు' సినిమాకు గబ్బర్‌సింగ్ లాంటి హిట్ అవ్వాలని కోరుకుంటున్నా. నటనలో ఓనమాలు దిద్దిన విశాఖ నేల నుంచి భగవంతుడిని, సరస్వతీదేవిని మీరంతా ఆనందించే హిట్ ఇవ్వాలని కోరుకుంటున్నా' అని చిత్ర హీరో, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. 'హరిహర వీరమల్లు' సినిమా గురువారం విడుదల కాబోతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సాధారణంగా తన సినిమాలు ఎప్పుడూ రికార్డులు సృష్టిస్తాయని, బ్లాక్ బ్లస్టర్ అవుతుందని చెప్పనన్నారు. అయితే, అభిమానుల కోసం ఈ సినిమా హిట్ కావాలని సరస్వతీదేవిని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. కృష్ణుడిని తాను నమ్ముతానని, కర్మ చెయ్ ఫలితం భగవంతుడికి వదిలేయ్ అన్న సిద్ధాంతాన్ని బలంగా విశ్వసిస్తానన్నారు. సత్ఫలితాన్ని ఇవ్వాలని భగవంతుడిని కోరుకుంటున్నట్టు వెల్లడించారు. అందరి హీరోల సినిమాలకు మాదిరిగానే తన సినిమాకు టికెట్ రేటు పెంచుకునేందుకు అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. సినిమా హిట్ కావాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేసిన మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రెండేళ్ల కిందట నోవాటెల్ హోటల్ నుంచి బయటకు రాకుండా ఇబ్బందులకు గురిచేశారని, పోలీసు అధికారులు కాలిబూట్లతో తన్ని అరెస్టు చేయాలని చూస్తే నగరవాసులంతా హోటల్ ముందుకువచ్చి కూర్చున్న విషయాన్ని ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. అంత బలమైన జ్ఞాపకాన్ని విశాఖ తనకు ఇచ్చిందని, అందుకే ఈ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకించి ఇక్కడే పెట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. విశాఖలో సత్యానంద్ మాస్టారు వద్ద నటన నేర్చుకునేందుకు చేరానని, అలా నగరంతో తనకు అనుబంధం ఏర్పడిందన్నారు. సత్యానంద్ మాస్టారు తనకు ఉత్తరాంధ్ర ఆట, పాటను గుండెల్లో అణువణువూ నింపేశారన్నారు. చిన్నప్పటి నుంచి తనకు పెద్దగా ఏమీ లక్ష్యాలు లేవని, తాను ఏమైపోతానన్న భయంతో అన్నయ్య చిరంజీవి సినిమాల వైపు పంపించారన్నారు. అన్యాయం జరిగితే ఎదురుదాడి చేయడం, సహాయం చేయాలన్న లక్షణాలే చిన్నప్పటి నుంచి తనకు అలవాటయ్యాయన్నారు. విశాఖతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తన గురించి మాట్లాడే వాళ్లంతా బావిలో కప్పలని విమర్శించారు.



1996లో తన తొలి చిత్రం వచ్చిందని, వచ్చే ఏడాదికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నానని పవన్ వెల్లడించారు. నియంత పోకడలు ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కొనే శక్తిని సినిమాలు, అభిమానులే తనకు ఇచ్చాయన్నారు. సినిమాకు కులం, మతం, ప్రాంతం భేదాలు ఉండవన్నారు. ఈ సినిమాలో దేశంలోని అనేక రాష్ట్రాలు, మతాలకు చెందిన నటీనటులు నటించారన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి లేకపోతే ఈ సినిమా లేదన్నారు. సాధారణంగా సినిమాలు ఎంటర్‌టైన్‌మెంట్ కోసం చూస్తుంటారని, తన సినిమాలు ఎంటర్‌టైన్‌మెంట్‌తోపాటు ఎడ్యుకేట్ చేయాలని భావిస్తుంటానన్నారు. సనాతన ధర్మం అంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని, అందరినీ కలుపుకునిపోయేదన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ నిధి అగర్వాల్, సంగీత దర్శకుడు కీరవాణి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానంద్ మాస్టారు, సంగీత దర్శకుడు కీరవాణిలను పవన్ కల్యాణ్ సత్కరించారు. విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

ఇంట్లో వాళ్లు వేధిస్తున్నారు



తనుశ్రీ దత్తా

మీ టూ అంటూ ఏడేళ్ల క్రితం బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన హీరోయిన్ తనుశ్రీ దత్తా, మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఏడుస్తూ పోస్ట్ చేసిన వీడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అందులో తనను ఇంట్లో వాళ్లే వేధిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. "నా ఇంట్లోనే నేను వేధింపులకు గురవుతున్నాను. ఈ విషయంపై పోలీసులను సంప్రదించా. స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయమన్నారు. కానీ నా ఆరోగ్యం సహకరించట్లేదు. రేపో, ఎల్లుండో కుదుటపడ్డాక వెళ్తా. ఇంట్లో పని మనుషులు నా మాట వినరు. ఇంట్లోని వస్తువులను దొంగలిస్తుంటారు కూడా. నా పనులన్నీ నేనే చేసుకోవాల్సి వస్తోంది. నేను ఈ వేధింపులను తట్టుకోలేకున్నా.. ఇది 2018 మీ టూ సమయం నుంచి జరుగుతున్నాయి. వీటి వల్ల నా ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. పరిస్థితి చేయిదాటక ముందే ఎవరో ఒకరు నన్ను రక్షించండి" అని పేర్కొన్నారు. కాగా, 2018లో మీ టూ ఉద్యమం సమయంలో నటుడు నానా పటేకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని, అలాగే దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తనను ఓ సందర్భంలో వేధించారంటూ తనుశ్రీ దత్తా ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'వీరభద్ర' సినిమాలో తనుశ్రీ దత్తా నటించారు.

3 నెలలు.. 8 సినిమాలు.. రూ.1100 కోట్లు!



బాలీవుడ్ బాక్సాఫీసు ఇప్పుడు కలెక్షన్లతో కళకళలాడుతోంది. సరైన హిట్ లేకపోవడం, దక్షిణాది సినిమా తొడ కొట్టి వరుస విజయాలు సాధించడం, అగ్ర హీరోలు సైతం తమ ఉనికి చాటుకోవడానికి ఇబ్బంది పడుతుండడం.. ఇత్యాది కారణాల వల్ల నీరసించి పోయిన హిందీ సినిమా ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటోంది. ముఖ్యంగా మూడు నెలల నుంచి వస్తున్న వరుస విజయాలు బాలీవుడ్‌కి కొత్త జోష్ నిచ్చాయి. ఈ తొంభై రోజుల్లో విడుదలైన ఏడు సినిమాలు ప్రజాదరణతో దూసుకుపోతుండడం, తాజాగా 'సైయారా' చిత్రం విడుదలైన ఐదు రోజుల్లో రూ. 150 కోట్లు వసూలు చేయడం.. బాలీవుడ్ శుభ సూచకంగా భావిస్తోంది. 'కొవిడ్'కు పూర్వం ఉన్న పరిస్థితులు మళ్లీ తిరిగొచ్చాయని సంబరపడుతోంది.



'జాట్', 'కేసరి 2', 'రైడ్ 2', 'హౌస్‌ఫుల్ 5', 'సితారే జమీన్ పర్', 'మా', 'మెట్రో ఇన్ డినో', 'సైయారా'... ఈ ఎనిమిది సినిమాలు ఇప్పటి వరకూ వసూలు చేసిన మొత్తం ఎంతో తెలుసా?.. రూ. 1150 కోట్లు. వీటిల్లో 'హౌస్‌ఫుల్ 5', 'సితారే జమీన్ పర్', 'రైడ్ 2' చిత్రాలు ఒక్కొక్కటీ రూ. 165 కోట్లు వసూలు చేశాయి. ఇక తెలుగు నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీస్, పీపుల్ మీడియా సంయుక్తంగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో నిర్మించిన 'జాట్' చిత్రం, జలియన్‌వాలా బాగ్ హత్యాకాండకు వ్యతిరేకంగా పోరాటం చేసిన న్యాయవాది శంకరన్ నాయర్ జీవిత కథ ఆధారంగా రూపొందిన 'కేసరి 2' చిత్రం రూ. 90 కోట్ల చొప్పున వసూలు చేసి పరవాలేదనిపించుకున్నాయి. అనురాగ్ బసు రూపొందించిన 'మెట్రో ఇన్ డినో' రూ. 52 కోట్లు, తన భార్య కాజోల్ ప్రధాన పాత్రధారణిగా అజయ్ దేవగణ్ నిర్మించిన 'మా' చిత్రం రూ. 35 కోట్లు వసూలు చేసి సరిపెట్టుకున్నాయి.




దూసుకుపోతున్న 'సైయారా'

ఈ చిత్రాలన్నీ ఒక ఎత్తయితే 'సైయారా' సినిమా విజయం మరో ఎత్తు అని సినీ పండితులు పేర్కొంటున్నారు. ఇప్పుడున్న హారర్, యాక్షన్ ట్రెండ్‌లో ఈ రొమాంటిక్ సెన్సిబుల్ లవ్‌స్టోరీని ఎవరు చూస్తారని హేళనగా మాట్లాడిన వారే 'సైయారా' చిత్రం కలెక్షన్లు చూసి నివ్వెర పోతున్నారు. కుర్రకారుతో థియేటర్లు నిండిపోతున్నాయి. సినిమా చూసి యువతరం ఎంజాయ్ చేస్తోంది. చిత్రంలో నటించిన కొత్త జంట అహాన్ పాండే, అనీత్ పడ్డా మధ్య కెమిస్ట్రీ కుదిరిందని ఆడియన్స్ కితాబు ఇచ్చేస్తున్నారు. నిజంగా 'సైయారా' చిత్ర విజయం ఓ అద్భుతం అనే చెప్పాలి. ఎందుకంటే దర్శకుడు మోహిత్ సూరి ఈ కథను పట్టుకుని చాలా మంది నిర్మాతల చుట్టూ తిరిగారు. ఎవరూ ముందుకు రాలేదు. చివరకు అక్షయ్ విధాని అనే నిర్మాత సినిమా తీయడానికి అంగీకరించారు. అయితే అతను వర్ధమాన నిర్మాత. ఆర్థిక వనరులు అంతంత మాత్రమే. పైగా డిస్ట్రిబ్యూటర్స్ సపోర్ట్ లేదు. అవి రెండూ లేకుండా సినిమా తీయడం కష్టమని భావించిన దర్శకుడు మోహిత్ సూరి యశ్ రాజ్ ఫిల్మ్స్ అధినేత ఆదిత్య చోప్రాను కలిశారు. సాయం చేయమని అభ్యర్థించారు. 'ఆషికి 2' చిత్రం ఛాయలు కొన్ని కనిపించినప్పటికీ ఇప్పటి యూత్ ఆడియన్స్ మిస్ అవుతున్న మ్యూజిక్, సెన్సిబుల్ లవ్ 'సైయారా'లో ఉన్నాయని, బాగా తీస్తే ఆడియన్స్ కనెక్ట్ అవుతారని ఆదిత్య చోప్రాకు అనిపించింది. అందుకే తను అండగా ఉంటానని మాట ఇవ్వడంతో మోహిత్ సూరి పంట పండినట్లయింది. చివరకు ఆదిత్య చోప్రా నమ్మకమే నిజమైంది. 'సైయారా' చిత్రం చూసి థియేటర్లలో యువతరం ఊగిపోతోంది. వారం తిరగకుండానే ఓ చిన్న సినిమా రూ. 150 కోట్లు వసూలు చేసిందంటే ఫుల్ రన్‌లో రూ. 500 కోట్లు వసూలు చేయడం ఖాయం అంటున్నారు ట్రేడ్ పండితులు. 'సైయారా' కు వస్తున్న రెస్పాన్స్ చూసి ఖుష్ అయిన ఆదిత్య చోప్రా 'వార్ 2' చిత్రం వచ్చే వరకూ ఈ సినిమాను కంటిన్యూ చేయమని తన పంపిణీదారులకు ఆదేశాలు జారీ చేయడం విశేషం.



కృష్ణమ్మ పరవళ్లు!

నంద్యాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో కృష్ణమ్మ పరవళ్ల తొక్కుతోంది. అధికారులు బుధవారం రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద నీరు 54,956 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన కింద 66,827 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 76,739 క్యూసెక్కులు వస్తోంది. కాగా, సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు ఏపీ అధికారులు బుధవారం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు.



పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. దీంతో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నీటి మట్టం పెరగడం ఈ నెలలో ఇది రెండోసారి. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఉపనదులు, కొండవాగులు పొంగిపొర్లుతూ గోదావరికి వరద చేరుతోంది. దీంతో పోలవరంలో నీటిమట్టం బుధవారం నాటికి మరింత పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,57,649 క్యూసెక్కుల వరదను స్పిల్‌వే 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.



ఉప్పాడలో ఉప్పొంగిన సముద్రం

కొత్తపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం ఉప్పొంగడంతో రాకాసి అలలు ఉవ్వెత్తున మాయాపట్నం గ్రామంలోకి దూసుకెళ్లాయి. మత్స్యకారులకు చెందిన సుమారు పది ఇళ్లు సముద్రంలో కలిసిపోయాయి. కెరటాలు విరుచుకుపడటంతో నిద్ర నుంచి మేల్కొన్న తల్లులు చంటి పిల్లలను చంకన పెట్టుకుని పరుగులు తీశారు. కెరటాల దెబ్బకు ఇళ్లలోని వస్తువులు, వలలు కొట్టుకుపోయాయి.

ఏపీఈఆర్‌సీ చైర్మన్ పోస్టును ఎప్పటిలోగా భర్తీ చేస్తారో చెప్పండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) చైర్మన్ పోస్టును ఎప్పటిలోగా భర్తీ చేస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంధనశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సహా పలువురికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబరు 17కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీఈఆర్‌సీ చైర్మన్ పోస్టును భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దొంతిరెడ్డి నరసింహారెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ఈ పోస్టు భర్తీకి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించేందుకు సమయం కావాలని కోరారు.

చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇవ్వాలి

» జాతీయ ఓబీసీ సెమినార్‌లో తెలుగు ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు బోను దుర్గా నరేశ్ యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ ఓబీసీ సెమినార్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి బీజేపీలు ఎంపీ ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు, బీపీ మండల్ మనవడు ఆచార్య సూరజ్ మండల్ పాల్గొన్నారు.

'అవయవమార్పిడి' హోదా ఇవ్వండి: హైకోర్టు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వంద పడకల ప్రభుత్వ బోధనాసుపత్రులను అవయవమార్పిడి కేంద్రాలుగా గుర్తించేలా, ఆ హోదా కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2016లో దాఖలైన పిల్‌పై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ పిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2016లో పిల్ దాఖలైతే ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవమార్పిడికి అవకాశం కల్పించడం ద్వారా అవయవమార్పిడి ముఠాలను కట్టడి చేయవచ్చని పేర్కొంటూ విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

ఉద్యోగ నేతలకు బదిలీల్లో మినహాయింపు ఎలా?

» నివేదిక కోరిన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ పరిధిలో జరిగే సాధారణ బదిలీల్లో ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు మినహాయింపులిచ్చే విషయంపై స్పష్టత ఇవ్వాలని ఉన్నతాధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. మంత్రిత్వ శాఖ పరిధిలో ఇటీవల చేపట్టిన బదిలీల్లో 7,100 మందికి పైగా సిబ్బంది బదిలీ అయ్యారు. మరో 800 మందికి పైగా తమ పాత స్థానాల్లో కొనసాగుతున్నారు. వీరిలో సింహభాగం ఉద్యోగ సంఘాల ప్రతినిధులే ఉన్నారు. జీఏడీ మార్గదర్శకాల ప్రకారం గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఒకేచోట తొమ్మిదేళ్లు కొనసాగే అవకాశం ఉంది. అయితే ఈ మినహాయింపును ఒకే విడతలో ఇవ్వాలా, వేర్వేరు కాలాలకు అన్వయించాలా అన్న అంశంపై స్పష్టత కొరవడడంతో, దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు ప్రతినిధులు 15-20 ఏళ్ల పాటు ఒకేచోట పని చేస్తుండటంపై అభ్యంతరాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియకు సంబంధించి అమలులో ఉన్న నియమాలు, మార్గదర్శకాలను ఎరిశీలించి, అవి దుర్వినియోగం కాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

వైద్య విద్య అడ్మిషన్లకు నూతన మార్గదర్శకాలు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రాంతాల వారీగా ఉన్న నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పదేళ్ల కాలపరిమితి ముగిసినందున స్థానిక విద్యార్థులతోనే సీట్లు భర్తీ చేయనున్నారు. ఇప్పటికే రెండు రాష్ట్రాల హెల్త్ వర్సిటీలు సీట్లు కేటాయింపు ప్రక్రియను వేర్వేరుగా చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అడ్మిషన్లకు సంబంధించి ఇప్పటి వరకూ ఉన్న నిబంధనలకు ఏపీ ప్రభుత్వం సవరణ చేసింది. స్థానిక, స్థానికేతర వ్యత్యాసంతో పాటు ఏయూ, ఎస్వీయూ ప్రాంతాల విద్యార్థులకు సీట్ల కేటాయింపులకు సంబంధించిన సవరణ జీవోను ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు బుధవారం జారీ చేశారు. ఉమ్మడి ఏపీలో రాష్ట్రస్థాయి కాలేజీగా ఉన్న సిద్ధార్థ మెడికల్ కాలేజీలోని సీట్లను 36:42:22 నిష్పత్తిలో ఓయూ, ఏయూ, ఎస్వీయూ ప్రాంతాల వారీగా కేటాయించేవారు. ఇప్పుడు ఓయూ పరిధిలోని విద్యార్థులకు కేటాయించే సీట్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఏయూ ప్రాంత విద్యార్థులకు 65.62 శాతం, ఎస్వీయూ పరిధిలో 34.38 శాతం చొప్పున సీట్లను కేటాయించింది.

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి చర్యలు

» 30,635 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక: మంత్రి కొండపల్లి

మంగళగిరి సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 7.69 లక్షల స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, అందుకోసం రూ.30,635 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికతో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ముందుకు సాగుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ జిల్లాల గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో మంగళగిరి హ్యాపీ రీసార్ట్స్‌లో రెండు రోజుల సదస్సులో భాగంగా బుధవారం జరిగిన ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశంలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సీఈవో వాకాటి కరుణ, అడిషనల్ సీఈవో శ్రీరాముల నాయుడు, వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు టీ.విజయ్‌కుమార్, సెర్ప్ డైరెక్టర్లు, వివిధ జిల్లాల పీడీలు, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు సిద్ధంకండి

» ప్రతి అన్నదాతకూ విద్యుత్ కనెక్షన్: మంత్రి గొట్టిపాటి

రాజమహేంద్రవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. రాజమహేంద్రవరంలో విద్యుత్ శాఖాధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే విద్యుత్ శాఖ సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

అప్రమత్తతతో అందరికీ ఆరోగ్యం

వ్యాధుల నియంత్రణకు ముందు జాగ్రత్తలు అవసరం

» ఆరోగ్య శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

» ఐపీఎంలో 150 పోస్టుల భర్తీకి ఆమోదం



వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ తదితరులు

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే కాదు.. వారు వ్యాధుల బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ పనితీరు, టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ సేవలు, మెడికల్ కాలేజీల నిర్మాణం.. వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల ఆహారపు అలవాట్లు మొదలుకొని, ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం వరకూ.. ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. వైద్య ఖర్చుల భారం తగ్గేలా చేయాలంటే ఆరోగ్యం మీద ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ఆహారపు అలవాట్లల్లో తీసుకురావాల్సిన మార్పుల గురించీ వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అప్రమత్తత, ముందు జాగ్రత్త చర్యలతో వ్యాధుల నియంత్రణ చేపట్టాలని స్పష్టం చేశారు.

తరచూ వైద్య పరీక్షలు..

టాటా ట్రస్ట్-గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో చేపడుతున్న డిజిటల్ నెర్వ్ సెంటర్లు ప్రజారోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తాయన్నారు. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. వచ్చే ఏడాది జనవరిలో చిత్తూరు జిల్లావ్యాప్తంగా, వచ్చే ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఈ సెంటర్లను ప్రారంభిస్తామని చెప్పారు. తిరుపతి, విజయవాడ, విశాఖల్లో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్లలో సీటీస్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ వంటి వాటిని పీపీపీ ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఉన్న యోగధ్యాయన పరిషత్తును పునరుద్ధరించాలని ఆదేశించారు. దీనికోసం ఒక సొసైటీని ఏర్పాటు చేయాలన్నారు. యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, నేచురోపతి, హోమియో, ఆయుర్వేదం, యునాని వంటి సంప్రదాయ వైద్యాన్ని అందుబాటులోకి తేవాలన్నారు.

పోషకాహార లోపాలు గుర్తించాలి..

చిన్న పిల్లల్లో పోషకాహార లోపాలను ముందుగానే గుర్తించేలా కేర్ అండ్ గ్రో పాలసీని సమర్థవంతంగా అమలు చేయాలని సీఎం చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఉండాలనే ప్రభుత్వ పాలసీని పక్కాగా అమలు చేయాలన్నారు. గిరిజనులకు వైద్య సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వాస్పత్రులను తీర్చిదాద్దాలన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు.

150 పోస్టులకు ఆమోదం..

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విన్నపం మేరకు 150 పోస్టు భర్తీకి సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఐపీఎంలో మొత్తం 723 పోస్టులు ఉండగా.. 143 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తొలివిడతగా 150 పోస్టులు భర్తీ చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులకు రిజిస్ట్రేషన్లు చేసే అంశాన్ని పరిష్కరించాలని మంత్రికి సూచించారు. ఈమేరకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వైద్య విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలని సీఎం స్పష్టం చేశారు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

వాయుగుండంగా మారే అవకాశం

నేడు కోస్తాకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉత్తర బంగాళాఖాతంలో గురువారం ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో శుక్రవారం అల్పపీడనం ఏర్పడనున్నది. ఇది బలపడి పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా తీరం దిశగా పయనించే క్రమంలో సముద్రంలోనే బలపడి వాయుగుండంగా మారుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆతర్వాత తీరం దాటి ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తరప్రదేశ్ వైపు పయనిస్తుందని, దీంతో తూర్పు, మధ్య, ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ పేర్కొంది. కాగా, మంగళవారం ఉత్తర కోస్తా పరిసరాల్లో కొనసాగిన ఉపరితల ఆవర్తనం బుధవారం నాటికి పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఉంది. మరోవైపు తూర్పు అరేబియా సముద్రం నుంచి మధ్య భారతం, తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో బుధవారం కోస్తాలో పలుచోట్ల వర్షాలు, ఉత్తరకోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. గురువారం కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీగా, దక్షిణ కోస్తాలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇంకా ఈనెల 25,26 తేదీల్లో ఉత్తరకోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

సోలార్ ప్యానెళ్ల కింద సాగు

» త్వరలో 'అగ్రివోల్టాయిక్స్' పాలసీ

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సౌరశక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చే సోలార్ ప్యానెళ్లను పొలాల్లో ఏర్పాటు చేసుకుని.. ఆ ప్యానెళ్ల కింద ఎంపిక చేసిన పంటలను సాగు చేసుకునే విధానాన్ని రాష్ట్రంలో ప్రోత్సహించనున్నారు. తద్వారా సౌరవిద్యుత్ ఉత్పత్తితోపాటు రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ తరహా సాగును 'అగ్రివోల్టాయిక్స్'గా పేర్కొంటారు. ప్రస్తుతం ఈ విధానం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తృతంగా అమలవుతోంది. దీనిని ఏపీలోనూ ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖలు యోచిస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ సంస్థ(ఎన్ఆర్ఈడీఏపీ) ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. దీనికి సంబంధించి బుధవారం విజయవాడలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు, డెవలపర్లు, సోలార్ ప్యానళ్ల తయారీదారులు, మేధావులతో నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్ఈఎఫ్ఐ), ఎన్ఆర్ఈడీఏపీలు సంయుక్తంగా సదస్సును నిర్వహించాయి. అగ్రివోల్టాయిక్స్ విధానంతో రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఎన్ఆర్ఈడీఏపీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కమలాకరబాబు చెప్పారు. రాష్ట్రంలో అగ్రివోల్టాయిక్స్ విధానాన్ని అమలు చేసేలా 'పాలసీ'ని రూపొందిస్తున్నామన్నారు. కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగం వ్యవసాయోత్పత్తులను ప్రోత్సహిస్తున్నాయని ఎన్ఎస్ఈఎఫ్ఐ అధ్యక్షుడు పులిపాక సుబ్రహ్మణ్యం తెలిపారు. అగ్రివోల్టాయక్స్‌తో ఇంధన, వ్యవసాయరంగాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

1,18,525 మందికి ఇంజనీరింగ్ సీట్లు

» కన్వీనర్ కోటాలో 33,721 సీట్లు మిగులు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థులకు తొలి విడత సీట్ల కేటాయించారు. కన్వీనర్ కోటాలో మొత్తం 1,52,246 సీట్లు అందుబాటులో ఉండగా 1,18,525 సీట్లు కేటాయించినట్లు ఈఏపీసెట్ కన్వీనర్ జి.గణేశ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 24 ప్రభుత్వ కాలేజీల్లో 7,708 సీట్లు అందుబాటులో ఉండగా 6,860(88.99శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. 210 ప్రైవేటు కాలేజీల్లో 1,32,535 సీట్లు ఉంటే 1,00,773(76.03శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. 10 ప్రైవేటు యూనివర్సిటీల్లో 12,003 సీట్లు ఉండగా 10,892(90.74శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తంగా 33,721 సీట్లు మిగిలిపోయాయి. 49 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఒక్క కాలేజీ జీరో అడ్మిషన్ల జాబితాలో మిగిలింది. రెండు కాలేజీల్లో 10లోపు సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. వివిధ కాలేజీల్లో 66 బ్రాంచ్‌ల్లో ఒక్క సీట్లు కూడా భర్తీ కాలేదు. మొత్తంగా కంప్యూటర్ సైన్స్ విభాగంలోనే ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. .

ఈసెట్‌లో 20,837 మందికి సీట్లు

ఈసెట్ కౌన్సెలింగ్‌లో 20,837 మందికి సీట్లు కేటాయించినట్లు ఈసెట్ కన్వీనర్ తెలిపారు. 19 యూనివర్సిటీ కాలేజీల్లో 1,800 సీట్లు అందుబాటులో ఉండగా 1,485 సీట్లు భర్తీ అయ్యాయి. 315 మిగిలిపోయాయి. 214 ప్రైవేటు కాలేజీల్లో 34,734 సీట్లు ఉంటే 19,352 భర్తీ అయ్యాయి. 15,382 మిగిలిపోయాయి.

హాస్టళ్ల పర్యవేక్షణకు ఏఐ

త్వరలో అందుబాటులోకి యాప్

» బాబు స్ఫూర్తితో వసతి గృహాలకూ పీ 4

» మార్గదర్శకులను గుర్తించి దత్తత ఇస్తాం

» స్వచ్ఛాంధ్ర నిధులతో మరుగుదొడ్లు

» అధికారుల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి

» బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి సవిత


అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'కృత్రిమ మేధతో(ఏఐ) బీసీ హాస్టళ్ల పర్యవేక్షణ చేపట్టనున్నాం. త్వరలోనే అందుకు ఒక యాప్ రూపొందించనున్నాం. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి పీ 4 మోడల్ అమలు చేయనున్నాం. మార్గదర్శకులను గుర్తించి బీసీ హాస్టళ్లను దత్తత ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడతాం' అని మంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయా జిల్లాల బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'ఏఐతో బీసీ హాస్టళ్ల జవాబుదారీతనం మరింత పెరుగుతుంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో నిర్మిస్తున్న మరుగుదొడ్లను వచ్చే నెల 30లోగా పూర్తి చేయాలి. బీసీ హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలి. 5లోగా నిర్దేశిత లక్ష్యం మేర అడ్మిషన్లు పూర్తి చేయాలి. ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) ద్వారా విద్యార్థుల హాజరులో ఆటంకాలు ఏర్పడితే ఉన్నతాధికారులతో చెప్పి సమస్య పరిష్కరించుకోవాలి. బీసీ హాస్టళ్ల అభివృద్ధికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీనిలో భాగంగానే గత ప్రభుత్వం పెట్టిన డైట్ బిల్లుల బకాయిలు చెల్లించడమే కాకుండా ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తున్నాం. హాస్టళ్లలో రాత్రి సమయాల్లో సంక్షేమ అధికారులు ఉండాల్సిందే. హాస్టళ్ల పనితీరు మరింత మెరుగుపడాలంటే నిరంతర పర్యవేక్షణ అవసరం. మంత్రిగా నేను అన్ని జిల్లాల్లోని బీసీ హాస్టళ్లను, గురుకులాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నా. జిల్లా స్థాయి అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించాలి. వీలుచేసుకొని రాత్రిళ్లు బస చేయాలి. దీనికోసం ఒక టూర్ డైరీ రూపొందించాలి. ఆ డైరీని ప్రతి నెలా 5లోగా రాష్ట్ర కార్యాలయానికి పంపించాలి. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో మరమ్మత్తులు చేపట్టాం. ఇందుకోసం రూ.13 కోట్లు వెచ్చిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం' అని మంత్రి సవిత వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డైరక్టర్ చంద్రశేఖర్ రాజు, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, బీసీ కార్పొరేషన్ ఈడీలు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల నిర్వహణ తీరుతెన్నులను బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ వివరించారు.

'వెదర్‌మ్యాన్' అలర్ట్!

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు, ఎండలు, ఈదురుగాలులు, తుఫాన్‌లపై నిరంతరం సమాచారం అందిస్తున్నారు. వీరంతా భౌతికశాస్త్రంతో అనుబంధం ఉన్న ఇంజనీరింగ్, వ్యవసాయశాస్త్ర పట్టభద్రులు. చిన్నప్పటి నుంచీ మేఘాలు, వర్షం అంటే ఉన్న ఇష్టంతో ఒకరు.. వాతావరణంపై మక్కువతో మరొకరు.. వెదర్‌మ్యాన్‌గా మారారు. వీళ్లకు ఎక్స్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో వేలల్లో ఫాలోవర్స్ ఉన్నారు. ఏపీ వెదర్‌మ్యాన్ సాయిప్రణీత్ (తిరుపతి), వైజాగ్ వెదర్‌మ్యాన్ సాయికిరణ్, ఈస్ట్‌కోస్ట్ వెదర్‌మ్యాన్ బెన్ని... 'ఆంధ్రజ్యోతి'తో తమ అనుభవాలు పంచుకున్నారు.

హుద్‌హుద్‌ను చూశాక...




విశాఖపట్నం జిల్లా గాజువాక ప్రాంతంలోని తుంగ్లాం గ్రామానికి చెందిన సాయికిరణ్ సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడు. హుద్‌హుద్ తుఫాన్ తర్వాత ఇంటర్‌నెట్‌లో వాతావరణం గురించి అన్వేషిస్తూ పలు మోడళ్లను విశ్లేషించేవారు. ఈ క్రమంలోనే లాక్‌డౌన్ సమయంలో వైజాగ్ వెదర్‌మ్యాన్ పేరుతో బులెటిన్లు ఇచ్చేవారు. సాయికిరణ్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.9 లక్షలు, ఎక్స్‌లో 22 వేలు, యూట్యూబ్‌లో 10వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. తుంగ్లాంలోని తన ఇంటిపై వాతావరణ సెన్సర్లు ఏర్పాటుచేసుకున్న సాయికిరణ్ ప్రస్తుతం చెన్నైలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. 'వాతావరణంపై కచ్చితమైన సమాచారం ఇవ్వాలంటే తగిన అధ్యయనం అవసరం. రోజూ ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం ఒక గంట, రాత్రి ఒక గంట బులెటిన్ల తయారీకి కేటాయిస్తా. మొదట్లో వైజాగ్ వెదర్‌పై దృష్టిపెట్టాను. ఇప్పుడు ఏపీ మొత్తానికీ సమాచారం అందిస్తున్నా. చెన్నైలో ఉదయం, సాయంత్రం సమాచారం ఇస్తున్నా' అని సాయికిరణ్ చెప్పారు.

సాయిప్రణీత్‌కు ప్రధాని ప్రశంసలు



తిరుపతికి చెందిన సాయిప్రణీత్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడు. కొన్నాళ్లు సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసి, ప్రస్తుతం బెంగళూరులో వ్యాపారం చేస్తున్నారు. 2020లో వెదర్ ఆఫ్ సౌత్ ఇండియాగా తొలుత ప్రారంభించి తర్వాత 'ఏపీ వెదర్‌మ్యాన్'గా పేరు మార్చి రాష్ట్రానికి వాతావరణ సమాచారం అందిస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ వెదర్ మోడల్స్ నుంచి కీలక సమాచారం సేకరించి, అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ స్టెల్లాతో, చెన్నైలోని వాతావరణ కేంద్రం అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు బులెటిన్లు ఇస్తున్నారు. ఏపీ వెదర్‌మ్యాన్ పేరిట ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఈయనకు 'ఎక్స్'లో 80వేల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 1.4 లక్షలు, యూట్యూబ్‌లో 1.5 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. గతేడాది ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో తన ఇంటికి ఆహ్వానించిన పలు రంగాల నిపుణుల్లో సాయిప్రణీత్ కూడా ఉన్నారు. ఏపీలో రైతులకు అందిస్తున్న సేవలకుగాను ప్రధాని ఆయనను అభినందించారు. 'బులెటిన్లు ఇచ్చే సమయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటా. మనమిచ్చిన సమాచారం కచ్చితంగా ఉంటేనే నమ్మకం కలుగుతుంది. రోజుకు నాలుగుసార్లు బులెటిన్లు ఇస్తుంటా. అత్యవసరమైనప్పుడు మరింత సమయం వెచ్చిస్తుంటా. గులాబ్ తుఫాన్‌లో విశాఖ కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సృజన తదితర అధికారులతో కలిసి రాత్రంతా మేల్కొని ఎప్పటికప్పుడు బులెటిన్లు ఇవ్వడం మర్చిపోలేని అనుభవం' అని సాయిప్రణీత్ తెలిపారు.

వర్షం అంటే ఇష్టం



'మాది విశాఖపట్నం. అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేశా. చిన్నప్పటి నుంచీ వాతావరణంలో మార్పులు గమనించేవాడిని. వర్షం కురుస్తుంటే చూస్తూ ఉండడం ఎంతో ఆనందంగా ఉంటుంది. వాతావరణంపై బులెటిన్లు తయారుచేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడం హాబీగా మారింది. హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు ఏడో తరగతి చదువుతున్నా. ఆ తుఫాన్ చూసి అందరూ భయపడ్డారు. డిగ్రీ చదువుతున్నప్పుడే 2022 నుంచి ఏపీలో వెదర్ బులెటిన్లు ఇస్తున్నా. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 35వేలు, యూట్యూబ్‌లో 25 వేలు, ఎక్స్‌లో దాదాపు మూడున్నరవేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. అంతర్జాతీయ మోడల్స్ పరిశీలించి సొంతంగానే వాతావరణ సమాచారం చెబుతున్నా. రైతులు, ఉద్యోగులు, ఈవెంట్ ఆర్గనైజర్లు వాతావరణ సమాచారం కోసం అడుగుతుంటారు.'

- లింగాల బెన్ని, ఈస్ట్‌కోస్టు వెదర్‌మ్యాన్, విశాఖపట్నం



ఎత్తిపోతలకు జలకళ

రెండు రోజులుగా పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు చంద్రవంక నదికి చేరింది. ఆ వరద నీటితో బుధవారం ఎత్తిపోతల జలకళను సంతరించుకుంది. రెండు రోజుల వ్యవధిలో నియోజకవర్గం మొత్తంమ్మీద 70 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

- మాచర్లటౌన్, ఆంధ్రజ్యోతి

మస్కిలో 4వేల ఏళ్లకు పూర్వమే జనావాసాలు!

» పురావస్తుశాఖ తవ్వకాల్లో బయటపడ్డ ప్రాచీన కళాకృతులు



మస్కి పరిసరాల్లో తవ్వకాలు జరుపుతున్న నిపుణులు

రాయచూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మస్కి పరిసరాల్లో పురావస్తు పరిశోధకులు జరుపుతున్న తవ్వకాల్లో ప్రాచీన కళాకృతులు, పురాతన ఆయుధాలు బయట పడ్డాయి. భారత్‌తోపాటు అమెరికా, కెనడా దేశాల నుంచి వచ్చిన పలువురు పరిశోధకులు ఈ తవ్వకాల్లో పాల్గొంటున్నారు. గతంలోనే ఈ ప్రాంతంలో మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుడి కాలానికి చెందిన శాసనాలను గుర్తించారు. ఇటీవల జరిపిన తవ్వకాల్లో వేల ఏళ్ల క్రితం.. అప్పటి ప్రజలు వినియోగించిన వంట సామగ్రి, రాతి ఆయుధాలు, మట్టిపెంకులు, వివిధ కళాకృతులు లభించాయని తవ్వకాలకు నేతృత్వం వహిస్తున్న ఢిల్లీకి చెందిన నిపుణుడు శివ్ నాడార్ తెలిపారు. మస్కి సమీపంలో తవ్వకాల కోసం 271 కేంద్రాలను గుర్తించామన్నారు. మల్లికార్జున బెట్ట, దేవాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో క్రీస్తు పూర్వం 14 నుంచి 11వ శతాబ్దాల మధ్య అప్పటి జనావాసాలు సైతం ఉన్నాయని గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మస్కి పరిసరాల్లో సాగుతున్న తవ్వకాల్లో దాదాపు 4 వేల సంవత్సరాలకు పూర్వమే జనావాసాలున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

పెద్దిరెడ్డితో కొలికపూడి... వీడియో వైరల్

» తిరుపతిలో యాదృచ్ఛికంగా కలిశాం: శ్రీనివాసరావు



పెద్దిరెడ్డికి షేక్‌హ్యాండ్ ఇస్తున్న టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి

విజయవాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కలిసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పెద్దిరెడ్డిని టీడీపీ శ్రేణులు ఎంతగా వ్యతిరేకిస్తాయో తెలిసినప్పటికీ కొలికపూడి ఆయనతో సంభాషించడంపై సోషల్‌మీడియాలో రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. రాజమండ్రి ఎయిర్ పోర్టులో పెద్దిరెడ్డిని కలిశారంటూ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అయితే ఈ వార్తలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కార్యాలయం ఖండించింది. 'శుక్రవారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో సహా తిరుపతికి వెళ్లారు. రేణిగుంట విమానాశ్రయంలో పెద్దిరెడ్డి ఎదురుపడితే మర్యాదపూర్వకంగా పలకరించారు. దీన్ని వక్రీకరించటాన్ని ఖండిస్తున్నాం' అని పేర్కొంది.

బడుగులకు రాజ్యాధికారం బాధ్యత బీసీవైదే

» బీసీవై పార్టీ నేత బోడె రామచంద్ర యాదవ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బోడె రామచంద్రయాదవ్

విజయవాడ/మంగళగిరి సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు సామాజిక వర్గాలు మినహా మిగిలిన వర్గాలను ఏకం చేసి, బడుగులను రాజ్యాధికారం వైపు నడిపించే బాధ్యత బీసీవై పార్టీదేనని ఆ పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ అన్నారు. భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) రెండవ ఆవిర్భావ వేడుకలను బుధవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ఆ రెండు సామాజిక వర్గాలే అధికారాన్ని అనుభవిస్తున్నాయని, వాటిని రాజకీయంగా బహిష్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'బీసీవై భరోసా యాత్ర' పేరుతో బహుజన చైతన్యం, యువజన పోరాటానికి నాంది పలకబోతున్నామని చెప్పారు. జగన్ వికృత రాజకీయాలతో రాష్ట్రం నాశనమైందని అన్నారు. కాగా, ప్రాణం ఉన్నంత వరకు కరేడు రైతుల కోసం పోరాటం చేస్తానని రామచంద్ర చెప్పారు.

ఈసారి అమరావతిలోనే పంద్రాగస్టు వేడుకలు: సీఎస్

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇంతవరకు విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య వేడుకలను ఈసారి రాజధాని అమరావతిలోనే నిర్వహించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ ఈ విషయాన్ని వెల్లడించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సచివాలయం వెనుక ఇటీవల పీ-4 సభ నిర్వహించిన ప్రదేశంలోనే స్వాతంత్ర్య వేడుకలు జరుగుతాయని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. రాజధానిలోనే తొలిసారి స్వాతంత్ర్య వేడుకలు జరపనున్న నేపథ్యంలో కార్యక్రమం విజయవంతం కావటానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

వేధింపులను క్షణం కూడా భరించొద్దు

» మహిళలు, బాలికలు ధైర్యంగా బయటికి చెప్పాలి: రాయపాటి శైలజ



అనంతపురం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు లైంగిక వేధింపులను క్షణం కూడా భరించవద్దని, ధైర్యంగా బయటకువచ్చి చెప్పాలని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ సూచించారు. అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె, నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన 'మహిళల రక్షణ, భద్రత-సాధికారత'పై అవగాహన సదస్సులో ప్రసంగించారు. పనిచేసే చోట, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు వేధింపులు ఎదురవుతూ ఉంటాయని ఆమె అన్నారు. ఆపద సమయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లు వాడాలని, శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ శాఖకు సంబంధించిన పలు పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. సదస్సు తర్వాత మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మీడియాతో మాట్లాడుతూ.. సినిమాలు, సీరియల్స్ ప్రభావం నేటి యువత, అమ్మాయిలపై ఎక్కువగా ఉందన్నారు. అలాంటి వాటిపై సెన్సార్ కట్ ఉండాలని సూచించారు. 'ఇటీవల భార్యల చేతిలో భర్తలు ఎక్కువగా హత్యకు గురవతున్నారు..? వీటిపై నివేదిక అడిగారా?' అని విలేకరులు ప్రశ్నించగా, అలా చేయించే మహిళల వెనుక కూడా మగవాళ్లు ఉన్నారుగా అన్నారు.

మామూళ్ల మత్తులో నకిలీ రిజిస్ట్రేషన్లు!

» రూ.40కోట్ల ఆస్తి రిజిస్ట్రేషన్‌కు భారీగా వసూళ్లు

» విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

గుంటూరు సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని గోరంట్ల పరిధిలో రూ.40కోట్ల విలువైన భూమికి నకిలీ రిజిస్ట్రేషన్ చేయడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు తెలిసింది. కొద్దినెలల కిందట ఉద్యోగ విరమణ పొందిన నరసరావుపేట జాయింట్ రిజిస్ట్రార్ ముందుగానే అన్నీ మాట్లాడుకుని నకిలీ రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ప్రస్తుతం నల్లపాడు పోలీసుల అదుపులో ఉన్న కీలక నిందితుడు మొత్తం గుట్టు విప్పినట్లు తెలుస్తోంది. ఆ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ గుంటూరులో పనిచేసిన సమయంలో మానస సరోవరాన్ని కూడా పలువురికి రిజిస్టర్ చేశారని, కలెక్టర్ జోక్యంతో దానిని రద్దు చేసినట్లు సమాచారం. పిడుగురాళ్ల, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో కూడా ఆయన కొన్ని వందల నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులో జరిగిన నకిలీ చలానాల కుంభకోణంలో కూడా ఆయన పాత్ర ఉన్నట్లు చెబుతున్నారు. గోరంట్లలో రూ.40కోట్ల ఆస్తి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సదరు జాయింట్ రిజిస్ట్రార్ భారీగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ సీనియర్ అసిస్టెంట్‌తోనే 18 జీపీఏలు చేయించినట్లు తెలిసింది. ప్రస్తుతం పల్నాడులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆ సీనియర్ అసిస్టెంట్‌పై కూడా కేసు పెట్టాలని బాధితులు కోరుతున్నారు. ఆ జాయింట్ రిజిస్ట్రార్‌తో పాటు గుంటూరుకు చెందిన మరో రిజిస్ట్రార్‌పై నల్లపాడు పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. గోరంట్ల పరిధిలోని ఆస్తి యజమాని కొత్తపల్లి పద్మజ గతంలోనే మృతి చెందారు. ఆమె ఆధార్ కార్డు ఆధారంగానే ఆస్తి బదలాయింపు జరగాలి. రిజిస్ట్రేషన్ సమయంలో అసలు యజమాని వేలిముద్రలు కూడా సరిపోలాలి. అయితే మామూళ్ల మత్తులో ఉన్న విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ ఇష్టానుసారంగా వ్యవహరించి నకిలీ వ్యక్తితో రిజిస్ట్రేషన్ చేసేశారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు కొరిటపాడులో అనుమతి ఇచ్చారని సమాచారం. ఈ నకిలీ రిజిస్ట్రేషన్‌పై పద్మజ భర్త కొత్తపల్లి శ్రీనివాసరావు అప్పట్లోనే నరసరావుపేట వెళ్లి అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదు. దీంతో బాధితుడు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేశారు. దీంతో నకిలీ రిజిస్ట్రేషన్‌పై మాజీ జాయింట్ రిజిస్ట్రార్ అప్పట్లో హడావిడిగా నరసరావుపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

గ్లోబల్ గేట్‌వే ఏపీ

(మొదటి పేజీ తరువాయి)





ఇన్వెస్టోపియా సదస్సుకు హాజరైన ప్రతినిధులు, మాట్లాడుతున్న సీఎం

సూచించారు. రాష్ట్రంలో అపార అవకాశాలున్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పెట్టుబడులు వస్తేనే సంపద సృష్టికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఏడాది కాలంలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే విధానాలకు రూపకల్పన చేశామని తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి నమ్మకం ముఖ్యమని, రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పే ప్రాజెక్టులు, పారిశ్రామిక పెట్టుబడులకు తాను సమన్వయకర్తగా వ్యవహరిస్తానని చెప్పారు. ఆచరణాత్మక ప్రతిపాదనలతో వచ్చి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. యూఏఈ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఆంధ్రప్రదేశ్' సదస్సులో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎం, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రి సమక్షంలో ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ), యూఏఈ ఇన్వెస్టోపియా పెట్టుబడుల అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పెట్టుబడులతో వచ్చిన మరుక్షణం నుంచే ప్రభుత్వపరంగా ప్రోత్సాహకాలు, సబ్సిడీలతో పాటు ప్రాజెక్టులు నెలకొల్పడంలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అన్ని అనుమతులను స్పీడ్ డూయింగ్ బిజినెస్ కింద వేగంగా మంజూరు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అనుమతుల అంశాన్ని ముఖ్యమంత్రి కార్యాలయమే నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. అమరావతిలో నాలెడ్జి ఎకానమీ, నిర్మాణ రంగాల్లో పెట్టుబడులు పెట్టొచ్చని సూచించారు. దావోస్ పెట్టుబడుల సదస్సులో యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రిని కలిసినప్పుడు రాష్ట్రానికి ఆహ్వానించానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన తొలిపర్యటనలో ఏపీకి రావడం, విజయవాడలో ఇన్వెస్టోపియా సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇంకా ఏమన్నారంటే..

> ప్రతిపాదనలతో రండి.. ఏపీని చూడండి.. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోండి. స్వయంగా నేను ఫెసిలిటేటర్‌గా మారి.. మీ పెట్టుబడులను ప్రాజెక్టులుగా సాకారం చేసి చూపిస్తా.
>
> - సీఎం

ఎడారిలో స్వర్గం దుబాయ్..

50 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉండే ఎడారి లాంటి దుబాయ్‌లో స్వర్గాన్ని సృష్టించిన తీరు చూస్తే నాకు అసూయ కలుగుతుంది. అక్కడి పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లు సందర్శకులకు మంచి అనుభూతి కల్గిస్తాయి. 2021లో ప్రపంచమంతా కరోనా అలజడి సృష్టిస్తే.. యూఏఈ మాత్రం విభిన్నంగా ఆలోచించి ఇన్వెస్టోపియాను స్థాపించి ప్రపంచ పెట్టుబడులకు తలుపులు తెరిచింది. దుబాయ్‌లో ఇంటర్నెట్ సిటీని చూసి నేను హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించాను. 1.1 కోట్ల మంది జనాభా ఉన్న యూఏఈలో 38 శాతం మంది భారతీయులున్నారు. భారతీయులకు యూఏఈలో విస్తృత అవకాశాలు కల్పిస్తోంది. భారతీయులు కూడా ఆ దేశానికి అంతే విశ్వసనీయతతో సేవలు అందిస్తున్నారు. యూఏఈ తరహాలోనే ఏపీలో పాలనా వ్యవహారాలన్నీ ఆన్‌లైన్ ద్వారా జరిగేలా చర్యలు చేపట్టాం. ఆగస్టు నుంచి ఎవరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలందిస్తాం. టెక్నాలజీని పెద్దఎత్తున వినియోగిస్తున్న రాష్ట్రంగా.. టెక్ ఫార్వార్డ్ స్టేట్‌గా ఏపీ గుర్తింపు పొందింది.

దేశ అభివృద్ధిలో ఏపీ ముఖ్య భాగస్వామి

ప్రపంచంలో ప్రస్తుతం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2029 నాటికి మూడో స్థానానికి, 2047 నాటికి నంబర్ వన్ స్థానానికి చేరుతుంది. ఈ పురోగతిలో ఏపీ కూడా ముఖ్య భాగస్వామి కానుంది. రాష్ట్రంలోని అపార వనరులను సద్వినియోగం చేసుకుంటూ 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. పీ4 విధానాన్ని ప్రవేశపెట్టి పేదరిక నిర్మూలన కోసం పని చేస్తున్నాం. భవిష్యత్తంతా గ్రీన్ ఎనర్జీ రంగానిదే. 5 గిగా వాట్ల దేశీయ ఉత్పత్తి లక్ష్యంతో ఏపీ ముఖ్య భాగస్వామిగా మారుతుంది. గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఎగుమతులకు విశాఖ, కాకినాడ ప్రాంతాల్లో విస్తృత అవకాశాలున్నాయి. దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తీర్చిదిద్దుతాం. దీనికోసం యాక్షన్ ప్లాన్‌ను కూడా సిద్ధం చేశాం. పర్యాటకం, ఆతిథ్యం, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, ఏరోస్పేస్, ఆయిల్ గ్యాస్, పెట్రో కెమికల్స్ రంగాల్లోనూ ఏపీలో అపారమైన అవకాశాలు, వనరులు అందుబాటులో ఉన్నాయి.

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలోనే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. 2026, జనవరి ఒకటో తేదీ నాటికల్లా ఏపీలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రారంభమవుతుంది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా సైబారాబాద్ నగరాన్ని నిర్మించాను. ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశాన్ని భగవంతుడు నాకు కల్పించాడు. విశాఖలో త్వరలోనే గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ప్రజల ఆరోగ్యం విషయంలో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పని చేస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఆరోగ్యానికి అనుసంధానం చేసి తక్కువ వ్యయంతో వైద్యం అయ్యేలా కృషి చేస్తున్నాం. హజ్ యాత్రకు వెళ్లేవారి కోసం త్వరలో అమరావతి నుంచి మక్కాకు ప్రత్యేక విమాన సర్వీసు ప్రారంభిస్తాం. మరోవైపు లులూ ఇంటర్నేషనల్ సంస్థ విశాఖ, విజయవాడల్లో మెగా షాపింగ్ మాల్స్‌ను ఏర్పాటు చేయనుంది. అమరావతిలో మరో షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేయాలని లులూ సంస్థను కోరాం" అని తెలిపారు. సదస్సులో పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ కె.విజయానంద్, సీఐఐ ప్రెసిడెంట్ ఆర్.ముకుందన్, లులూ ఇంటర్నేషనల్ సీఎండీ యూసుఫ్ అలీ తదితరులు మాట్లాడారు. సదస్సు అనంతరం సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రి పెట్టుబడుల అంశంపై మరోసారి ద్వైపాక్షిక చర్చలు చేశారు.

పెట్టుబడులకు అనుకూలం

పెట్టుబడులకు ఆంధ్ర అత్యంత అనుకూలం. ఫుడ్ బౌల్, చిల్లీ స్పైస్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఏపీకి గుర్తింపు ఉంది. అగ్రిటెక్ ఇన్నోవేషన్‌లో అగ్రస్థానంలో ఉంది. పైగా ఏపీకి డైనమిక్ చీఫ్ మినిస్టర్ చంద్రబాబు ఉన్నారు. స్థానిక పరిశ్రమలను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లేందుకు ఇన్వెస్టోపియా తరహా సదస్సులు ఎంతో ఉపకరిస్తాయి.

- ఆర్.ముకుందన్, సీఐఐ అధ్యక్షుడు

విశాఖలో అల్ట్రా మోడరన్ షాపింగ్ మాల్ నిర్మిస్తాం



విశాఖలో అల్ట్రా మోడరన్ షాపింగ్ మాల్ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో కూడా అడుగు పెట్టి విజయవాడలో యూనిట్‌ను స్థాపించాలని భావిస్తున్నాం. ఏపీలో వివిధ పంటల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. విజనరీ లీడర్ చంద్రబాబు తమ రాష్ట్రానికి సంపద సృష్టికి, ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. దావోస్ పెట్టుబడుల సదస్సులో మొదటిసారి కలిసినప్పుడు విశాఖలో అల్ట్రా మోడరన్ షాపింగ్ మాల్ నిర్మించాలని కోరారు. విశాఖలో మాల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ.. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో అది ముందుకు సాగలేదు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చినందున త్వరలోనే విశాఖలో మాల్ నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేస్తాం.

- యూసుఫ్ అలీ, లులూ ఇంటర్నేషనల్ చైర్మన్

నమ్మకమైన భాగస్వామిగా ఏపీ



అగ్రిటెక్, ఫుడ్‌టెక్ రంగాల్లో పెట్టుబడులకు యూఏఈకి నమ్మకమైన భాగస్వామిగా ఏపీ ఉంటుంది. ఆక్వా ఉత్పత్తులతో పాటు పండ్ల ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్నాం. రాష్ట్రంలో 9 మెగా ఫుడ్ పార్క్‌లు ఉన్నాయి. 38 మిలియన్ల మంది నైపుణ్యమున్న మానవ వనరులున్నాయి. మొత్తంగా ఏపీ దేశానికే ఈస్ట్రన్ ఫుడ్ కారిడార్‌గా ఉంది.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి



యూఏఈ మంత్రి అబ్దుల్ బిన్ తౌఖ్ అల్ మర్రిని సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

డేటా విప్లవాన్ని అందిపుచ్చుకుంటున్నాం

» యూఏఈ ఆదర్శంగా ఏఐ సాంకేతికత

» 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఆంధ్రప్రదేశ్' సదస్సులో మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): డేటా విప్లవం ద్వారా అంతర్జాతీయంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో నిలుస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. యూఏఈని ఆదర్శంగా తీసుకుని ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఆంధ్రప్రదేశ్' సదస్సులో ఫైర్ సైడ్ చాట్ అంశంపై జీ42 ఇండియా సీఈవో మనుజైన్ నిర్వహించిన చర్చలో ఆయన పాల్గొన్నారు. దక్షిణాసియాలో తొలి 152 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటయ్యే వ్యాలీలో జనవరిలో ఆవిష్కృతం కాబోతోందని, ఇది మొత్తం ఎకో సిస్టమ్‌ను మార్చబోతోందని తెలిపారు. విశాఖపట్నం డేటా సిటీగా అభివృద్ధి చెందుతుందన్నారు. పలు ప్రఖ్యాత సంస్థలు విశాఖలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నాయని వివరించారు. అంతర్జాతీయ మార్పులకు అనుగుణంగా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యలో ఏఐ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెడుతున్నామన్నారు. పరిపాలనలోనూ ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఏఐతో ఉద్యోగాలు కోల్పోరని, ప్రతి పారిశ్రామిక విప్లవం కొత్త ఉద్యోగాలు సృష్టిస్తుందని చెప్పారు. యూఏఈ-ఆంధ్రప్రదేశ్ పరస్పర సహకారంతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేయాలని భావిస్తున్నామన్నారు. తనకు ఇష్టమైన ఏఐ అప్లికేషన్ చాట్‌జీపీటీ అని లోకేశ్ చెప్పారు. రెన్యూవబుల్ ఎనర్జీ, ఇన్ఫ్రా, డిజిటల్ గవర్నెన్స్, ఏఐ ఫస్ట్ యూనివర్సిటీ, జీనోమ్ సీక్వెన్సింగ్, క్వాంటమ్ వ్యాలీ, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రితో చర్చించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులకు సహకరించాలని కోరారు. యూఏఈ పర్యటనకు రావాలని లోకేశ్‌ను మంత్రి ఆహ్వానించారు.

ఏపీతో కలసి పనిచేసేందుకు సిద్ధం

యూఏఈకి భారత్ నమ్మకమైన భాగస్వామి. దావోస్‌లో సీఎం చంద్రబాబును కలిసినపుడు కేవలం 5 నిమిషాల్లోనే ఏపీ గురించి పూర్తిగా వివరించారు. ఇక్కడ నీటి వనరులు అపారంగా ఉన్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆలవాలమైన ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాం. వయూఏఈ-ఇండియా ఎకనామిక్ కారిడార్‌లో ఏపీ ఓ కీలకమైన భాగస్వామిగా మారుతుంది. ఇన్వెస్టోపియా ద్వారా అన్ని ప్రాంతాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మా లక్ష్యం. ఏఐ, ఫ్యూచర్ ఎకానమీ, రిటైల్, ఏవియేషన్ రంగాల్లో భారత్‌తో భాగస్వామ్యం ఉంది. 250 బిలియన్ డాలర్ల వాణిజ్యం ఉంది. 4.2 మిలియన్ల టూరిస్టులు భారత్ నుంచి యూఏఈకి వచ్చారు. దీంతో రెండు దేశాల మధ్య ఎయిర్ కనెక్టివిటీ బాగా పెరిగింది. ఇరు దేశాల మధ్య 67 వేల సంస్థలు పని చేస్తున్నాయి.

- అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రి, యూఏఈ మంత్రి

నా పేరే పవనం..

అంతటా ఉంటా: డిప్యూటీ సీఎం



విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నియంత పోకడలు ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కొనే శక్తిని సినిమాలు, అభిమానులే తనకు ఇచ్చారని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం సాయంత్రం విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో ఆయన నటించిన హరిహర వీరమల్లు సినిమా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. రెండేళ్ల కిందట విశాఖ నోవాటెల్ హోటల్ నుంచి బయటకు రాకుండా తనను ఇబ్బందులకు గురిచేసి, పోలీసు అధికారులు కాలిబూట్లతో తన్ని అరెస్టు చేయాలని చూడగా, నగరవాసులంతా హోటల్ ముందుకువచ్చి కూర్చున్న విషయాన్ని ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. అందుకే ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటుచేసినట్టు పవన్ కల్యాణ్ తెలిపారు. విశాఖతో తనకు ప్రత్యేక అనుబంధం ఉన్నదన్నారు. ఈ మాట తానంటే.. ఎక్కడికి వెళితే అక్కడ పవన్ అక్కడే పుట్టాను.. అక్కడే పెరిగాను..అని అంటుంటారని కొందరు విమర్శిస్తుంటారన్నారు. "నా పేరే పవనం... అంతటా ఉంటాను. మా నాన్న ఉద్యోగం వల్ల అనేక ప్రాంతాలు వెళ్లాల్సి వచ్చింది. ఇది తెలియకుండా మాట్లాడేవారంతా కూపస్థ మండూకాలు. బావిలో కప్పలు. వాళ్లు అంతకు మించి ఆలోచించలేరు." అని పవన్ విమర్శించారు. సినిమాకు కుల, మత, ప్రాంత భేదాలు ఉండవన్నారు. సనాతన ధర్మం ఇతర మతాలకు వ్యతిరేకం కాదని, అందరినీ ఆ ధర్మం కలుపుకొని పోతుందని పవన్ వెల్లడించారు.

విశాఖలో 20,216 కోట్ల పెట్టుబడులు

» 50,600 మందికి ఉద్యోగాలు

» నాలుగు సంస్థల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం

» నేడు క్యాబినెట్ ముందుకు నిర్ణయాలు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖకు మరో నాలుగు ప్రతిష్ఠాత్మక సంస్థలు రానున్నాయి. సిఫి, సత్వా, బీవీఎం, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు విశాఖలో రూ. 20,216 కోట్ల పెట్టుబడులతో, 50,600 ఉద్యోగాల కల్పన ప్రతిపాదనలతో ముందుకు వచ్చాయి. డిజిటల్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలో ప్రఖ్యాత సంస్థ సిఫి 16,466 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. సత్వ డెవలపర్స్ 1,500 కోట్లు, బీవీఎం ఎనర్జీ 1,250 కోట్లు, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ 1,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన తొమ్మిదో పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఆ నాలుగు సంస్థల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అలాగే ఆ సంస్థలకు పారిశ్రామిక విధానం మేరకు రాయితీపై భూములు అప్పగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎస్ఐపీబీలో ఆమోదించిన నిర్ణయాలను గురువారం క్యాబినెట్ ముందుంచుతారు. అది ఆమోదముద్ర వేశాక ఆ నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేస్తుంది. ఇక 4 సంస్థల ప్రాధాన్యం, పెట్టుబడులతో యువతకు లభించే ఉపాధి అవకాశాలు, రాష్ట్రాభివృద్ధిలో ఈ సంస్థల భాగస్వామ్యం వంటి అంశాలను ఎస్ఐపీబీలో మంత్రి లోకేశ్ వివరించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భవిష్యత్తులో పెట్టుబడుల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఆర్సెల్లార్ మిట్టల్‌కు భూములు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఈ క్రమంలో విశాఖకు తరలివచ్చే పారిశ్రామిక సంస్థలకు మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సీఎం చెప్పారు. బెంగళూరు వంటి పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా మారిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కూడా కష్టమవుతోందన్నారు. అందుకే విమానాశ్రయం, రైలు కనెక్టివిటీ, హైవే రోడ్లు, మెట్రో వంటి వాటిపై ముందస్తు ప్రణాళికలు ఉండాలని, దీనికి తగ్గట్లు కార్యాచరణ ప్రణాళికలపై ఫోకస్ పెట్టాలని అధికారులకు సూచించారు. దీని వల్ల మున్ముందు పౌరజీవనంలో ఎలాంటి సమస్యలూ తలెత్తవని సీఎం పేర్కొన్నారు. పారిశ్రామిక, ఇన్ఫర్మేషన్ కంపెనీలకు సమీపంలో ఉద్యోగులు నివాసం ఉండేలా మౌలిక సదుపాయాలను కల్పిస్తే ట్రాఫిక్ సమస్యనూ తగ్గించవచ్చన్నారు. విద్యాసంస్థలు, మాల్స్ వంటివి జనావాసాల సమీపంలోనే ఉంటే ఆర్థిక భారంలేని నగర జీవనం అందుబాటులో ఉంటుందన్నారు.

విశాఖలో పెట్టుబడులు పెట్టే సంస్థలు, కల్పించే ఉద్యోగాలు

సంస్థ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగాలు	భూ ప్రతిపాదనలు
సిఫీ ఇన్‌ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్	1,466	200	సబ్సిడీపై భూ కేటాయింపు
సిఫీ ఇన్‌ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్	15,000	400	సబ్సిడీపై భూ కేటాయింపు
సత్వ డెవలపర్స్	1,500	25,000	29.88 ఎకరాలు అభివృద్ధి చేసిన భూమి
బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రై.లిమిటెడ్	1,250	15,000	వైజాగ్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటు. 30 ఎకరాలు అభివృద్ధి చేసిన భూమి
ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రై.లిమిటెడ్	1,000	10,000	రెండున్నర ఎకరాలు.మరో 7.7 ఎకరాలు సబ్సిడీధరకు అందించాలి
మొత్తం	20,216	50,600	

ముందస్తు బెయిల్‌పై 49 పేజీలతో తీర్పా?

- బెయిల్ దశలోనే మొత్తం విచారణ జరిపినట్టు ఉంది
- ఐపీఎస్ సంజయ్ కేసులో సుప్రీంకోర్టు ఆశ్చర్యం



న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అగ్నిమాపక విభాగంలో పనిచేసినప్పుడు ఐపీఎస్ అధికారి సంజయ్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ ఏపీ హైకోర్టు 49 పేజీలతో తీర్పు వెలువరించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తీర్పు తీరును చూస్తే.. ముందస్తు బెయిల్ దశలోనే మొత్తం కేసు విచారణను జరిపినట్టు ఉందని వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించిన ఒప్పంద పత్రం, ఇన్‌వాయి‌స్‌లను వారం రోజుల్లో (ఈనెల 30వ తేదీ) అందజేయాలని ఆదేశించింది. అదే రోజు తదుపరి వాదనలు వింటామని జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. విచారణ సందర్భంగా.. అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. సంజయ్ అవినీతికి పాల్పడ్డారని చెప్పేందుకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, హైకోర్టు మాత్రం అవేమీ పరిగణనలోకి తీసుకోకుండానే ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాగా, సంజయ్ వైసీపీ హయాంలో అగ్నిమాపక విభాగం, సీఐడీ విభాగాల్లో పనిచేశారు. ఈ సమయంలో ఆయన పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్టు కూటమి ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రెండు వేర్వేరు నివేదికలు ఇచ్చింది. "అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు (ఎన్వోసీలు) ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్‌వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. అలాగే, సీఐడీ చీఫ్ హోదాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు చెల్లించారు. కానీ, సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించకపోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.రెండు కోట్ల మేర నష్టం కలిగించారు." అని ఆ నివేదికల్లో పేర్కొంది. వాటి ఆధారంగా సంజయ్‌పై అగ్నిమాపక విభాగంలో జరిగిన అవినీతికి సంబంధించి ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ కేసులో ఏపీ హైకోర్టు సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును ఈ ఏడాది మార్చి 5న ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

భర్తను చంపి అత్తింటికే డోర్ డెలివరీ...!?

- మృతదేహాన్ని పల్నాడు నుంచి నంద్యాలకు తీసుకెళ్లిన భార్య
- మృతుడి కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు



రమణయ్య, రమణమ్మ దంపతులు

పిడుగురాళ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడిన భార్య పుట్టింటికి వెళ్లింది. తనకు ఆరోగ్యం బాగోలేదంటూ భర్తకు ఫోన్ చేసి పిలిపించింది. అక్కడ ఏం జరిగిందో ఏమో తెలీదు.. భర్త శవమై కనిపించాడు. ఆ మృతదేహాన్ని తీసుకుని ఆమె నేరుగా అత్తింటికి వెళ్లింది. మద్యం సేవించి ఇంట్లో కుప్పకూలి చనిపోయాడని వారితో చెప్పింది. అయితే ఒంటిపై గాయాలు ఉండడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లాలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్లలోని ప్రజాశక్తినగర్‌కు చెందిన రమణమ్మకు నంద్యాల జిల్లాలోని నూనెపల్లెకు చెందిన మేకల శేషాచలం (50) అలియాస్ రమణయ్యతో ఇరవై ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి జ్యోతి, చందన, సాయి అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. రమణయ్య పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అప్పుడప్పుడూ భర్తతో గొడవ జరిగినప్పుడు రమణమ్మ పిడుగురాళ్లలోని పుట్టింటికి వచ్చి కొన్నాళ్లు ఉండేది. భర్త, పెద్దమనుషులు ఆమెను బుజ్జగించి నంద్యాల తీసుకెళ్తుండేవారు. రెండు నెలల క్రితం భర్తతో గొడవపడిన రమణమ్మ పిడుగురాళ్లకు వచ్చింది. ఈ క్రమంలో భర్తకు ఫోన్ చేసి తన ఆరోగ్యం బాగోలేదని చెప్పడంతో ఆయన సోమవారం నంద్యాల నుంచి పిడుగురాళ్లకు వచ్చాడు. భార్యకు నచ్చజెప్పి తనతో తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా ఆమె వినిపించుకోలేదు. సోమవారం రాత్రి కూడా వారి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. అయితే మంగళవారం కారులో రమణయ్య మృతదేహంతో రమణమ్మ, ఆమె సోదరుడు రామయ్య నంద్యాలలోని రమణయ్య ఇంటికి వెళ్లారు. అక్కడ వారు ఏమైందని ప్రశ్నించగా.. మద్యంతాగి పక్కింటి వారితో గొడవపడిన రమణయ్య కొద్దిసేపటికి ఇంట్లోకి వచ్చి కుప్పకూలి చనిపోయాడని చెప్పారు. అయితే మృతదేహాన్ని పరిశీలించిన రమణయ్య చిన్న కుమార్తె చందన... కంట్లో కారం చల్లినట్లు, ఒంటిపై గాయాలున్నట్లు గుర్తించింది. తన తండ్రి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఇక ఈడీ వేడి!

(మొదటి పేజీ తరువాయి)

ఈడీ ఇప్పటికే 'సిట్' నుంచి ఈ కేసు వివరాలను తీసుకుంది. దీనిపై తాను సొంతంగా దర్యాప్తు ప్రారంభించింది. మరీ ముఖ్యంగా... తన పరిధిలోకి వచ్చే మనీ లాండరింగ్‌పై దృష్టి సారించింది. దీనికి సంబంధించిన ఆధారాలు లభించడంతో శర్వాణీ ఆల్కో బ్రూ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డిని విచారణకు పిలిచింది. ఇక కదలాల్సింది విదేశీ డొంకే.

'ఆంధ్రా గోల్డ్' వీరిదే...

జగన్ హయాంలో అతి భారీగా లిక్కర్ ఆర్డర్లు పొందిన కంపెనీల్లో 'శర్వాణీ' ఒకటి. ఈ వివరాలను 'సిట్' తన చార్జిషీటులో ప్రస్తావించింది. అంతకుముందు ఈ కంపెనీ 'ఆంధ్రాగోల్డ్ విస్కీ' తయారు చేసేది. ధరలు పెంచి, ఆర్డర్లు ఇచ్చే కుట్రలో భాగంగా అదే పేరు ధ్వనించేలా దానిని "ఆంధ్రాగోల్డ్ ఫైన్ విస్కీ'గా మార్చారు. అంతకు ముందు రూ.696 ఉన్న కేసు ధరను రూ.854కు పెంచారు. ఐదేళ్లలో ఈ బ్రాండ్‌కే రూ.39.86 కోట్లు అదనంగా చెల్లించారు. ఇక... శర్వాణీకే చెందిన ఓల్డ్ అడ్మిరల్ డీలక్స్ బ్రాండ్ బ్రాందీ పేరును 'ఓల్డ్ అడ్మిరల్ ఫైన్ బ్రాందీ'గా మార్చి... కేసు ధరను రూ.688 నుంచి 804కు పెంచారు. అసలు విషయం ఏమిటంటే... వైసీపీ అధికారంలోకి వచ్చాకే శర్వాణీ ఆల్కోబ్రూ లిమిటెడ్‌కు 'మంచి రోజులు' మొదలయ్యాయి. వీళ్లు పెట్టిన ప్రతి 'ఆర్డర్ రిక్వెస్ట్'నూ అనుమతించారు. 2019-20లో 4 లక్షల కేసులకు మాత్రమే ఆర్డర్ ఇవ్వగా... ఆ తర్వాత వరుసగా ఏటా 16లక్షల కేసులను 'శర్వాణీ' నుంచి కొనుగోలు చేయడం గమనార్హం.

అప్పుడే ఆరోపణలు...

మద్యం అక్రమాల్లో శర్వాణీ ఆల్కోబ్రూ పాత్ర కూడా ఉందంటూ 2022లోనే ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో టీడీపీ నేతలు 'శర్వాణీ' అక్రమాలపై ప్రెస్‌మీట్ పెట్టి వివరించారు. దీంతో... వారిపైనా, ఆ వార్తలు ప్రచురించిన మీడియా సంస్థలపైనా కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు... అదే కంపెనీకి ఈడీ నోటీసులు పంపింది. చంద్రారెడ్డికి ఎంపీ మిథున్ రెడ్డితోసహా పలువురు వైసీపీ నేతలతో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. 'సిట్' పలుమార్లు ఆయనకు నోటీసులు ఇచ్చినా విచారణకు రాలేదు. తనకు 60 ఏళ్లవయసు పైబడినందున విచారణకు హాజరు కాలేనంటూ తప్పించుకుంటూ వచ్చారు. ఇప్పుడు... అదే చంద్రా రెడ్డికి ఈడీ నుంచి పిలుపు వచ్చింది. మద్యంలో వచ్చిన ముడుపుల సొమ్మును అమెరికాతోపాటు దక్షిణాసియా, ఆఫ్రికా వంటి దేశాల్లో పెట్టుబడులుగా పెట్టే ప్రయత్నాలు బలంగా జరిగినట్లు ఈ కేసులో కీలక నిందితుడుగా ఉన్న ప్రణయ్ ప్రకాశ్ వాంగ్మూలం ఇచ్చారు. ఆఫ్రికాలో మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టాలనుకున్నట్లుగా, పలు కీలక కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు.

లిక్కర్ నిందితుల పిటిషన్లపై విచారణ వాయిదా

విజయవాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ, చెరుకూరి వెంకటేశ్‌నాయుడు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. తిరుపతిలోని స్విమ్స్‌లో ఫిజియోథెరపి చేయించుకోవడానికి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ 25వ తేదీకి, వెంకటేశ్‌నాయుడు పిటిషన్‌పై వాదనలు 28వ తేదీకి వాయిదా పడ్డాయి. గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై సిట్ అధికారులు బుధవారం కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై విచారణ 29వ తేదీకి వాయిదా పడింది.

తాగుడు పెంచింది జగనే



'రాష్ట్ర ప్రజలందరికీ చెప్తా ఉన్నా. చంద్రబాబు చేస్తాడో, లేదో తెలియదు. కానీ బుద్ధి ఉన్నోళ్లయితే చేయాలి. రెండేళ్లకో మూడేళ్లకో మన ప్రభుత్వం వస్తుంది. పూర్తిగా మద్యాన్ని నిషేధిస్తామని గట్టిగా చెబుతున్నా. మద్యం రేట్లు షాక్ కొట్టేలా పెంచుతాం. ఫైవ్ స్టార్ హోటళ్లలో తప్ప ఎక్కడా మద్యం దొరకుండా చేస్తాం.'...2019 ఎన్నికలకు ముందే జగన్ పదే పదే ఇచ్చిన హామీ ఇది. అన్నట్టుగానే ఐదేళ్ల పాలనలో జగన్ షాక్ ఇచ్చారు. కమీషన్లు నొక్కేయడంకోసం తగ్గిన తాగుడును కూడా ఒక్కసారిగా పెంచేసి, మద్యనిషేధం చేస్తారని నిజంగా తనను నమ్మిన మహిళలకు జగన్ షాక్ ఇచ్చారు! అదెలాగంటే..

కమీషన్లు నొక్కేయడానికి పన్నుల వ్యూహం

లిక్కర్ స్కాంపై సిట్ చార్జిషీట్‌లో బయటపడ్డ కుట్ర

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో దశలవారీగా మద్య నిషేధం చేస్తామని ప్రకటించి 2019లో జగన్ అధికారంలోకి వచ్చారు. కానీ, పదవిలో ఉన్న ఐదేళ్లూ మద్యంపై భారీగా కమీషన్లు పట్టడంపైనే వైసీపీ అధినేత దృష్టి పెట్టారు. అందుకు అనుగుణంగానే పన్నుల వ్యూహరచన చేశారని మద్యం స్కామ్‌ను విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన చార్జిషీట్‌లో వెల్లడించింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో జగన్ ఒకసారి పన్నులు పెంచారు. 2019 సెప్టెంబరులో జీవో 422 ద్వారా అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఏఆర్ఈటీ) అనే కొత్త పన్నును మద్యంపై విధించారు. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్, ఫారిన్ లిక్కర్‌పై ఈ పన్ను వేశారు. 2020 మేలో ఏఆర్ఈటీని ఇంకా పెంచారు. ఫలితంగా మద్యం రేట్లు పెరిగాయి. అమ్మకాలు భారీగా పడిపోయాయి. 2020-21లో అమ్మకాలు దాదాపుగా సగానికి సగం పడిపోయాయి. దీంతో నిజంగానే జగన్ మద్య నిషేధం చేసేస్తారని మహిళలు ఆశ పడ్డారు. కానీ కొంతకాలానికే జగన్ మాట తప్పి, పెంచిన ధరలను అందరూ తాగేలా తగ్గించేశారు. తద్వారా సంపూర్ణ మద్యపాన నిషేధం చేయకపోవడం సంగతి అటుంచితే, తగ్గిపోయిన మద్యం అమ్మకాలు పెంచేశారు. నిజంగా మద్యం నిషేధం లేదా నియంత్రణ చేయాలనే ఉద్దేశమే ఉంటే పడిపోయిన అమ్మకాలు మళ్లీ ఎలా పెరిగాయి? పెంచిన మందు రేట్లను ఎందుకు తగ్గించారు? అంటే కేవలం కమీషన్ల కోసమే ఈ స్థాయిలో అమ్మకాలు పెంచినట్లు స్పష్టమవుతోంది. ఇలా మద్యం రేట్లు, పెంచి తగ్గించడం వెనుక అసలు కుట్ర కోణం కమీషన్లేనని సిట్ తన చార్జిషీట్‌లో పేర్కొంది.

ఇలా దించేశారు..: తొలుత పన్నులు పెంచిన జగన్ సర్కారు.. అనంతర కాలంలో విరుద్ధమైన నిర్ణయం తీసుకుంది. ఏఆర్ఈటీ పన్ను భారీగా పెంచడం వల్ల లిక్కర్ అమ్మకాలు పడిపోయాయి. దాదాపు రెట్టింపు ధరలతో మద్యం కొనుగోలు చేయలేక మందుబాబులు మద్యం తాగే విషయంలో కొంతమేర వెనక్కి తగ్గారు. 2019-20లో 5.2కోట్ల కేసుల లిక్కర్ అమ్ముడైతే, పన్నులు పెంచడంతో 2020-21లో అమ్మకాలు 2.43కోట్ల కేసులకు పడిపోయాయి. అమ్మకాలు బాగుంటే మద్యంపై కమీషన్లు వస్తాయి. కానీ అమ్మకాలు తగ్గిపోయిన కారణంగా కమీషన్లూ తగ్గాయి. దీంతో ఉలిక్కిపడిన తాడేపల్లి శిబిరం వెంటనే అమ్మకాలు పెంచేందుకు పన్నులు తగ్గించేసింది. 2020 సెప్టెంబరులో జీవో 256 జారీచేసి ఏఆర్ఈటీని భారీగా తగ్గించారు. అది కూడా లిక్కర్ మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముడుపోయే క్వార్టర్ రూ.150 వరకు ధరలున్న బ్రాండ్ల ధరలనే తగ్గించారు. అవి తాగే పేదలు మళ్లీ తాగుడు పెంచారు. దీంతో 2023-24 నాటికి 4.63 కోట్ల కేసులకు మద్యం అమ్మకాలు పెరిగిపోయాయి.

తగ్గి...పెరిగిన అమ్మకాలు (కేసుల్లో)

సంవత్సరం	లిక్కర్	బీర్
2019-20	3.08కోట్లు	2.12కోట్లు
2020-21	1.86కోట్లు	57లక్షలు
2021-22	2.63కోట్లు	81లక్షలు
2022-23	3.35కోట్లు	1.16కోట్లు
2023-24	3.46కోట్లు	1.17కోట్లు

విరుద్ధ నిర్ణయం అందుకే...

వైసీపీ ప్రభుత్వం తాను తీసుకున్న నిర్ణయానికి విరుద్ధంగా మరో నిర్ణయం తీసుకోవడాన్ని చార్జిషీట్‌లో సిట్ కీలకంగా ప్రస్తావించింది. 'పన్నులపై తొలుత ఇచ్చిన జీవో వల్ల అమ్మకాలు తగ్గాయి. కానీ ఆ తర్వాత తెచ్చిన జీవో పూర్తి వ్యతిరేక దిశలో ఉండి, అమ్మకాలను పెంచింది. కమీషన్ల కోసం నాలుగు నెలల్లోనే పెంచిన పన్నులను తగ్గించేశారు' అని సిట్ స్పష్టంచేసింది. మళ్లీ రెండు నెలలకు మీడియం, ప్రీమియం బ్రాండ్ల ధరలు కూడా తగ్గేలా ఏఆర్ఈటీని ఇంకా తగ్గిస్తూ మరో జీవో 312ను జారీచేశారు. వ్యాట్, స్పెషల్ మార్జిన్, అదనపు ఎక్సైజ్ డ్యూటీని కూడా సవరించారు. నిజంగా మద్యం అమ్మకాలు తగ్గించడమే అసలు ఉద్దేశం అయితే పెంచిన పన్నులను అలాగే కొనసాగించాలి. కానీ షాక్ కొట్టేలా భారీగా పెంచిన పన్నులను నెలల వ్యవధిలోనే భారీగా తగ్గించారని సిట్ తెలిపింది.

అనిల్ అనుచరుల ఖాతాల్లో వందల కోట్ల లావాదేవీలు!

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. శ్రీకాంత్‌రెడ్డి ఖాతాల నుంచి ఎవరెవరికి డబ్బులు వెళ్లాయనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. కొందరు వైసీపీ పెద్దల ఖాతాలకు కొంత మొత్తం బదిలీ అయినట్లు తెలిసింది. అలాగే సైదాపురం మండలంలో అనిల్ మరో అనుచరుడి ఖాతాలో రూ.17 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ మండలంలో అనిల్ బాధితులైన క్వారీల మాజీ యజమానులు అతడి బ్యాంక్ స్టేట్‌మెంట్లను బుధవారం పోలీసులకు అందజేసినట్లు విశ్వసనీయ సమాచారం. శ్రీకాంత్‌రెడ్డి, సైదాపురం వ్యక్తే కాదు.. పదుల సంఖ్యలో అనిల్ అనుచరులు అప్పట్లో క్వార్ట్జ్ అక్రమ రవాణా వ్యవహారాలను పర్యవేక్షించారని తేలింది.

అనధికార వేలం.. అనిల్ పరం

వాస్తవానికి వైసీపీ ప్రభుత్వ అండదండలతో క్వార్ట్జ్ అక్రమ రవాణా పెద్దఎత్తున సాగింది. రెండు దశాబ్దాల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా చైనాలో క్వార్ట్జ్ రేటు పెరగడం, విపరీతమైన డిమాండ్ ఏర్పడిన విషయాన్ని పసిగట్టిన వైసీపీ పెద్దలు.. నెల్లూరు జిల్లాలో విస్తారంగా ఉన్న క్వార్ట్జ్ నిక్షేపాలపై కన్నేశారు. లీజు పరిధిలో ఉన్న గనులను, ప్రభుత్వ భూముల్లో ఉన్నవాటిని అనధికారికంగా వేలం పెట్టారు. తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతో అప్పటి సీఎం జగన్ ప్రియభక్తుడైన అనిల్ వాటిని దక్కించుకున్నారని అప్పట్లోనే విస్తృతంగా ప్రచారం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి విచారణలో దీనిని ధ్రువీకరించాడు. నెలకు రూ.40 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు కప్పంగా కట్టాలన్న ఒప్పందంతో మొత్తం క్వార్ట్జ్ క్వారీలన్నింటినీ అనిల్‌పరం చేశారు. ఎప్పటినుంచో లీజుదారులుగా కొనసాగుతున్న వారు ఎంత మొత్తుకున్నా లాభం లేకుండా పోయింది. లీజుదారులు విక్రయించే క్వార్ట్జ్‌పై టన్నుకు రూ.10 వేల చొప్పున అనిల్‌కుమార్‌కు కప్పం కట్టేలా హుకుం జారీ చేశారు. జిల్లా మైనింగ్ అధికారులే దగ్గరుండి ఈ వ్యవహారాలను చక్కబెట్టారు. దీనికితోడు ప్రభుత్వ భూములు, లీజు గడువు ముగిసిన క్వారీలపై పడి నేరుగా వేల టన్నుల క్వార్ట్జ్ తవ్వి తరలించి అమ్ముకున్నారు. ఒక్క సైదాపురం మండలం జోగుపల్లిలోనే 15కు పైగా అనధికారిక క్వారీల నుంచి రోజుకు 40-50 లోడ్ల క్వార్ట్జ్‌ను చెన్నై తరలించారు. ఈ వ్యవహారాల్లో అనిల్, కాకాణి తమ చేతికి మట్టి అంటకుండా ఎక్కడిక్కడ తమ మనుషులను ఏజెంట్లుగా పెట్టుకుని వారి ద్వారా డబ్బు వసూలు చేశారనే ప్రచారం ఉంది. శ్రీకాంత్‌రెడ్డి, అతడి కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్లను పరిశీలించగా.. ఏడాదిన్నర కాలంలోనే కొన్ని వందల కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారని తెలిసింది. ఈ డబ్బులు ఎక్కడి నుంచి వారి అకౌంట్లలోకి వచ్చాయి.. వాటి నుంచి ఏయే ఖాతాలకు వెళ్లాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అనధికారిక క్వారీల్లో తవ్వి విక్రయించిన మొత్తాన్ని హవాలా మార్గంలో విదేశీ వ్యాపారులకు తరలించి.. అక్కడి నుంచి వైట్‌రూపంలో వెనక్కి తెచ్చుకున్నారని.. లీజుదారుల నుంచి టన్నుకు పది వేల చొప్పున వసూలు చేసి, తమ సన్నిహితుల అకౌంట్లలో జమ చేసి.. తర్వాత సొంత ఖాతాలకు బదిలీ చేసుకున్నారని.. తాడేపల్లి ప్యాలెస్ వాటాను వైట్ రూపంలోనే అందజేశారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారానికి అనిల్‌ను సూత్రధారిగా నిర్ధారించి.. పటిష్ఠంగా కేసు పెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. రూ.వందల కోట్ల లావాదేవీలపై ఈడీ కూడా మనీలాండరింగ్ కేసు నమోదు చేయివచ్చని ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. అనిల్ అనుచరుడొకరిని పట్టుకునేందుకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు పోలీసులు వెళ్లేసరికే అతడు విదేశాలకు ఎగిరిపోయాడని సమాచారం.

బయట విరోధులు.. లోపల భాగస్వాములు

క్వార్ట్జ్ దోపిడీలో మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ కలిసిమెలిసి పనిచేసుకున్నారన్న సమాచారం తెలుసుకుని నెల్లూరు జిల్లా ప్రజలు విస్తుపోయారు. బయటకు వారిద్దరూ బద్ధశత్రువులు. జగన్ జమానాలో వీరిద్దరి వ్యవహారశైలి అలాగే కనిపించింది. తొలి మంత్రివర్గ విస్తరణలో అనిల్ తనకు అడ్డుపడ్డాడని కాకాణికి కోపం. అనిల్ రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేసినా ఒక్కరోజు కూడా కాకాణి నియోజకవర్గమైన సర్వేపల్లిలో అడుగుపెట్టలేకపోయారు. కాకాణి ఆయన్ను రానివ్వలేదు. రెండో విస్తరణలో కాకాణికి మంత్రి పదవి దక్కింది. అనిల్ పదవి కోల్పోయారు. దీనికి కారణం కాకాణేనని అనిల్ వర్గం ప్రచారం చేసుకుంది. ఆ రెండున్నరేళ్లు కూడా వీరిద్దరి మధ్య బయటకు సత్సంబంధాల్లేవు. అయితే అంతర్గతంగా అప్తులని తాజాగా తేలింది. అవినీతిలో తోడు దొంగలంటూ జనం వ్యాఖ్యానిస్తున్నారు.

భార్య స్నానం చేస్తుండగా వీడియోలు తీసి..

- డబ్బులివ్వకపోతే ఆన్‌లైన్‌లో పెడతానని బెదిరించి
- ఓ భర్త దుర్మార్గం.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, జూలై 23: ప్రభుత్వ ఉద్యోగిని అయిన 31ఏళ్ల వివాహిత తన భర్త మీద పోలీసులకు ఫిర్యాదు చేసింది. పడకగదిలో, బాత్‌రూంలో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి అభ్యంతరకర రీతిలో తన కదలికలను చిత్రీకరించాడని ఆరోపించింది. బాధితురాలిది మహారాష్ట్ర. ఆమె భర్త కూడా ప్రభుత్వ ఉద్యోగే. ఆయన తనపై వరకట్న వేధింపులకు పాల్పడుతున్నాడనీ ఆమె ఫిర్యాదులో ఆరోపించింది. కారుకు సంబంధించిన వాయిదాలు కట్టేందుకు పుట్టింటికి వెళ్లి రూ.1.5 లక్షలు తేవాలంటూ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో బాధితురాలు ఆరోపించింది. డబ్బు తీసుకురాకుంటే తాను చిత్రీకరించిన దృశ్యాలను ఆన్‌లైన్‌లో పెడతానంటూ బెదిరిస్తున్నాడని, భర్త దుశ్చేష్టలకు అతడి కుటుంబసభ్యులు మద్దతు పలుకుతున్నారని పేర్కొంది. కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆమె భర్త, అత్త, ముగ్గురు ఆడపడచులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



జైల్లో ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి బయటకు వస్తున్న వైసీపీ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తానేటి వనిత, భరత్

జగన్ వస్తే 'సిట్' ఉండదు.. దర్యాప్తే!



- మమ్మల్ని ఉగ్రవాదులుగా చూస్తున్నారు
- వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు
- రాజమండ్రి జైల్లో మిథున్‌తో ములాఖత్
- సెల్యూట్ చేసి స్వాగతం పలికిన జైలు ఎస్సై

రాజమహేంద్రవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలను రాష్ట్ర ప్రభుత్వం తాలిబన్లు, టెర్రరిస్టుల మాదిరి చూస్తోందని వైసీపీ సీనియర్ నేత, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మద్యం కుంభకోణం కేసులో పెద్దిరెడ్డి కుమారుడు, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఆయనను ములాఖత్ ద్వారా బుధవారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలిశారు. అనంతరం రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "ఢిల్లీలో ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసేసిన అప్పటి సీఎం కేజ్రీవాల్.. వాటిని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జరిగిన కుంభకోణంలో ఆయన జైలుకు వెళ్లారు. ఏపీలో కూడా ఇప్పుడు అలాంటి కుంభకోణమే జరుగుతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వీటన్నింటిపై 'సిట్'లాంటి వేమీ వేయం. నేరుగా దర్యాప్తే చేస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైసీపీ నాయకులను టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతున్నారు. అయినా ఇబ్బంది లేదు. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే న్యాయస్థానాలనే ఆశ్రయిస్తాం. మిథున్ రెడ్డి బాగున్నారు. సంతోషంగా ఉన్నారు." అని అన్నారు. మాజీ హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. "మిథున్ రెడ్డిపై కేసు ఒక డ్రామా. మా ప్రభుత్వం ఎలాంటి డిస్టిలరీకి అనుమతి ఇవ్వలేదు. ధరలు పెంచడంతో మద్యం నియంత్రణ జరిగింది." అని పేర్కొన్నారు.

'భక్తి' చాటిన సబ్ ఇన్‌స్పెక్టర్

వైసీపీ నేతలు రామచంద్రారెడ్డి, వనిత, భరత్‌లకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు సెల్యూట్ చేయడం విమర్శలకు దారితీసింది. రాజమండ్రి జైలు మొదటి గేటు వద్ద కారు దిగి లోపలకు వెళుతుండగా వైసీపీ నేతలకు జైలు సిబ్బంది(ఎస్‌ఐ క్యాడర్) ఒకరు సెల్యూట్ చేశారు. అంతే కాదు, వారిని సాదరంగా ఆహ్వానించి లోపలకు తీసుకువెళ్లారు.

మిథున్‌కు సహాయకుడా!

- జైలు మాన్యువల్‌లోనే లేదు
- సూపరింటెండెంట్ రాహుల్

మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి జైలుకు వెళ్లిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి జైల్లో సహాయకుడిని నియమించాలని కోర్టు ఆదేశించడం పట్ల రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ విస్మయం వ్యక్తం చేశారు. 'సహాయకుడు' అనే మాట జైలు మాన్యువల్‌లోనే లేదన్నారు. మిథున్‌రెడ్డికి ఈ సదుపాయం కల్పిస్తే మిగిలిన ఖైదీలు కూడా ఇలాంటి సదుపాయాలే కోరుకుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో మిథున్‌కు కల్పించిన సదుపాయాలపై కోర్టులో రివ్యూపిటిషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. కోర్టు ఆదేశాలతో కుర్చీ,టేబుల్,టీవీ, ఇంటి భోజనం అందించే ఏర్పాటు చేశామన్నారు.

లిక్కర్ నిందితులపై రెడ్ కార్నర్ నోటీసులు!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నట్లు ఇప్పటికే కోర్టుకు తెలియజేసిన అధికారులు.. వారిపై రెడ్‌కార్నర్ నోటీసు జారీచేయించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)తో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈడీ సహకారం కూడా తీసుకోనున్నారు. 9 మంది నిందితుల్లో ఆరుగురు.. టి.ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, షేక్ సైఫ్ అహ్మద్, సైమన్ ప్రసన్, బొల్లారం శివకుమార్, కొల్లిపురి మోహన్, ప్రద్యుమ్న ఒంగోలు, రాజీవ్ ప్రతాప్ పింగళి దుబాయ్‌లో ఉండగా.. మరో ముగ్గురు.. ముప్పిడి అవినాశ్‌రెడ్డి, ముప్పిడి అనిరుధ్‌రెడ్డి, కొమ్మారెడ్డి అవినాశ్‌రెడ్డి థాయ్‌లాండ్‌లో మకాం వేశారు.

వాంటెడ్ నిందితుడు	పరారైన రోజు	ఉంటున్న దేశం
టి.ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9)	20-11-2024	దుబాయ్
షేక్ సైఫ్ అహ్మద్ (ఏ-10)	09-08-2024	దుబాయ్
సైమన్ ప్రసన్ (ఏ-41)	22-02-2025	దుబాయ్
బొల్లారం శివకుమార్ (ఏ-42)	18-03-2025	దుబాయ్
కొల్లిపురి మోహన్ (ఏ-44)	08-05-2025	దుబాయ్
ప్రద్యుమ్న ఒంగోలు(ఏ-48)	03-06-2025	దుబాయ్
రాజీవ్ ప్రతాప్ పింగళి (ఏ-48)	2021 నుంచి..	దుబాయ్
ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ-7)	28-02-2025	థాయ్‌లాండ్
ముప్పిడి అనిరుధ్‌రెడ్డి (ఏ-43)	19-03-2025	థాయ్‌లాండ్
కొమ్మారెడ్డి అవినాశ్‌రెడ్డి (ఏ-46)	10-02-2025	థాయ్‌లాండ్

ఆ వ్యాజ్యాలు నేను విచారించను!

- మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ లక్ష్మణరావు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై. లక్ష్మణరావు తప్పుకొన్నారు. అలాగే, మద్యం కుంభకోణం వ్యవహారానికి సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్ విషయంలో దాఖలైన ఏ వ్యాజ్యాన్నీ విచారించబోనని ఆయన ప్రకటించారు. కేసు ఫైలును ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందు ఉంచి సాధ్యమైనంత త్వరగా వ్యాజ్యం మరో న్యాయమూర్తి ముందు విచారణకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించారు. మోహిత్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

ఆర్టీసీ బస్సునే ఎత్తుకెళ్లాడు!

- నెల్లూరుపాలెం వద్ద పట్టుకున్న అధికారులు



నిందితుడు కృష్ణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో చోరీలు జరగడం సాధారణంగా చూస్తుంటాం... వింటుంటాం! అయితే ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సునే ఎత్తుకెళ్లాడు. వివరాలివీ.. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ప్రతి రోజూ ఏఎస్‌పేటకు నడుస్తుంది. మంగళవారం రాత్రి డ్రైవర్, కండక్టర్లు ఆత్మకూరు బస్టాండులో నైట్‌హాల్ట్ ఉంచారు. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి ఆ బస్సును డ్రైవ్ చేసుకుంటూ తీసుకువెళ్లిపోయాడు. ఉదయం బస్సు కనిపించకపోవడంతో బస్ డ్రైవర్ నెల్లూరు-2 డిపో, ఆత్మకూరు బస్టాండు మేనేజర్లకు సమాచారం అందించారు. దీంతో అధికారులు టోల్‌ప్లాజాల వద్ద నిఘా పెట్టగా.. బస్సు బుచ్చి టోల్‌ప్లాజా దాటినట్లు తెలిసింది. వెంటనే నెల్లూరుపాలెం వద్ద ఆర్టీసీ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో వారు స్థానికులతో కలిసి బస్సును అడ్డుకున్నారు. డ్రైవర్‌ను పట్టుకొని స్తంభానికి కట్టేశారు. బస్సును తీసుకెళ్లిన వ్యక్తి జిల్లాలోని విడవలూరు మండలం కంచరపాలేనికి చెందిన కృష్ణగా గుర్తించారు. అయితే, కృష్ణ కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.